ఈనాడు
హైదరాబాద్
HMDA
గురువారం అక్టోబరు 17, 2024



చుట్టుముడుతున్న సాగర్ కంపు

నెక్లెస్ రోడ్‌లోని ఇందిరాగాంధీ కూడలి నుంచి పీవీ నరసింహారావు మార్గ్ వైపు హుస్సేన్‌సాగర్ కంపు కొడుతోంది. వ్యర్థాలు, అందులో నెలల కిందట పడిపోయిన వృక్షాలను సైతం తొలగించడం లేదు.

మరో రెండ్రోజులు వర్షాలు

ఈనాడు డిజిటల్,హైదరాబాద్ : నగరంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో హైడ్రా కమిషనర్, జోనల్ కమిషనర్లు, రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్ ఇంజినీరింగ్ సీఈ, ఎస్ఈలతో బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. మరో రెండ్రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రజలు ఏదైనా సహాయానికి జీహెచ్ఎంసీ హెల్ప్‌లైన్ 040-2111 1111, డీఆర్ఎఫ్ హైడ్రా కంట్రోల్ రూమ్ 9000113667 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

నేడు తేలికపాటి నుంచి మోస్తరు..: నగరంలో బుధవారం సాధారణ వర్షపాతం నమోదైంది. వచ్చే 24 గంటల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురుస్తుందని ఆ శాఖ తెలిపింది. ఉపరితల గాలులు గంటకు 8-10 కి.మీ వేగంతో తూర్పు దిశగా ఉండే అవకాశం ఉందని తెలిపింది. తదుపరి 48 గంటలు ఆకాశం మేఘావృతమై ఉంటుందని, తేలికపాటి వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులకు అవకాశం ఉంటుందని పేర్కొంది.

మూసీ నిర్వాసితుల పిల్లలకు గురుకులంలో ప్రవేశం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: మూసీ ప్రక్షాళనలో భాగంగా ఇళ్లు కోల్పోయిన రెండు కుటుంబాలకు చెందిన ముగ్గురు విద్యార్థులకు తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రవేశం కల్పించినట్లు జీహెచ్ఎంసీ బుధవారం ప్రకటనలో తెలిపింది. విద్యార్థులు మాధవి(7వ తరగతి), శిరీష (8వ), తేజస్వీ(5వ తరగతి)ని సరూర్‌నగర్‌లోని రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్‌లో ప్రవేశ పరీక్ష లేకుండానే చేర్పించినట్లు అధికారులు పేర్కొన్నారు.

ఎనిమిది కేంద్రాల్లో గ్రూప్-I మెయిన్స్ పరీక్షలు

హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు సంబంధించి హైదరాబాద్ జిల్లాలో 5613 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని, అందుకు ఎనిమిది కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఈ నెల 21 నుంచి 27 వరకు పరీక్షలు జరుగుతాయని, హాల్‌టికెట్లను అందుబాటులో ఉంచామన్నారు. అభ్యర్థులను మధ్యాహ్నం 12.30 గంటల నుంచి కేంద్రాలకు అనుమతిస్తారని, ఒంటి గంటన్నరకు గేట్లు మూసి వేస్తారని తెలిపారు. ఏదైనా చెల్లుబాటు అయ్యే ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డును మాత్రమే కేంద్రానికి తీసుకెళ్లాలని సూచించారు. అభ్యర్థి ఫొటో, సంతకం ముద్రించిన చిత్రాలు స్పష్టంగా ఉంటేనే హాల్‌టికెట్ చెల్లుబాటు అవుతుందన్నారు. డౌన్‌లోడ్ చేసిన హాల్ టికెట్‌లో అస్పష్టమైన ఫొటో ఉంటే అభ్యర్థి మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలను గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన అండర్‌టేకింగ్‌తో పాటు www.tspsc.gov వెబ్‌సైట్‌లో ఉన్న ఫార్మాట్‌ను తీసుకురావాలని సూచించారు. గ్రూప్-1 సర్వీసెస్ ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఎంచుకున్న భాషలో అన్ని మెయిన్స్ పరీక్షలను రాయాలన్నారు. ఎంచుకున్న భాషలో కాకుండా ఇతర భాషలో సమాధానాలు రాస్తే మూల్యాంకనం చేయరని తెలిపారు.

బిల్డర్ల నుంచే బాధితులకు పరిహారం..?

కూల్చివేతలపై త్వరలో విధానపర నిర్ణయం

కసరత్తు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం



బాచుపల్లిలో చెరువును ఆనుకొని ఎఫ్‌టీఎల్‌లోనే ఓ బడా నిర్మాణ సంస్థ రెండు టవర్లను కట్టింది. సుమారు వెయ్యి మంది ఒక్కో ఫ్లాట్‌ను రూ.80లక్షల నుంచి రూ.కోటిన్నరకు కొనుగోలు చేశారు. ఈ ఫ్లాట్లను హైడ్రా కూల్చేస్తే అందులో ఉంటున్న వారంతా రోడ్డున పడే అవకాశం ఉంది.

మూసాపేటలోనూ ఓ చెరువు ఎఫ్‌టీఎల్‌ను మార్చేసి ఓ నిర్మాణ సంస్థ అపార్టుమెంట్ల నిర్మాణాన్ని దాదాపు పూర్తి చేసింది.

ఈనాడు-సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి: నగరంలో అక్రమ నిర్మాణాలు భారీగానే ఉన్నాయి. ఇందులో కొన్నింటికి తప్పుడు పత్రాలతో అనుమతులు పొందారు. నిబంధనల ప్రకారం వీటిని హైడ్రా కూల్చివేయాల్సిందే. ఒకవేళ ఇదే చేస్తే ఎన్నో ఏళ్ల కిందట వాటిని కొనుగోలు చేసిన సామాన్యులు రోడ్డునపడతారు. ఇలాంటి నిర్మాణాల కూల్చివేతల విషయంలో ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంటే బాగుంటుందనే భావనలో హైడ్రా అధికారులున్నారు. వీరికి బిల్డర్ల నుంచి పరిహారం ఇప్పించాలని భావిస్తున్నట్లు సమాచారం. రెండ్రోజుల కిందట హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఇదే విషయాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వివరించారు. దీంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించాలని మంత్రి నిర్ణయించారు. ఈ నేపథ్యంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై త్వరలో సర్కార్ విధానపరమైన నిర్ణయం తీసుకోనుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

రెండు నెలలు బ్రేక్...

సుమారు 2 వేలకుపైగా కట్టడాలు చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్నాయి. వీటిలో చాలా వాటికి బల్దియా, హెచ్ఎండీఏ, పంచాయతీలు అనుమతులు ఇచ్చాయి. ఈ విషయంలో అధికారులు నిబంధనలను తుంగలోకి తొక్కినట్లు తెలుస్తోంది. కొందరు బిల్డర్లు ఒక సర్వే నంబరులో అనుమతులు తీసుకొని మరో సర్వే నంబరులో ఇళ్లను నిర్మించారు. వీటిని వేలాది మంది కొనుగోలు చేశారు. వీటన్నింటినీ కూల్చితే కొనుగోలు చేసిన వారు తీవ్రంగా నష్టపోతారని, ఇది ప్రభుత్వ వ్యతిరేకతకు దారితీసే అవకాశం ఉందని ఉన్నతాధికారులు ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. దీనిపై సీనియర్ మంత్రులతో చర్చించి ఒక విధానపరమైన నిర్ణయాన్ని తీసుకోవాలని సీఎం నిర్ణయించారని అధికారవర్గాలు చెబుతున్నాయి. బిల్డర్ నుంచి కొనుగోలుదారులకు పరిహారం ఇప్పించాలని యోచిస్తున్నారు. మూసీ విషయంలోనూ దీన్నే అవలంబిస్తారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రెండు నెలలపాటు ఎటువంటి కూల్చివేతలు చేపట్టకూడదని హైడ్రా నిర్ణయించింది.

జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఇలంబరితి




ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వం జీహెచ్ఎంసీ కమిషనర్‌గా రవాణా శాఖ కమిషనర్ ఇలంబరితిని నియమించింది. బల్దియాకు కొత్త కమిషనర్‌ను నియమించే వరకు ఆయన అదనపు బాధ్యతలు నిర్వర్తించాలని బుధవారం జారీ చేసిన ఉత్తర్వులో పేర్కొంది. డీవోపీటీ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ విభాగం) ఆదేశాలతో ఆమ్రపాలి కాటా ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లడంతో.. ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు సర్కారు తాత్కాలిక ఏర్పాటు చేసింది. ఇలంబరితి గతంలో కొంతకాలం ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌గా పనిచేశారు.

పాలనపై పట్టు సాధించిన ఆమ్రపాలి.. ప్రస్తుత కమిషనర్ ఆమ్రపాలి పాలనపై పట్టు పెంచుకున్నారు. వేకువ జామునే క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లడంతో.. మిగతా అధికారులు అప్రమత్తయ్యారు. ముఖాన్ని గుర్తించి హాజరు వేసే విధానాన్ని ప్రభుత్వ ఉద్యోగులకూ వర్తింపజేశారు. జీఐఎస్ సర్వే, హెచ్-సిటీ ప్రాజెక్టు ప్రతిపాదనలకు ఆమోదం తీసుకోవడం, మూసీ నది ప్రాజెక్టుకు జీహెచ్ఎంసీ తరఫున సహకారం అందించడం, ఇతరత్రా అభివృద్ధి కార్యక్రమాల్లో తనదైన ముద్రవేశారు.

రాయితీ ఇచ్చేద్దాం.. తుక్కుగా మార్చేద్దాం

గ్రేటర్ చుట్టూ మూడు కేంద్రాల ఏర్పాటు

ప్రాథమికంగా పరిశీలించిన ఆర్టీఏ అధికారులు



ఈనాడు, హైదరాబాద్: 15 ఏళ్లు దాటిన వాహనాలను తుక్కుగా మార్చాలనే కేంద్రం నిర్ణయానికి అనుగుణంగా గ్రేటర్ చుట్టూ మూడు ప్రాంతాల్లో తుక్కు కేంద్రాల ఏర్పాటుకు రవాణాశాఖ చర్యలు చేపడుతోంది. శంషాబాద్ నందిగామ, వర్గల్, తూప్రాన్‌లో వీటి ఏర్పాటుకు ప్రాథమికంగా పరిశీలన చేసింది. ఇప్పటికే ఓ ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీతో పాటు మరో రెండు కంపెనీలు రిజిస్టర్ వెహికల్ తుక్కు కేంద్రాల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం.

- గ్రేటర్ వ్యాప్తంగా 15 ఏళ్లు దాటిన వాహనాలు 18 లక్షలు ఉన్నట్లు అంచనా.
- ప్రస్తుతం 15 ఏళ్లు దాటిన వాహనాలను ఫిట్‌నెస్ చేసిన తర్వాత హరిత పన్ను చెల్లించి, మరో అయిదేళ్లు నడుపుకోవచ్చు.
- తుక్కు పాలసీ కింద.. ఈ వాహనాలను తుక్కుగా మార్చాలి. ఇది నిర్బంధం కాకపోవడంతో ఎంత మంది స్వచ్ఛందంగా ముందుకొస్తారనేది అనుమానమే.
- స్వచ్ఛందంగా ముందుకొచ్చి.. తుక్కు కింద మార్చితే.. కొత్త వాహనాలు కొనుగోలు సందర్భంగా రాయితీలు ఇవ్వనున్నారు.
- తుక్కుకు ఖరీదు కట్టి, అందులో కొంతమేర యజమానులకు చెల్లిస్తారు.

వింటేజ్ వాహనాలపై రాని స్పష్టత..

తుక్కు పాలసీ నేపథ్యంలో వింటేజ్ వాహనాలు ఏం చేస్తారనేది దానిపై ఎక్కువ మంది ఆరా తీస్తున్నారు. నగరంలో 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ ఏళ్లు దాటిన కార్లు, ఇతర వాహనాలు ఉన్నాయి. పూర్వీకుల నుంచి వచ్చిన ఆస్తిగా చాలామంది వీటిని జాగ్రత్తగా కాపాడుకుంటున్నారు. గ్రేటర్‌వ్యాప్తంగా 50 వేల వరకు ఇలాంటి వాహనాలు ఉన్నట్లు అంచనా. తుక్కు పాలసీ నేపథ్యంలో వింటేజ్ వాహనాలపై ప్రత్యేక నిర్ణయం తీసుకుంటారా? లేదా అనే విషయంలో స్పష్టత లేదు. గ్రీన్ ట్యాక్స్ చెల్లించి కొందరు ఈ వాహనాలను వినియోగిస్తున్నారు. మరికొందరు అసలు బయటకే తీయడం లేదు. త్వరలో వింటేజ్ వాహనాలకు సంబంధించి విధివిధానాలపై స్పష్టత వస్తుందని ఓ అధికారి తెలిపారు.

తుక్కుగా మార్చే వాహనాలకు రాయితీలు ఇలా..

ద్విచక్ర వాహనాలకు.. – వాహనం ఖరీదు (రూ.లక్షల్లో)	1 లోపు	2	2-3	3-4	5 లోపు
ద్విచక్ర వాహనాలకు.. – రాయితీ (రూ.వేలల్లో..)	1	2	3	4	5
నాన్ ట్రాన్స్‌పోర్టు వాహనాలకు.. – వాహనం ఖరీదు (రూ.లక్షల్లో)	5 లోపు	5-10	10-15	15-20	20 దాటితే
నాన్ ట్రాన్స్‌పోర్టు వాహనాలకు.. – రాయితీ (రూ.వేలల్లో..)	10	20	30	40	50

భూ బ్యాంకులో భద్రం

- హెచ్ఎండీఏ వద్ద 5,364లకు పైగా ఎకరాలు
- కంచె, జీపీఎస్‌తో రక్షణకు కసరత్తు



ఈనాడు, హైదరాబాద్

హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) మహా భూ బ్యాంకు సిద్ధం చేసింది. ఇప్పటివరకు వివిధ అభివృద్ధి ప్రాజెక్టులతోపాటు పలు సంస్థలకు కేటాయింపులు, లేఅవుట్లకు పోను ఇంకా 5,364 ఎకరాల వరకు ఉంది.

ఇటీవల ఆక్రమణలు ఎక్కువగా జరుగుతుండటంతో అసలు లెక్కలు బయటకు తీసింది. ఏడు జిల్లాల పరిధిలో ఎంత భూమి ఉందో సరిచూసింది. దీంతో రూ.వేల కోట్ల విలువైన భూములు హెచ్ఎండీఏ ఖాతాలో ఉన్నట్లు తేలింది. ఈ బ్యాంకులోని భూములను కాపాడుకునేందుకు హెచ్ఎండీ కసరత్తు చేయడంతోపాటు భవిష్యత్తులో వీటిని వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు వాడుకునే వెసులుబాటు ఉంది. హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భూములు అధిక ధర పలుకుతుండటంతో ఇక్కడ ఆక్రమణలు యథేచ్ఛగా జరుగుతున్నాయి.

వంద ఎకరాలకుపైగా భూములున్న ప్రాంతాలు..

మండలం	ప్రాంతం	భూమి
కాప్రా	జవహర్‌నగర్	1574
శేరిలింగంపల్లి	మియాపూర్	445
మేడిపల్లి	బోడుప్పల్	234
పటాన్‌చెరు	పెద్దకంజెర్ల	213
గండిపేట్	ఉప్పొలగూడ	200
పటాన్‌చెరువు	లక్డారం	184
కంది	ఇంద్రకరణ్	140
రామచంద్రాపురం	ఈసీఐఎల్, దమ్మాయిగూడ	119
బి.పోచంపల్లి	దేశ్‌ముఖ్	119
కంది	ఆరుట్ల	106
జిన్నారం	జిన్నారం	100

భవిష్యత్తు అవసరాలకు...

మహానగరం విస్తరిస్తోంది. ఇప్పటికే గ్రేటర్ దాటి అవుటర్ రింగ్ రోడ్డు వరకు నిర్మాణాలు వెలుస్తున్నాయి. రీజనల్ రింగ్ రోడ్డు తర్వాత మహానగర పరిధి దాదాపు 8 వేల చదరపు కిలోమీటర్ల వైశాల్యం పెరగనుంది. అప్పటి అవసరాలకు అనుగుణంగా వివిధ ప్రాజెక్టులకు భూమి చాలా కీలకం. ప్రైవేటు వ్యక్తుల నుంచి సేకరించాలంటే ప్రభుత్వ ఖజానాపై భారం పడక తప్పదు. దీంతో హెచ్ఎండీఏ భూ బ్యాంకు కాపాడుకుంటే భవిష్యత్తులో చేపట్టబోయే ప్రాజెక్టులకు వెదుక్కోవాల్సిన అవసరం ఉండదు. అయితే భూముల ధరలు పెరుగుతున్న కొద్దీ ఆక్రమణదారుల నుంచి కాపాడుకోవడం హెచ్ఎండీఏకు పెద్ద సవాలుగా మారుతోంది. తొలుత చిన్న చిన్న గుడిసెలు వేసి... వాటికి దొంగ సర్వే నెంబర్లు సృష్టిస్తున్నారు. నెమ్మదిగా పక్కా ఇళ్లు నిర్మిస్తున్నారు. వాటిని కూల్చడానికి వెళితే కోర్టులకు వెళ్లి స్టేలు తీసుకొస్తున్నారు. ఈ భూముల రక్షణ కోసం హెచ్ఎండీఏ పకడ్బందీగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జీపీఎస్‌తో అనుసంధానం..

- శేరిలింగంపల్లిలోని మియాపూర్‌లోని సర్వే నంబరు 100, 101లో హెచ్ఎండీఏకు 445.340 ఎకరాలు ఉండగా.. ఇటీవల ఇందులో పెద్దఎత్తున ఆక్రమణలకు పాల్పడ్డారు. కొందరు నేతలు ప్రోద్బలంతో గుడిసెలు వేయగా...అధికారులు అతికష్టం మీద అడ్డుకున్నారు. ప్రస్తుతం ఈ భూమి చుట్టూ హెచ్ఎండీఏ కంచె నిర్మిస్తోంది. జీపీఎస్‌తోనూ అనుసంధానం చేయనున్నారు. భవిష్యత్తులో ఎవరైనా సర్వే రాళ్లు తొలగించి హెచ్ఎండీఏ భూమిలోకి చొచ్చుకొచ్చినా జీపీఎస్ కోఆర్డినేట్స్ చూసి తొలగించే అవకాశం ఉంది.
- కాప్రా మండలం జవహర్‌నగర్‌లోని వివిధ సర్వే నంబర్లలో 2370 ఎకరాలు ఉండగా...ఇందులో ఇప్పటికే వివిధ అవసరాల కోసం 795 ఎకరాలు కేటాయించారు. ఇంకా 1574.300 ఎకరాలు హెచ్ఎండీఏ ఖాతాలో ఉంది. ఈ భూమికి సరైన రక్షణ లేక ఆక్రమణల పాలవుతోంది. దాదాపు ఆరేడు వందల ఎకరాలకు సంబంధించి కోర్టు కేసులు నడుస్తున్నాయి. చాలా చోట్ల ఇదే పరిస్థితి కొనసాగుతోంది.

ఒకరిని వెంటాడి.. మరొకరిని గొంతు కోసి

వ్యవసాయ క్షేత్రంలో వృద్ధ దంపతుల దారుణ హత్య



ఉషయ్య



శాంతమ్మ

కందుకూరు, న్యూస్‌టుడే: వ్యవసాయ క్షేత్రంలో కాపలాదారులుగా పని చేస్తున్న వృద్ధ దంపతులను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా కందుకూరు ఠాణా పరిధి కొత్తగూడలో మంగళవారం రాత్రి జరగ్గా.. బుధవారం ఉదయం వెలుగు చూసింది. సీఐ సీతారాం వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి మండలం ముష్టిపల్లికి చెందిన మూగ ఉషయ్య (70), అతడి భార్య శాంతమ్మ (60) కొత్తగూడ సమీపంలో స్వగ్రామానికి చెందిన మనోహర్‌రావు వ్యవసాయ క్షేత్రంలో రెండున్నరేళ్లుగా కాపలాదారులుగా చేస్తూ అక్కడే ఉంటున్నారు. వీరిని మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చంపేశారు. శాంతమ్మను ఇంట్లోనే మంచంపై గొంతు కోసి హత్య చేశారు. ఉషయ్యను వంద మీటర్ల దూరంలో మామిడి తోటలో పరిగెత్తించి నరికి చంపారు.

వెలుగుచూసింది ఇలా.. బుధవారం ఉదయం ఉషయ్యకు యజమాని మనోహర్ పలుమార్లు ఫోన్ చేయగా స్పందించలేదు. దీంతో భూమి దున్నడానికి అక్కడికి వచ్చే మహేందర్‌కు ఫోన్ చేసి ఉషయ్య వద్దకు వెళ్లి మాట్లాడించాలని సూచించారు. అతను వెళ్లి చూడగా.. మంచంపై రక్తపు మడుగులో శాంతమ్మ మృతదేహం ఉంది. భయపడిన అతను వెంటనే అక్కడి నుంచి పరిగెత్తి యజమానికి సమాచారం అందించాడు. తరువాత మరికొంత మందితో కలిసి వెళ్తుండగా.. మామిడితోటలో దారుణహత్యకు గురైన ఉషయ్య మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం ఇవ్వగా.. కేసును ఛేదించడానికి బృందాలుగా ఏర్పడి ఆధారాలను సేకరిస్తున్నారు. బాగా తెలిసిన వారే ఇద్దర్ని హత్య చేసి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. భోజనం చేసిన ప్లేటులో సగం కలిపిన అన్నం ఉండటంతో రాత్రి నిద్రించక ముందే హత్య జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఆమె కోసం.. ముగ్గురి హత్యకు కుట్ర

- బాలిక హత్య కేసులో వీడిన మిస్టరీ
- తల్లిని దక్కించుకోవడానికే దారుణం..



నిందితుడు తిరుపతి

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే: ఓ మహిళను దక్కించుకోవడానికి ఆమె కుటుంబంలోని ముగ్గుర్ని చంపేందుకు పథకం వేశాడు. ఏడేళ్ల బాలికను కత్తితో పొడిచి దారుణంగా చంపేశాడు. ఎవరూ గుర్తించలేదని.. మరో ఐదేళ్ల బాలికను చంపాలనుకునే క్రమంలో పోలీసులకు అడ్డంగా దొరికిపోయాడు. సూరారం ఠాణా పరిధిలో బాలిక కిడ్నాప్, హత్య కేసు మిస్టరీ వీడింది. సూరారం ఇన్‌స్పెక్టర్ భరత్‌కుమార్‌తో కలిసి ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం వివరాలు వెల్లడించారు.

ఒకరి తర్వాత ఒకరు.. ఆదిలాబాద్ జిల్లా బేల మండలం పాటగూడకు చెందిన మిశ్రమ్ ప్రభాకర్(40) ఏడు నెలల క్రితం సూరారం జీవన్‌జ్యోతి నగర్‌కు వచ్చాడు. అప్పటికే భర్త చనిపోయి ఇద్దరు కుమార్తెలతో (5, 7 ఏళ్లు) ఉంటున్న మహిళతో కలిసి ఉంటున్నాడు. ప్రభాకర్‌కు దయానంద్‌నగర్‌కు చెందిన తిరుపతి(31)తో పరిచయం ఏర్పడింది. తరచూ ప్రభాకర్ ఇంటికెళ్లే తిరుపతి.. సదరు మహిళపై కన్నేశాడు. ప్రభాకర్, ఇద్దరు చిన్నారుల అడ్డు తొలగించుకుంటే ఆ మహిళ ఒంటరై తన వశం అవుతుందని ముగ్గుర్ని చంపాలనుకున్నాడు. ఈ నెల 12న సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటున్న పెద్ద కుమార్తెను బైక్‌పై తీసుకెళ్లాడు. మేడ్చల్ సమీపంలోని బాసరేగడి సమీపంలోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి కత్తితో బాలిక గొంతు కోసి, కడుపులో పొడిచి చంపాడు. సిమెంటు బస్తాలో మృతదేహాన్ని కుక్కి బండరాయి వెనుక దాచి వెళ్లిపోయాడు. పెద్దకుమార్తె అదృశ్యమవడంతో కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా బాలికను తిరుపతి తీసుకెళ్లినట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరం అంగీకరించాడు.

ఉస్మాన్‌సాగర్ రెండు గేట్లు ఎత్తి నీటి విడుదల

నార్సింగి న్యూస్‌టుడే: ఉస్మాన్‌సాగర్ (గండిపేట) జలాశయానికి ఎగువ ప్రాంతం నుంచి వరద కొనసాగుతుండటంతో రెండు గేట్లను ఒక అడుగు మేర ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 1790.00 అడుగులు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 300 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 242 క్యూసెక్కులుగా అధికారులు పేర్కొన్నారు.

10 ఏళ్లలో.. వెయ్యి కిడ్నీ మార్పిడులు

- నిమ్స్ ఆసుపత్రి వైద్యుల ఘనత



శస్త్రచికిత్సలు చేసిన నిమ్స్ యూరాలజీ, నెఫ్రాలజీ వైద్యుల బృందం

ఈనాడు, హైదరాబాద్-న్యూస్‌టుడే, నిమ్స్: నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) పదేళ్లలో 1000 మూత్రపిండాల మార్పిడి చికిత్సలు చేసి మరే ప్రభుత్వ ఆసుపత్రికి దక్కని రికార్డును సొంతం చేసుకుంది. ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఈ చికిత్సలన్నీ ఉచితంగా చేయడం విశేషం. ఇందులో అత్యధిక శాతం మంది పేద, మధ్యతరగతి వారే. రూ. లక్షలు పోసి ప్రైవేటులో చికిత్సలు చేసుకోలేని ఎంతోమందిని నిమ్స్ అక్కున చేర్చుకొని పునర్జన్మ ప్రసాదించింది.

- 60శాతం లైవ్ డోనార్ల నుంచి కిడ్నీలు సేకరించగా.. మరో 40 శాతం బ్రెయిన్‌డెడ్ వ్యక్తులనుంచి తీసుకున్నారు.
- నిమ్స్‌లో 1989లో తొలి మూత్రపిండాల మార్పిడి సర్జరీ విజయవంతంగా పూర్తి చేశారు. అప్పటి నుంచి ఇంతవరకు 1730 మూత్రపిండాల మార్పిడి చేయగా.. గత పదేళ్లలో వేయి పూర్తి చేయడం విశేషం.
- జీవన్‌దాన్ ట్రస్టు ఏర్పడిన తర్వాత ఈ చికిత్సల్లో మరింత వేగం పెరిగింది. కొవిడ్‌లో తప్పితే 2014 నుంచి ఏటా 100కి తక్కువ కాకుండా ఎంతోమంది కిడ్నీ బాధితులకు నిమ్స్ వైద్యులు పునర్జన్మ ప్రసాదిస్తున్నారు.

యూరాలజీకి సంబంధించి.. నిమ్స్‌లో కిడ్నీ మార్పిడి చికిత్సలే కాకుండా మూత్రపిండాల్లోని రాళ్లు, ప్రొస్టేట్ గ్రంధి వాపు, కిడ్నీ క్యాన్సర్లు, పిడియాట్రిక్ యూరాలజీ సమస్యలకు సైతం రోబోటిక్, ఇతర వైద్య చికిత్సలు అందిస్తున్నట్లు యూరాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ తెలిపారు. ప్రతి నెలా 900 నుంచి 1000 ఇతర యూరాలజీ సంబంధిత రోగాలకు చికిత్సలు అందిస్తున్నామన్నారు.

సీఎం, వైద్య మంత్రి అభినందనలు.. నిమ్స్ వైద్యులు సాధించిన ఈ ఘనతపై సీఎం రేవంత్‌రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ, నిమ్స్ డైరెక్టర్ బీరప్పలు.. బుధవారం యూరాలజీ హెచ్‌వోడీ డాక్టర్ రాహుల్ దేవరాజ్, సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ రామరెడ్డి, ఇతర వైద్యులు, ప్రొఫెసర్లు విద్యాసాగర్, రామచంద్రయ్య, రఘువీర్, చరణ్ కుమార్, ధీరజ్, గంగాధర్, భూషణ్‌రాజు, స్వర్ణలత, నిర్మల, ఇందిర, అన్నే కిరణ్, ప్రసాద్, గీతలను ప్రత్యేకంగా అభినందించారు.

బాధితులకు సీఎంఆర్ఎఫ్ పత్రాల అందజేత



సనత్‌నగర్, న్యూస్‌టుడే: అత్యవసర వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) నుంచి మంజూరైన ఆర్థిక సాయానికి సంబంధించిన పత్రాలను(ఎల్ఓసీ) బాధిత కుటుంబ సభ్యులకు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని అందజేశారు. బన్సీలాల్‌పేట డివిజన్ బండమైసమ్మనగర్‌కు చెందిన శోభ చికిత్స నిమిత్తం ఆమె కుమారుడు మహేష్‌కు రూ.లక్ష చెక్కును అందజేశారు. మారేడుపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో భారాస డివిజన్ అధ్యక్షురాలు లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్

•సికింద్రాబాద్ • కంటోన్మెంట్ • సనత్‌నగర్

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మోతే శ్రీలతాశోభన్‌రెడ్డి

లాలాపేట, న్యూస్‌టుడే: పరిశుభ్ర హైదరాబాద్-వారసత్వ వ్యర్థాల తొలగింపు కార్యక్రమాన్ని బుధవారం తార్నాకలో ఉప మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. . ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని 21 రోజుల ప్రత్యేక కార్యాచరణతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ర్యాలీలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. టీటీయూసీ అధ్యక్షుడు మోతే శోభన్‌రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం..మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ.1 గంట మధ్య

సికింద్రాబాద్	:	8008573368
కంటోన్మెంట్	:	8008573361
సనత్‌నగర్	:	8008573356

సికింద్రాబాద్, అమీర్‌పేట, న్యూస్‌టుడే:

? సీతాఫల్ మండి డివిజన్ బ్రాహ్మణబస్తీలోని పోచమ్మ గుడి వీధిలో వాహనాలను ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తున్నారు. - రవి, బ్రాహ్మణ బస్తీ

● సమస్యను త్వరలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. - శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్ చిలకలగూడ ట్రాఫిక్ ఠాణా.

? ఎర్రగడ్డలోని రైతుబజార్‌లో పేరుకుపోతున్న కూరగాయల వ్యర్థాలను తొలగించడం లేదు. - పావని, ఎర్రగడ్డ

● తక్షణం వ్యర్థాలను తొలగించేందుకు ఏర్పాట్లు చేస్తాం. - రమేష్, ఎస్టేట్ ఆఫీసర్, ఎర్రగడ్డ రైతుబజార్

తీరిన వరద నీటి సమస్య

స్పందనకు వందనం

సనత్‌నగర్, న్యూస్‌టుడే: సనత్‌నగర్‌లోని సెయింట్ తెరిసా ఆసుపత్రికి వెళ్లే మార్గంలో వరద నీరు నిల్వ చేరిందని స్థానికులు 'ఈనాడు'లోని మేమున్నాం.. మీకు తోడుగా దృష్టికి తీసుకెళ్లగా బుధవారం ప్రచురితమైంది. స్పందించిన జీహెచ్ఎంసీ ఏఈ సందీప్ మోటార్‌తో నీటిని తోడించారు.

కాగితాల్లోనే వంతెనలు..

కార్ఖానా, న్యూస్‌టుడే

● 14 సంవత్సరాలుగా నిర్మాణాలకు నోచుకోని వైనం
● మూడు సార్లు నిధులు కేటాయించినా ఫలితం శూన్యం

కంటోన్మెంట్ ప్రాంతంలో ఓపెన్ నాలాలపై నిర్మించాల్సిన వంతెనల పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. కొన్ని చోట్ల వంతెన పనులు చేపట్టి పూర్తి చేసినప్పటికీ, మరికొన్ని ప్రాంతాల్లో కాగితాలకే పరిమితం అవుతున్నాయి. ఏళ్ల క్రితం నుంచి పరిస్థితి ఇలాగే ఉన్నప్పటికీ పట్టించుకునే వారు కరవయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజా ప్రతినిధులు, అధికారులు మారుతున్నా, నిర్మాణ పనులు మాత్రం ముందుకు సాగడం లేదు.


పీఅండ్‌టీ, మార్గదర్శి కాలనీల మధ్య వంతెన నిర్మించాల్సిన ప్రాంతం

నిధులు మంజూరైనా..

కంటోన్మెంట్ మూడో వార్డులోని పీఅండ్‌టీ, రెండో వార్డులోని మార్గదర్శి కాలనీల్లో ఓపెన్‌నాలా పైనుంచి వంతెన నిర్మాణం చేపట్టాలని 2010లోనే అప్పటి అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. ఈ మేరకు రూ.10లక్షలకు సంబంధించి టెండర్లు సైతం ఆహ్వానించారు. అయినప్పటికీ నిర్మాణం చేపట్టేందుకు గుత్తేదారులు ముందుకు రాలేదు. అనంతరం మరో రెండు సందర్భాల్లో నిధులు కేటాయించినా ఇదే సమస్య రావడంతో పనులు ముందుకు కదలలేని పరిస్థితి.

అయ్యప్ప సొసైటీ, చిన్నతోకట్టలను కలిపేలా..

ఒకటో వార్డులోని అయ్యప్ప సొసైటీ, ఆరో వార్డులోని చిన్నతోకట్ట ప్రాంతాలు కలుపుతూ ఓపెన్ నాలాపై వంతెన నిర్మాణం చేపట్టాలని అప్పట్లో అధికారులు ప్రతిపాదనలను రూపొందించారు. వర్క్ ఆర్డర్‌లో జాప్యం, నిర్మాణ వ్యయం పెరిగిపోవడం ఇతరత్రా కారణాలతో ఈ వంతెన నిర్మాణం సైతం నిలిచిపోయింది. ఈ రెండు వంతెన పనులు చేపట్టాలని ఆయా కాలనీల ప్రజలు అనేకసార్లు బోర్డు సీఈవోకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నారు. కానీ ఫలితం లేకుండా పోయింది.

బోర్డు సమావేశాల్లో ఎలాంటి ప్రస్తావన రాలేదు:

పీఅండ్‌టీ, మార్గదర్శి కాలనీలు, అయ్యప్ప సొసైటీ, చిన్నతోకట్ట ప్రాంతాల్లో ఓపెన్‌నాలాపై వంతెన నిర్మాణాలు చేపట్టాలని ఎలాంటి ప్రస్తావన రాలేదు. గతంలో వాటి నిర్మాణ విషయంలో ఏం జరిగిందో నాకు తెలియదు. ప్రస్తుతం బోర్డు ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులు చేపడుతున్నాం.
- మధుకర్ నాయక్, బోర్డు సీఈవో

ట్రాఫిక్ పోలీసుల డ్రైవ్.. జరిమానాల విధింపు


తనిఖీ చేస్తున్న ఏసీపీ హరిప్రసాద్, ఇన్‌స్పెక్టర్ సైదులు

అమీర్‌పేట, న్యూస్‌టుడే: వాహనాల నంబర్ ప్లేట్లు, అద్దాలపై నిబంధనలకు విరుద్ధంగా స్టిక్కర్లను ఏర్పాటు చేసుకున్న పలువురు వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు జరిమానాలు విధించారు. ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు, ఇతర సిబ్బంది అమీర్‌పేట, మైత్రీవనం, ఎస్సార్‌నగర్, సత్యం థియేటర్ ప్రాంతాల్లో బుధవారం తనిఖీలు నిర్వహించారు. కార్లు, ఇతర వాహనాల నంబర్ ప్లేట్లపై ప్రభుత్వ, జీహెచ్ఎంసీ, పోలీసు వాహనాలంటూ స్టిక్కర్లను ఏర్పాటు చేసుకుని ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. వాహనాల యజమానులకు జరిమానాలు విధించి స్టిక్కర్లను తొలగించారు. రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్న సుమారు 75 మందిపై కేసులు నమోదు చేసి, జరిమానాలు విధించారు.

ప్రభుత్వం పట్టించుకోకపోతే రంగంలోకి కేంద్ర ఏజెన్సీలు


మాట్లాడుతున్న ఎంపీ రాజేందర్ చిత్రంలో కార్పొరేటర్

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: కొన్నాళ్లుగా నగరంలో దేవాలయాలపై దాడులు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, కేంద్ర ఏజెన్సీలను రంగం లోకి దింపుతామని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం రాత్రి ఆయన కుమ్మరిగుడలోని ప్రార్థన మందిరాన్ని సందర్శించారు. ఘటనపై ప్రభుత్వం స్పందించి చర్య తీసుకోవాలని హెచ్చరించారు. రాష్ట్రంలో పోలీసు యంత్రాంగం, ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. స్థానిక కార్పొరేటర్ కొంతం దీపిక, భాజపా నాయకులు పాల్గొన్నారు.

ఆక్రమిస్తే అడుగేసేదెలా..!


మాట్లాడుతున్న ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్

పంజాగుట్ట, అమీర్‌పేట్-న్యూస్‌టుడే: నగర రహదారులపై పాదచారులు నడిచేందుకు అవకాశం లేకుండా దారికిరువైపులా ఆక్రమణలు పెరగటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని నగర ట్రాఫిక్ అదనపు సీపీ ఎం.విశ్వప్రసాద్ తెలిపారు. వాహన రాకపోకలు సజావుగా సాగేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు, చిరువ్యాపారుల పొట్టకొట్టాలనే ఉద్దేశం లేదని స్పష్టంచేశారు. దక్షిణమండలం పరిధిలోని పంజాగుట్ట, అమీర్‌పేట్, ఎస్సార్‌నగర్, మైత్రివనం తదితర ప్రాంతాల్లో బుధవారం ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. పంజాగుట్ట- ఎస్సార్‌నగర్ వరకూ రహదారులను ఆక్రమించిన తోపుడు బండ్లు, పాదచారి మార్గాలపై ఉన్న బడ్డీకొట్లను తొలగించారు. అనంతరం పంజాగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద వ్యాపారులకు అవగాహన కల్పించారు. నాలుగులైన్ల మార్గంలోనూ సగానికిపైగా ఆక్రమిస్తే వాహనాలు ఎలా వెళ్తాయని ప్రశ్నించారు. రోడ్డు ప్రమాదాలు నివారించి, ట్రాఫిక్ సాఫీగా సాగాలనే సంకల్పంతోనే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్టు వివరించారు. ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, ఏసీపీ హరిప్రసాద్, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఈఎన్‌టీలో అధునాతన పురోగతులపై కాన్ఫరెన్స్ 18 నుంచి


మారేడుపల్లి షెనాయ్ నర్సింగ్ హోం ఆసుపత్రిలో పోస్టర్ విడుదల చేస్తున్న వైద్యులు

మారేడుపల్లి, న్యూస్‌టుడే: ఈఎన్‌టీలో అధునాతన పురోగతులపై సౌత్ జోన్ ఈఎన్‌టీ సర్జన్స్ కాన్ఫరెన్స్ షామీర్‌పేట అలంకృత రిసార్ట్‌లో 18 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఆఫ్ ఓటోలరింగాలజిస్ట్ ఆఫ్ ఇండియా టీజీ సౌత్ కాన్ఫరెన్స్ ఆర్గనైజింగ్ ఛైర్మన్ డాక్టర్ డీఎస్ దీనదయాల్ తెలిపారు. ఈస్ట్ మారేడుపల్లిలోని షెనాయ్ నర్సింగ్ హోమ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కాన్ఫరెన్స్‌ను తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రారంభించనున్నారని తెలిపారు. వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వైస్ ఛాన్సలర్ కరుణాకర్ రెడ్డి హాజరు కానున్నట్లు చెప్పారు. ప్రకృతి, సంస్కృతి, సైన్స్ అండ్ టెక్నాలజీ కలిసే 'బేసిక్స్ అండ్ బియాండ్' అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక తదితర దక్షిణాది రాష్ట్రాల నుంచి వెయ్యి మందికి పైగా ప్రతినిధులు హాజరు కానున్నారని చెప్పారు. ఓటోలరింగాలజిస్ట్ ఆఫ్ ఇండియా టీజీ సౌత్ కాన్ఫరెన్స్ సమన్వయకర్త డాక్టర్ డీ ద్వారకానాథ్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ఈఎన్‌టీ వేగంగా అభివృద్ధి చెందుతుందని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి సాంకేతికతలతో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని వెల్లడించారు.

పరిశుభ్రతలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకం


రిక్షా అందజేస్తున్న ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట, సికింద్రాబాద్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ శానిటేషన్ అధికారులతో కలిసి పారిశుద్ధ్య కార్మికులకు చెత్త సేకరించే రిక్షాలను, పనిముట్లను అడ్డగుట్టలో బుధవారం కార్పొరేటర్ ప్రసన్న లక్ష్మి పంపిణీ చేశారు. పరిసరాల పరిశుభ్రతలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమని చెప్పారు. శానిటేషన్ డీఈ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ● సీతాఫల్ మండి కార్పొరేటర్ సామల హేమ సీతఫలమండి ఎమ్మెల్యే కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులకు చెత్త సేకరణ రిక్షాలను పంపిణీ చేశారు. ఇంటింటి చెత్త సేకరణ సులభతరం చేయడం కోసం రిక్షాలు ఇస్తున్నట్లు వెల్లడించారు.

అల్వాల్ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

అల్వాల్: (బుధవారం నాటివి..కిలో రూ.లో) టమాటా 43, వంగ 35, బెండ 45, పచ్చిమిర్చి 35, కాలీఫ్లవర్ 23, క్యాబేజీ 25, క్యారెట్ 50, దొండ 35, ఆలు 37, ఉల్లి 34, సొర 17, పొట్ల 18, బీన్స్ 145, గోరుచిక్కుడు 35, చిక్కుడు 65, దోస 35, బీర 45, కాకర 38, చామగడ్డ 45, కీర 35, క్యాప్సికం 65, బీట్‌రూట్ 32, కందగడ్డ 45, చిలకడదుంప 38, మామిడి 105, మునగ 80, ముల్లంగి 6(ఒకటి).

ఎర్రగడ్డలో..

అమీర్‌పేట, న్యూస్‌టుడే: టమాటా 43, నల్ల వంకాయ 35, పొడుగు వంకాయ 28, బెండ 35, పచ్చిమిర్చి 35, బజ్జి మిర్చి 85, క్యాప్సికం 75, పచ్చకాకర 38, పందిరిబీర 45, క్యాబేజీ 25, క్యారెట్ 53, దొండ 35, గుండు బీన్స్ 145, గింజ చిక్కుడు 65, గోకరకాయ 35, కీర 23, దోస 35, బీట్‌రూట్ 32, ఉల్లి 40, ఆలు 37, చామ 45, మొరంగడ్డ 35, కంద 45, గోబీ 23, సొర 17, పొట్లకాయ 18, అరటి 10, మునగ 4, మామిడి 105, ముల్లంగి 6, ఉల్లిపొరక 45, వేరుశనగ 50, నిమ్మకాయలు(డజన్) 45.

మోడల్ కాలనీలో దుప్పట్ల పంపిణీ

సనత్‌నగర్, న్యూస్‌టుడే: సనత్‌నగర్ మోడల్‌కాలనీలోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లను పంపిణీ చేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, కాలనీ సంఘం ఉపాధ్యక్షులు జేఎస్‌టీ శాయి, ప్రతినిధులు చంద్రశేఖర్, రాజేశ్వరి తదితరులు పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లను అందజేశారు.

అక్రమ కార్యకలాపాలకు సహకరిస్తే కఠిన చర్యలు


మాట్లాడుతున్న డీసీపీ రష్మిపెరుమాళ్, ఏసీపీలు సుబ్బన్న, రమేశ్

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: నిబంధనలకు తగినట్టుగా సీసీటీవీ కెమెరాలు, రిజిస్టర్లు నిర్వహించకుండా అక్రమ కార్యకలాపాలకు సహకరించినట్టు గుర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఉత్తరమండల డీసీపీ రష్మి పెరుమాళ్ హెచ్చరించారు. సికింద్రాబాద్ పరిధిలోని హోటల్, లాడ్జీల నిర్వాహకులు, ఏసీపీ, హెచ్‌వోలతో బుధవారం సమావేశం నిర్వహించారు. గోపాలపురం ఠాణా పరిధిలోని మెట్రోపోలిస్ హోటల్‌లో 50 గదులను అద్దెకు తీసుకున్న మున్వర్‌జామ అనే వ్యక్తి వివిధ రాష్ట్రాలకు చెందిన 151 మందికి ఇంగ్లిష్, వ్యక్తిత్వ వికాస శిక్షణనిస్తున్న విషయాన్ని హోటల్ నిర్వాహకులు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వలేదన్నారు. ఎటువంటి అనుమతి లేకుండా ప్రయివేటు కార్యక్రమాలకు అనుమతినిచ్చిన హోటల్ నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్టు వివరించారు. హోటల్ ట్రేడ్ లైసెన్స్‌ను రద్దుచేసి, మూసివేసేందుకు అనుగుణంగా చట్టపరమైన తీసుకోవాల్సిందిగా సంబంధిత శాఖకు సిఫార్సు చేయనున్నట్టు పేర్కొన్నారు. హోటళ్లలో బసచేసే వారి ఆధార్, గుర్తింపుకార్డులు, పేర్లతో రిజిస్టర్ ఉండాలన్నారు. అక్కడకు వచ్చిన వారి వివరాలను ఎస్‌హెచ్‌వోకు అందజేయాలని వెల్లడించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

రెజిమెంటల్ బజార్, న్యూస్‌టుడే: క్లాక్ టవర్ వద్ద గుర్తుతెలియని మృతదేహాన్ని మార్కెట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... సికింద్రాబాద్ క్లాక్ టవర్ ప్రాంతంలో ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. ఘటన స్థలానికి వెళ్లిన వారు చికిత్స నిమిత్తం 108 సమాచారం అందించారు. అక్కడికి వచ్చిన సిబ్బంది పరీక్షించి ఆయన మృతి చెందినట్లుగా నిర్ధారించారు. చిరునామా లభించకపోవడంతో మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి అదృశ్యం

అడ్డగుట్ట, న్యూస్‌టుడే: వృద్ధురాలు అదృశ్యమైన ఘటన తుకారంగేట్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. సీఐ శంకర్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. పోతిగంటి గ్రామం నుంచి లక్ష్మమ్మ మహేంద్రహిల్స్‌లో ఉంటున్న కూమార్తె ఇంటికి వెళ్లింది. అనంతరం వెంకట్‌నగర్‌లో నివాసం ఉంటున్న కుమారుడు ఇంటికి బయలుదేరి కనిపించకుండా పోయింది. ఫోన్ చేస్తే అందుబాటులో లేదు. బంధువులు ఇంటికి కూడా వెళ్లలేదు. బుధవారం కూతురి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

ఆలయంలో ప్రత్యేక పూజలు

మారేడుపల్లి, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ కుమ్మరిగూడలో ముత్యాలమ్మ దేవాలయంలో బుధవారం అర్చకులు వేదమంత్రోత్సవాలతో ప్రత్యేక పూజలు జరిపారు. బస్తీవాసులు, దేవాలయ కమిటీ సభ్యులు, స్థానిక కార్పొరేటర్ కొంతం దీపిక తదితరులు కలశస్థాపన, శాంతి చండీ హోమం నిర్వహించారు. సికింద్రాబాద్‌లో ఉన్న ఆలయాల్లో శుక్రవారం నుంచి అమ్మవారికి వేప నీటితో సాక పెడితే శ్రేష్ఠమని వేద పండితులు వివరించారు. బస్తీ వాసులకు మద్దతుగా జనసేన పార్టీ తెలంగాణ ఇన్‌ఛార్జి శంకర్ గౌడ్ ఆలయం ఆవరణలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.

సత్యదేవున్ని దర్శించుకున్న రైల్వే ఉన్నతాధికారి


వేద పండితుల ఆశీర్వచనం అందుకుంటున్న వెంకట రమణారెడ్డి

అన్నవరం, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా అన్నవరం సత్యనారాయణ స్వామిని సికింద్రాబాద్ డివిజన్ రైల్వే పీసీఎస్‌ఓ (ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్) కె.వెంకట రమణా రెడ్డి బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు మర్యాదపూర్వకంగా ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆశీర్వచనం గావించారు.

ఘనంగా 82వ ఈఎంఈ కార్ప్స్ డే


వందనం చేస్తున్న నీరజ్ వార్ష్నే, ప్రశాంత్ బాజ్‌పాయి

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: కంటోన్మెంట్ ప్రాంతంలోని ఈఎంఈ- 1 సెంటర్‌లో బుధవారం 82వ ఈఎంఈ కార్ప్స్ డేను ఘనంగా నిర్వహించినట్లు రక్షణ పౌర సంబంధాల అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంసీఈఎంఈ కమాండెంట్, లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వార్ష్నే, 1ఈఎంఈ కమాండెంట్, బ్రిగేడియర్ ప్రశాంత్ బాజ్‌పాయి వీర సైనికుల స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా అనంతరం కేంద్రంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరుస్తున్న 2వ టెక్నికల్ ట్రైనింగ్ బెటాలియన్‌కు ప్రఖ్యాత కమాండెంట్స్ బ్యానర్-2024తోపాటు బహుమతులను అందజేసినట్లు తెలిపారు.

నాలాలో పడిన వ్యక్తిని రక్షించిన హైడ్రా రెస్క్యూ బృందం



అమీర్‌పేట, న్యూస్‌టుడే: అమీర్‌పేట సమీపంలోని లీలానగర్ నాలాలో పడిపోయిన వ్యక్తిని హైడ్రా(డీఆర్ఎఫ్) రెస్క్యూ బృందం సభ్యులు రక్షించారు. బుధవారం తెల్లవారు జామున నాలాలో బానోత్ స్వామి(45) పడిపోయినట్లు గుర్తించిన స్థానికులు ఎస్సార్‌నగర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు డీఆర్ఎఫ్ విభాగానికి విషయం చేరవేయడంతో ఖైరతాబాద్ జోన్ స్టేషన్ ఫైర్ అధికారి(ఎస్ఎఫ్ఓ) మోహన్‌రావు ఇతర సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని నాలాలో దిగి బాధితుడిని రక్షించారు.

వేతన సవరణ బాండ్ డబ్బులు చెల్లించాలి

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: దసరా పండుగ సందర్భంగా సంస్థకు సుమారు రూ.70కోట్ల ఆదాయం చేకూరిందని, ఆ డబ్బులను ఉద్యోగుల సంక్షేమానికి వినియోగించాలని ఆర్టీసీ జేఏసీ ప్రచార కార్యదర్శి కే.సాయినాథ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని డిపోలకు చెందిన ఉద్యోగులు అహోరాత్రులు కష్టపడి వంద శాతం ఓఆర్‌ను సాధించి గత రికార్డులను తిరగరాయడం పట్ల సంస్థ ఎండీ సంతోషం వ్యక్తం చేయడంపై జేఏసీ ఛైర్మన్ ఈ.వెంకన్నతోపాటు ఇతర ప్రతినిధులు హర్షం వ్యక్తం చేసినట్లు తెలిపారు. అయితే 2013 వేతన సవరణ బాండ్ డబ్బులను డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ కార్మికులు, భద్రతా సిబ్బందికే చెల్లించి, మిగతావారికి చెల్లించకపోవడంపట్ల ఉద్యోగులు అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. వేతన సవరణ బాండ్ డబ్బులతోపాటు సీసీఎస్, పీఎఫ్ బకాయిలు, పదవీవిరమణ పొందిన ఉద్యోగులకు ఇవ్వాల్సిన డబ్బులను ఇవ్వాలని ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో రైలు ఢీకొని ఇద్దరి మృతి

రెజిమెంటల్‌బజార్: వేర్వేరు ప్రాంతాల్లో రైలు ఢీకొని ఇద్దరు మృతి చెందారు. సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం.... బుధవారం గుండ్ల పోచంపల్లి-సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ల మధ్య వృద్ధుడి(60) మృతదేహం ఉన్నట్లుగా గుర్తించి పోలీసులకు తెలియజేశారు. ఘటన స్థలానికి వెళ్లిన వారు మృతదేహాన్ని పరిశీలించగా రైలు ఢీకొని మృతి చెందినట్లుగా గుర్తించి గాంధీ మార్చురీకి తరలించారు.

మరో ఘటనలో...: ఆల్వాల్ రైల్వేస్టేషన్ వద్ద రైలు ఢీకొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తి(45) మృతి చెందాడు. మృతుడి వద్ద ఎలాంటి చిరునామా లభ్యం కాకపోవడంతో మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదు


కూల్చివేత పనులను పరిశీలిస్తున్న ఉమాశంకర్

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో నిబంధనలను అతిక్రమించి నిర్మాణాలను చేపడితే ఉపేక్షించేదిలేదని చీఫ్ ఇంజినీర్ ఉమాశంకర్ అన్నారు. ఐదో వార్డు పరిధిలోని కాకాగూడలో నిబంధనలకు విరుద్ధంగా మూడో అంతస్తును నిర్మిస్తున్నారు. దీంతో సీఈవో మధుకర్‌నాయక్ ఆదేశాల మేరకు బోర్డు ఇంజినీరింగ్ విభాగం అధికారులు బుధవారం నిర్మాణాన్ని కూల్చివేయించారు. కూల్చివేతలు కంటోన్మెంట్ చీఫ్ ప్లానర్ ఫణికుమార్, ఇంజినీర్లు దినేశ్, జిష్ణు, ఆదిత్య నారాయణ, ఆశీష్, తరుణ్, శివాజిల పర్యవేక్షణలో కొనసాగాయి.

శబరిమలలో సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు


సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ ప్రతినిధులు

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: కేరళ ప్రభుత్వం శబరిమలైలో సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లే అయ్యప్ప స్వాములకు ఇబ్బందులు తప్పడంలేదని తెలంగాణ అయ్యప్ప ఐక్య వేదిక ప్రతినిధులు పేర్కొన్నారు. న్యూబోయిన్‌పల్లి రాయల్ ఎన్‌క్లేవ్‌లోని అయ్యప్ప తీర్థక్షేత్రం దేవాలయ ట్రస్టీ కపిల్ బరాబరీ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. జేఏసీ కోర్ కమిటీ ప్రతినిధులు బుచ్చిరెడ్డి, రాధాకృష్ణ, ప్రేమ్ గాంధీ తదితరులు పాల్గొన్నారు. సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవడానికి ప్రతి హిందువు తమవంతు సహకారాన్ని అందించాలని కోరారు. అయ్యప్ప స్వాములు గోశాల నుంచే నెయ్యిని, హిందువులకు సంబంధించిన దుకాణాల నుంచి పూజా సామగ్రిని కొనుగోలు చేయాలని పిలుపునిచ్చారు. కేరళ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి శబరిమలైలో పూర్తిస్థాయిలో వసతులను కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులను త్వరలోనే కలిసి విన్నవించనున్నట్లు తెలిపారు.

మల్కాజిగిరి

ప్రభుత్వం పట్టించుకోకపోతే రంగంలోకి కేంద్ర ఏజెన్సీలు : ఈటల


బస్తీవాసులతో మాట్లాడుతున్న ఎంపీ రాజేందర్

రెజిమెంటల్‌బజార్‌, న్యూస్‌టుడే: కొన్నాళ్లుగా నగరంలో దేవాలయాలపై దాడులు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, కేంద్ర ఏజెన్సీలను రంగంలోకి దింపుతామని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ అన్నారు. బుధవారం రాత్రి ఆయన కుమ్మరిగూడలోని ప్రార్థన మందిరాన్ని సందర్శించారు. ఘటనపై ప్రభుత్వం స్పందించి చర్య తీసుకోవాలని హెచ్చరించారు. రాష్ట్రంలో పోలీసు యంత్రాంగం, ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. స్థానిక కార్పొరేటర్‌ కొంతం దీపిక, భాజపా నాయకులు పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నా

అల్వాల్‌, న్యూస్‌టుడే: ముత్యంరెడ్డి కాలనీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని కార్పొరేటర్‌ విజయశాంతి అన్నారు. బుధవారం కాలనీలో అధికారులతో కలిసి పాదయాత్ర చేశారు. వీధిదీపాల ఏర్పాటు, పార్కు అభివృద్ధికి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీలోని సమస్యల పరిష్కారం కోరుతూ స్థానికులు కార్పొరేటర్‌కు వినతి పత్రం అందజేశారు. ఉద్యానవన అధికారి ప్రవీణ, భాస్కర్‌, సతీష్‌ తదితరులు పాల్గొన్నారు.


కార్పొరేటర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: తూర్పు ఆనంద్‌బాగ్‌ డివిజన్‌ పీవీఎన్‌ కాలనీలో సర్కిల్‌ పారిశుద్ధ్య విభాగం ఆధ్వర్యంలో పరిశుభ్రత వారోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన డివిజన్‌ కార్పొరేటర్‌ ప్రేమ్‌కుమార్‌ కాలనీ వాసులు అందరూ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అధికారులు మంజుల, వద్యప్రియ, శ్రీనివాస్‌, రాములు స్థానిక నేతలు బాబు, సత్యనారాయణ, కిశోర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్‌ విభాగంలో రెక్టార్‌ తనిఖీలు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూహెచ్‌ ఇంజినీరింగ్‌ విభాగంలో బుధవారం రెక్టార్‌ డాక్టర్‌ కె.విజయకుమార్‌రెడ్డి తనిఖీలు నిర్వహించారు. ఈ విభాగంలో పనిచేస్తున్న 52మంది సిబ్బంది పనితీరు, హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. పనితీరు సరిగాలేని ఓ పొరుగు సేవల ఉద్యోగిపై రెక్టార్‌ ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యాంపస్‌లో ప్రమాదాలను నియంత్రించేందుకు ఏర్పాటుచేసిన వేగ నియంత్రికలపై సమీక్షించారు. స్పీడ్‌ బ్రేకర్ల నిర్మాణం సరిగా జరగకపోవడాన్ని ప్రశ్నించారు. సరిచేసి పక్కాగా పునరుద్ధరించాలని ఆదేశించారు. క్యాంపస్‌ నిర్వహణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. సిబ్బంది పనితీరులో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

కొలువుల్లో చేరిన గురువులు

గౌతంనగర్‌, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024లో ఎంపికై నియామక పత్రాలు అందుకున్న నూతన ఉపాధ్యాయులు వారికి కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరారు. దసరా సెలవులు ముగించుకొని పాఠశాలలు ఈ నెల 15న ప్రారంభమైన నేపథ్యంలో వారికి డీఈవో సమక్షంలో ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి అనంతరం బుధవారం ప్రభుత్వ పాఠశాలల్లో నూతన ఉపాధ్యాయులు విధులు చేపట్టారు. నియోజకవర్గంలోని మల్కాజిగిరి, అల్వాల్‌ మండలాలను కలిపి మొత్తం ఏడుగురు కొత్త ఉపాధ్యాయులను కేటాయించారు.

మల్కాజిగిరి నియోజకవర్గంలో పాఠశాలలు

మండలం	ప్రాథమిక	ప్రాథమికోన్నత	ఉన్నత
మల్కాజిగిరి	18	2	5
అల్వాల్	18	3	6

కొత్త ఉపాధ్యాయులతో కళకళ

మల్కాజిగిరి నియోజకవర్గం పరిధిలోని ప్రాథమిక పాఠశాలలకు కేటాయించిన ఉపాధ్యాయులు సంబంధిత ఎంఈవో కార్యాలయంలో తమ నియామక పత్రాలను సమర్పించి తమ పరిధిలోని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు నివేదించారు. పాఠశాల సహాయకులు నేరుగా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు తమ నియామక పత్రాలను నివేదించారు. మల్కాజిగిరి, అల్వాల్‌ మండలాల ఎంఈవోలు సురేష్‌, జ్యోతిరెడ్డిలు తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరి బాలికల ప్రాథమిక పాఠశాలకు స్పెషల్‌ ఎడ్యుకేషన్‌ ఎస్జీటీ ఒకరు, మల్కాజిగిరి బాలికల ఉన్నత పాఠశాలకు ఒక స్పెషల్‌ ఎస్‌ఏని కేటాయించారు. వీరితో పాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాల మౌలాలికి ఒక ఆంగ్ల, ఒక హిందీ, జడ్పీహెచ్‌ఎస్‌ మౌలాలికి ఒక జీవశాస్త్ర ఉపాధ్యాయుడిని కేటాయించారు. అల్వాల్‌ మండల పరిధిలోని కౌకూర్‌, మచ్చబొల్లారం ఉన్నత పాఠశాలలకు ఒక్కో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిని కేటాయించారు. వీరంతా బుధవారం విధుల్లో చేరారు. వీరికి ప్రోగ్రెసివ్‌ రికగ్నైజ్డ్‌ టీచర్స్‌ యూనియన్‌ సభ్యులు సర్వీసు బుక్కులను అందజేసి స్వాగతం పలికారు.


మౌలాలిలో సర్వీస్‌ బుక్కులు అందజేసి స్వాగతం పలుకుతున్న యూనియన్‌ నాయకులు

విద్యార్థుల అభ్యున్నతికి నావంతు కృషి

– భవాని, మల్కాజిగిరి బాలికల ఉన్నత పాఠశాల



ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న నా కల ఫలించినందుకు ఎంతో సంతోషంగా ఉంది. నేను నేరేడ్‌మెట్‌లో ఉంటాను. బీఎస్సీ, బీఈడీ పూర్తి చేసిన నాకు డీఎస్సీలో రెండో ర్యాంక్‌ రావడంతో ఎస్జీటీ, తెలుగు పండిట్‌, ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు బోధించేందుకు మూడు అవకాశాలు లభించాయి. ప్రత్యేక అవసరాలు బోధించేందుకు ఈ పోస్టును ఎంచుకున్నాను. మా సీనియర్ల సహకారంతో విద్యార్థుల అభ్యున్నతికి నా వంతు కృషి చేస్తాను.

ప్రభుత్వ ఉద్యోగం అనేది నా కల

– లత, మల్కాజిగిరి బాలికల ప్రాథమిక పాఠశాల



ప్రభుత్వ పాఠశాలలో పనిచేయాలన్న నా కల నెరవేరినందుకు ఎంతో గర్విస్తున్నాను. సీఈసీలో ఇంటర్‌తో పాటు డీఎడ్‌ పూర్తి చేశాను. నేను ఇక్కడే మల్కాజిగిరి పరిధిలోని వెంకటేశ్వరనగర్‌లో ఉంటాను. మల్కాజిగిరి బాలికల ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు బోధించే అవకాశం లభించడం ఆనందంగా ఉంది. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాను.

మేమున్నాం.. మీకు తోడుగా..

మల్కాజిగిరి:80085 73378, అల్వాల్: 93911 06395
వినాయక్‌నగర్: 98498 60095, మౌలాలి: 80089 02818
గౌతంనగర్: 93475 56399 డిఫెన్స్‌కాలనీ: 84990 06641

గౌతంనగర్‌, మల్కాజిగిరి, అల్వాల్‌, డిఫెన్స్‌కాలనీ, న్యూస్‌టుడే:

? వాల్వుల మరమ్మతుల పేరుతో గౌతంనగర్‌ రిజర్వాయర్‌కు దక్షిణంగా ఉన్న కాలనీలకు మంచినీరు సక్రమంగా విడుదల చేయడం లేదు. –కిరణ్‌ పట్నాయక్‌, గౌతంనగర్‌ కాలనీ సంఘం అధ్యక్షుడు

✓ వాల్వులకు మరమ్మతులు చేస్తున్నాం. క్రమం తప్పకుండా నీరు విడుదల చేస్తాం. –నవీన్‌, జలమండలి మేనేజర్‌, గౌతంనగర్‌

? తూర్పు ఆనంద్‌బాగ్‌ డివిజన్‌ షిర్డీ నగర్‌లో చెత్తకుప్పలు సక్రమంగా తీయటం లేదు. – హన్మంతరావు, కాలనీవాసి

✓ మీ ప్రాంతంలో సమస్య పరిశీలించి చెత్తకుప్పలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాస్‌, పర్యవేక్షకుడు, సర్కిల్‌ పారిశుద్ధ్య విభాగం

? టెంపుల్‌ అల్వాల్‌లోని వార్డు కార్యాలయం పార్కులో పిల్లలు ఆడుకునే జారుడుబండ విరిగిపోయింది. – తిరుపతిరెడ్డి, స్థానికుడు

✓ కొత్త ఆటపరికరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. –ప్రవీణ, మేనేజర్‌, ఉద్యానవిభాగం

? నేరేడ్‌మెట్‌ డివిజన్‌ పరిధి రామకృష్ణాపురం రైల్వే స్టేషన్‌ నుంచి రైతు బజార్‌ వెళ్లే ప్రధాన మార్గంలో రోడ్డు పక్కన చెత్తాచెదారం పేరుకుపోయింది. – నరేష్‌, రామకృష్ణాపురం

✓ పరిశీలించి చెత్తాచెదారాన్ని డంపింగ్‌ యార్డ్‌కు తరలిస్తాం. – నాగరాజు, పారిశుద్ధ్య అధికారి

గ్రీన్‌ఫీల్డ్‌కాలనీలో పేరుకుపోయిన వ్యర్థాలు



కౌనాజిగూడలోని గ్రీన్‌ఫీల్డ్‌కాలనీలో వ్యర్థాలు పేరుకుపోయాయి. కాలనీ ప్రధాన రహదారి వెంట ఉన్న ఖాళీ స్థలంలో రాత్రి సమయాల్లో కొంతమంది చెత్తను వేస్తున్నారు. వారం నుంచి చికెన్‌ దుకాణాల వ్యాపారులు సంచుల్లో వ్యర్థాలను వేయడంతో పరిసరాల్లో దుర్వాసన వెదజల్లుతోంది. స్థానికులు వెంటనే వ్యర్థాలను ఎత్తివేయాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, అల్వాల్‌

తపాలా శాఖ విశ్రాంత ఉద్యోగుల మౌన దీక్ష


మౌన దీక్షలో విశ్రాంత ఉద్యోగులు

అబిడ్స్‌, న్యూస్‌టుడే: తమ డిమాండ్లు నెరవేర్చాలని హైదరాబాద్‌ అబిడ్స్‌లోని డాక్‌ సదన్‌ జీపీవో ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి తపాలా శాఖ విశ్రాంత ఉద్యోగుల జేఏసీ బుధవారం మౌన దీక్షకు దిగింది. సుప్రీంకోర్టు నిర్ధారించిన క్యాట్‌ ఉత్తర్వులను యథాతథంగా అమలు చేయాలని జేఏసీ సభ్యులు డిమాండ్‌ చేశారు. 1980లో గంటకు రూ.2 చొప్పున వేతనంతో తమ సేవలను వినియోగించుకున్నారన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 383 మందిలో 40మంది చనిపోయారన్నారు. న్యాయబద్ధమైన హక్కుల సాధనకు మూడు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్న తపాలా శాఖ పట్టించుకోవడం లేదని వాపోయారు. అత్యున్నత న్యాయస్థానం తీర్పు ప్రకారం అన్ని రకాల రాయితీలు ఇవ్వడంతో పాటు పోస్టల్‌ డైరెక్టరేట్‌ ఆదేశాలను అమలు చేయాలని కోరారు. క్యాట్‌ ఆర్డర్ల ప్రకారం సర్వీస్‌ క్రమబద్ధీకరణ చేసి... నియామకం ప్రారంభ తేదీ నుంచి పే ఫిక్సేషన్‌లో ఉన్న అవకతవకలను వెంటనే సరిదిద్దాలి. ఐదో సీపీసీ(సెంట్రల్‌ పే రివిజన్‌ కమిషన్‌) ప్రకారం ఇంక్రిమెంట్లు, పెన్షనరీ బెనిఫిట్స్‌ వెంటనే ఇవ్వాలని కోరారు. తమ డిమాండ్లు పరిష్కరించేంత వరకు దశలవారీగా ఆందోళన చేస్తామన్నారు. జేఏసీ ఛైర్మన్‌ దుర్గాప్రసాద్‌, సభ్యులు మనోహర్‌, రవికృష్ణ, పి.యాదగిరి, కె.యాదగిరి, కారుణ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఫొటోగ్రఫీ కోర్సుకు పేర్లు నమోదు చేసుకోండి


గోడపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మామిడి హరికృష్ణ తదితరులు

బషీర్‌బాగ్‌, న్యూస్‌టుడే: నిరుద్యోగులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, సిగ్మా అకాడమీ ఆఫ్‌ ఫొటోగ్రఫీల సంయుక్తాధ్వర్యంలో ఉచిత ఫొటోగ్రఫీ డిప్లొమా కోర్సు నిర్వహిస్తున్నామని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, అకాడమీ ఛైర్మన్‌ ఎంసీ శేఖర్‌లు తెలిపారు. బుధవారం కోర్సుకు సంబంధించి గోడపత్రాలను ఆవిష్కరించారు. నవంబరు 14 నుంచి కోర్సు శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31లోపు చరవాణి 80080 21075, 70956 92175లో సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. నగరంలో ఆరు నెలల ఆఫ్‌లైన్‌, ఆన్‌లైన్‌ శిక్షణ ఉంటుందన్నారు.

భాజపా బలోపేతానికి కృషి


సభ్యత్వ నమోదులో కార్పొరేటర్‌ శ్రావణ్‌కుమార్‌

గౌతంనగర్‌, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం ఆ పార్టీ డివిజన్‌ అధ్యక్షుడు లక్ష్మణరావు ఆధ్వర్యంలో గౌతంనగర్‌ కూడలిలో నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మల్కాజిగిరి కార్పొరేటర్‌ శ్రావణ్‌కుమార్‌ మాట్లాడుతూ.. భాజపా సభ్యత్వం తీసుకుంటే దేశాన్ని బలపర్చినట్లేనని అన్నారు. కార్యక్రమంలో భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వాసంశెట్టి శ్రీనివాస్‌, అమర్‌, సాయిబాబా, వెంకట్‌, బలరాం తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: మల్కాజిగిరిలోని బాలికోన్నత పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్‌ వి.శ్రవణ్‌కుమార్‌ చెప్పారు. ఈ మేరకు రూ.8లక్షల వ్యయంతో బాలికోన్నత పాఠశాల గోడలకు అందమైన ప్రకృతి చిత్రాలను వేయిస్తున్నామన్నారు. బుధవారం ఆయన పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈఈ లక్ష్మణ్‌, ఏఈ నవీన్‌, రమేశ్‌, ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఈఎన్‌టీలో అధునాతన పురోగతులపై కాన్ఫరెన్స్‌ 18 నుంచి


మారేడుపల్లి షెనాయ్‌ నర్సింగ్‌ హోం ఆసుపత్రిలో పోస్టర్‌ విడుదల చేస్తున్న వైద్యులు

మారేడుపల్లి, న్యూస్‌టుడే: ఈఎన్‌టీలో అధునాతన పురోగతులపై సౌత్‌ జోన్‌ ఈఎన్‌టీ సర్జన్స్‌ కాన్ఫరెన్స్‌ షామీర్‌పేట ఆలంకృత రిసార్ట్‌లో 18 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు అసోసియేషన్‌ ఆఫ్‌ ఓటోలరింగాలజిస్ట్‌ ఆఫ్‌ ఇండియా టీజీ సౌత్‌ కాన్ఫరెన్స్‌ ఆర్గనైజింగ్‌ ఛైర్మన్‌ డాక్టర్‌ డీఎస్‌ దీనదయాల్‌ తెలిపారు. ఈస్ట్‌ మారేడుపల్లిలోని షెనాయ్‌ నర్సింగ్‌ హోమ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కాన్ఫరెన్స్‌ను తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌ జిష్ణు దేవ్‌ వర్మ ప్రారంభించనున్నారని తెలిపారు. వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్‌ హెల్త్‌ సైన్సెస్‌ వైస్‌ ఛాన్సలర్‌ కరుణాకర్‌ రెడ్డి హాజరు కానున్నట్లు చెప్పారు. ప్రకృతి, సంస్కృతి, సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ కలిసే 'బేసిక్స్‌ అండ్‌ బియాండ్‌' అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఓటోలరింగాలజిస్ట్‌ ఆఫ్‌ ఇండియా టీజీ సౌత్‌ కాన్ఫరెన్స్‌ సమన్వయకర్త డాక్టర్‌ డీ ద్వారకానాథ్‌ రెడ్డి, ఆర్గనైజింగ్‌ సెక్రటరీ డాక్టర్‌ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ఈఎన్‌టీ వేగంగా అభివృద్ధి చెందుతుందని ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌ వంటి సాంకేతికతలతో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని వెల్లడించారు.

టపాసుల దుకాణాలకు అనుమతి తప్పనిసరి

ఈనాడు– హైదరాబాద్‌: దీపావళి సందర్భంగా తాత్కాలికంగా టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు కచ్చితంగా డీసీపీల నుంచి అనుమతి తీసుకోవాలని రాచకొండ కమిషనర్‌ సుధీర్‌బాబు స్పష్టం చేశారు. బుధవారం నుంచి 28వ తేదీ వరకూ లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకోవాలని నోటిఫికేషన్‌ జారీ చేశారు. దరఖాస్తుకు సమర్పించాల్సిన పత్రాలు..

● డివిజనల్‌ ఫైర్‌ అధికారి నుంచి నిరభ్యంతర పత్రం. ● ప్రభుత్వ స్థలమైతే జీహెచ్‌ఎంసీ నుంచి నిరభ్యంతర పత్రం. ప్రైవేటు స్థలమైతే యజమానులతో చేసుకున్న ఒప్పంద పత్రం. ● గతేడాది జారీ చేసిన లైసెన్సు పత్రాలు, పక్కా దుకాణమైతే ఇరుగుపొరుగు నుంచి నిరభ్యంతర పత్రాలు. ● దుకాణం స్థలం వివరాలు(సైట్‌ ప్లాన్‌), రూ.600 చలానా సమర్పించాలి.

గుత్తేదారుల నిర్లక్ష్యం స్థానికులకు శాపం



డిఫెన్స్‌కాలనీ నార్త్‌ పార్క్‌ వీధిలో ఇటీవల వేసిన సీసీ రోడ్డు నిర్మాణ లోపాలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసిన రోడ్డు మధ్య నుంచి నీరు కదలకపోవడంతో బురదమయంగా మారుతుంది. అధికారుల పర్యవేక్షణ లోపం, గుత్తేదారు నిర్లక్ష్యం వల్లే సమస్య ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు. –న్యూస్‌టుడే, డిఫెన్స్‌కాలనీ

పరిశుభ్ర మల్కాజిగిరికి పాటుపడదాం..!

నవంబరు 8 వరకు ప్రత్యేక కార్యాచరణ


వ్యర్థాల తొలగింపు వాహనం ఎదుట పారిశుద్ధ్య సిబ్బంది

గౌతంనగర్‌, న్యూస్‌టుడే: స్వచ్ఛత విషయంలో జీహెచ్‌ఎంసీ ప్రత్యేక దృష్టి సారిస్తోంది. అందులో భాగంగా నూతనంగా వారసత్వ వ్యర్థాల తొలగింపు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ నెల 16 నుంచి నవంబరు 8 వరకు 21 రోజుల పాటు కాలనీల్లో, బహిరంగ ప్రదేశాల్లో పేరుకుపోయిన మట్టి దిబ్బలు, ఇతర వ్యర్థాలను తొలగించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. అందుకు మల్కాజిగిరి సర్కిల్‌ పరిధిలో 24 మంది సిబ్బందిని ప్రత్యేకంగా కేటాయించారు.

ఆరు వాహనాల కేటాయింపు...

మట్టి దిబ్బలు, ఇతర వ్యర్థాలను తొలగించి డంపింగ్‌ యార్డుకు తరలించేందుకు మల్కాజిగిరి సర్కిల్‌ పరిధిలోని ఆరు డివిజన్లకు ఆరు ప్రత్యేక వాహనాలను కేటాయించారు. ఒక్కో వాహనానికి డ్రైవర్‌తో పాటు ముగ్గురు సిబ్బందిని కేటాయించారు. వీరంతా రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధుల్లో ఉంటారు. వీరు సంబంధిత ఎస్‌ఎఫ్‌ఏల సూచనల మేరకు స్థానికంగా ఉన్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలిస్తారు. వీరందరిని ఒక సూపర్‌వైజర్‌ స్థాయి అధికారితో పాటు సర్కిల్‌ ఏఎంహెచ్‌వో పర్యవేక్షిస్తారు. అందులో భాగంగా బుధవారం తూర్పు ఆనంద్‌బాగ్‌, మల్కాజిగిరి ప్రాంతాల్లో వ్యర్థాల తొలగింపు కార్యక్రమాన్ని సర్కిల్‌ ఏఎంహెచ్‌వో మంజుల స్వయంగా పరిశీలించారు. ఎస్‌ఎఫ్‌ఏలు, ఇతర సిబ్బందికి అవగాహన కల్పించారు.

ప్రతి ఒక్కరిలో అవగాహన పెరగాలి

– మంజుల, ఏఎంహెచ్‌వో, మల్కాజిగిరి




వారసత్వ వ్యర్థాల తరలింపులో ఇబ్బందులు తలెత్తితే సంబంధిత ఎస్‌ఎఫ్‌ఏలకు ఫిర్యాదు చేస్తే తక్షణమే పరిష్కరిస్తారు. అలాగే ఇళ్లలోని చెత్తను సంబంధిత చెత్త సేకరణ రిక్షా కార్మికునికి అప్పగించేలా ప్రతి ఒక్కరిలో అవగాహన పెరగాలి. ఆటోల్లో సేకరించిన చెత్తను రాంకీ సంస్థ ఆధ్వర్యంలో డంపింగ్‌ యార్డ్‌కు తరలిస్తారు.

ఉద్యోగం పేరిట మోసం

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: ఉద్యోగం పేరుతో డబ్బులు దండుకుని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. మధురానగర్‌ పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని ప్రకాశం జిల్లాకు చెందిన వైష్ణవి మధురానగర్‌లోని యెగితా లేడీస్‌ హాస్టల్‌లో ఉంటుంది. టెలికాలర్‌గా విధులు నిర్వహిస్తున్న వైష్ణవి గతంలో ఓ రియల్‌ ఎస్టేట్‌ కంపెనీలో పనిచేస్తున్న సమయంలో సంగారెడ్డి జిల్లా ఝరాసంఘం ప్రాంతానికి చెందిన సాఫ్ట్‌వేర్‌ ఇంజినీర్‌ కమ్మరి వీరేందర్‌ పరిచయమయ్యాడు. టెక్‌ మహేంద్రలో ఉద్యోగం కల్పిస్తానని నమ్మించాడు. ఆగస్టు 8న క్విక్‌ సన్‌ సాఫ్ట్‌వేర్‌ కన్సల్టెన్సీ కంపెనీలో ఇంటర్వ్యూ నిర్వహించి వెబ్‌ డిజైనర్‌గా ఉద్యోగానికి ఎంపికైనట్లు చెప్పారు. ఉద్యోగానికి ల్యాప్‌టాప్‌ అవసరమని, అందుకు రూ.50 వేలు చెల్లించాలని వీరేందర్‌ చెప్పడంతో ఆగస్టు 12న వైష్ణవి రూ.20 వేలు జీపే చేసింది. మిగిలిన డబ్బులు ఉద్యోగం వచ్చాక ఇస్తానంది. డబ్బులు కట్టనిదే ఉద్యోగం రాదని, పలువురికి ఇవ్వాల్సి ఉంటుందని వీరేందర్‌ అనడంతో ఆగస్టు 17 నుంచి ఈనెల 9 వరకు పలు దఫాలుగా వీరేందర్‌కు జీపే, ఫోన్‌పే ద్వారా రూ.3.5 లక్షలను చెల్లించింది. ఉద్యోగం రాకపోగా మరిన్ని డబ్బులకు వేధిస్తున్న వీరేందర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మెకానిక్‌ అదృశ్యం


మహేష్‌

నేరేడ్‌మెట్‌, న్యూస్‌టుడే : ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన నేరేడ్‌మెట్‌ ఠాణా పరిధిలో జరిగింది. సీఐ సందీప్‌ కుమార్‌ కథనం ప్రకారం.. వినాయకనగర్‌లో ఉంటున్న మహేష్‌(42)మెకానిక్‌ పని చేస్తుంటాడు. ఈ నెల 14న రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. భార్య స్రవంతి అతన్ని మందలించింది. దీంతో మనస్థాపానికి గురైన మహేష్‌ ఉదయం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. భర్త కోసం అంతటా వెతికిన ఆచూకీ కనిపించలేదు. స్రవంతి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మానసిక చికిత్సాలయం నుంచి రోగి..

వెంగళ్‌రావునగర్‌, న్యూస్‌టుడే: ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయం నుంచి ఓ రోగి అదృశ్యం అయ్యాడు. బోరబండ పోలీసుల వివరాలు ప్రకారం.. పెద్దపల్లి జిల్లాకు చెందిన మల్లేష్‌ (45).. రాత్రిళ్లు సరిగా నిద్ర పోకపోవడం, కనిపించిన వారిని కొట్టడం వంటి పనులు చేస్తుండటంతో ఈనెల 14న మానసిక చికిత్సాలయానికి సోదరులు తీసుకొచ్చారు. వైద్య పరీక్షలు అనంతరం ఆసుపత్రిలో చేర్చారు. మంగళవారం మల్లేష్‌ అదృశ్యమయ్యాడు. సోదరుడు సాదయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సీపీఆర్‌, ప్రాథమిక చికిత్సలపై అవగాహన

జూబ్లీహిల్స్‌, న్యూస్‌టుడే: చిన్నారుల్లో సీపీఆర్‌, ప్రథమ చికిత్స తదితర అంశాలపై చిన్నారుల వైద్యురాలు శివరంజని అవగాహన కల్పించారు. జూబ్లీహిల్స్‌లోని తాజ్‌మహల్‌ హోటల్‌లో పలువురు వైద్యనిపుణులతోపాటు గృహిణులు, యువతీ యువకులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. చిన్నారుల ఆహారం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. గొంతులో ఏదైనా చిక్కుకుంటే ఊపిరి ఆడకుండా తీవ్ర ఇబ్బంది పడతారన్నారు. వెంటనే ఎలాంటి చికిత్స అందించాలో వివరించారు. చిన్నవయసులోనే గుండెపోటు వస్తే సీపీఆర్‌ ఎలా చేయాలో చేసి చూపారు. ఓఆర్‌ఎస్‌ ప్యాకెట్లపై లేబుల్‌ చూడకుండానే అసలు, నకిలీ గుర్తించకుండా కొనుగోలు చేస్తున్నామన్నారు. అవి ప్రమాదకరమన్నారు.


అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు శివరంజని

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

రెజిమెంటల్‌బజార్‌: వేర్వేరు ప్రాంతాల్లో రైలు ఢీకొని ఇద్దరు మృతి చెందారు. సికింద్రాబాద్‌ జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం.... బుధవారం గుండ్ల పోచంపల్లి- సికింద్రాబాద్‌ రైల్వే స్టేషన్ల మధ్య వృద్ధుడి(60) మృతదేహం ఉన్నట్లుగా గుర్తించి పోలీసులకు తెలియజేశారు. ఘటన స్థలానికి వెళ్లిన వారు మృతదేహాన్ని పరిశీలించగా రైలు ఢీకొని మృతి చెందినట్లుగా గుర్తించి గాంధీ మార్చురీకి తరలించారు. **మరో ఘటనలో...:** ఆల్వాల్‌ రైల్వేస్టేషన్‌ వద్ద రైలు పట్టాలు దాటుతూ గుర్తు తెలియని వ్యక్తి(45) మృతి చెందాడు.

రెండుసార్లు నమ్మించి.. మూడోసారి మోసగించి..

జూబ్లీహిల్స్‌, న్యూస్‌టుడే: ఆభరణాల వ్యాపారి వద్దకు రెండుసార్లు వచ్చి ఆభరణాలు కొనుగోలు చేసి నమ్మించాడు.. మూడోసారి ఆభరణాలు కొనుగోలుకు వచ్చి మోసానికి పాల్పడ్డాడు. బంజారాహిల్స్‌ పోలీసుల వివరాల ప్రకారం.. నాంపల్లికి చెందిన శ్రీనాధ్‌ వ్యాస్‌.. వ్యాపారినంటూ బంజారాహిల్స్‌ రోడ్‌ 8లోని ఉత్కర్ష జువెలర్స్‌కు వచ్చాడు. డబ్బులిచ్చి రెండుసార్లు ఆభరణాలు కొని యజమాని బాలాజీపాటిల్‌ను నమ్మించాడు. 2 నెలల క్రితం మరోసారి వచ్చి రూ.15 లక్షల ఆభరణాలు కొనుగోలు చేశాడు. డబ్బులు తీసుకురాలేదని, ఇంటికి వెళ్లి పంపిస్తానని యజమాని నమ్మించి అక్కడి నుంచి జారుకున్నాడు. అప్పటి నుంచి డబ్బులు ఎప్పుడిస్తావంటూ యజమాని ఎన్నిసార్లు ఫోన్లు చేసినా ఏదో ఒక సాకు చెప్తుండటంతో మోసపోయినట్లు గ్రహించిన యజమాని బుధవారం బంజారాహిల్స్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఘనంగా 82వ ఈఎంఈ కార్ప్స్‌ డే


వందనం చేస్తున్న నీరజ్‌ వార్ష్నే, ప్రశాంత్‌ బాజ్‌పాయి

కంటోన్మెంట్‌: కంటోన్మెంట్‌ ప్రాంతంలోని ఈఎంఈ- 1 సెంటర్‌లో బుధవారం 82వ ఈఎంఈ కార్ప్స్‌ డేను ఘనంగా నిర్వహించినట్లు రక్షణ పౌర సంబంధాల అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంసీఈఎంఈ కమాండెంట్‌, లెఫ్టినెంట్‌ జనరల్‌ నీరజ్‌ వార్ష్నే, 1ఈఎంఈ కమాండెంట్‌, బ్రిగేడియర్‌ ప్రశాంత్‌ బాజ్‌పాయి వీర సైనికుల స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా అనంతరం కేంద్రంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరుస్తున్న 2వ టెక్నికల్‌ ట్రైనింగ్‌ బెటాలియన్‌కు ప్రఖ్యాత కమాండెంట్స్‌ బ్యానర్‌-2024తోపాటు బహుమతులను అందజేసినట్లు తెలిపారు.

అల్వాల్‌ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

అల్వాల్‌, న్యూస్‌టుడే: (బుధవారం నాటివి.. కిలో రూ.లో) టమాటా 43, వంగ 35, బెండ 45, పచ్చిమిర్చి 35, కాలీఫ్లవర్‌ 23, క్యాబేజీ 25, క్యారెట్‌ 50, దొండ 35, ఆలు 37, ఉల్లి 34, సొర 17, పొట్ల 18, బీన్స్‌ 145, గోరుచిక్కుడు 35, చిక్కుడు 65, దోస 35, బీర 45, కాకర 38, చామగడ్డ 45, కీర 35, క్యాప్సికం 65, బీట్‌రూట్‌ 32, కందగడ్డ 45, చిలకడదుంప 38, మామిడి 105, మునగ 80, ముల్లంగి 6(ఒకటి).

రామకృష్ణాపురంలో..

డిఫెన్స్‌కాలనీ: టమాటా కిలో రూ.43, వంగ 35, బెండ 45, పచ్చిమిర్చి 35, కాకర 38, బీర 45, క్యాబేజీ 25, బీన్స్‌ 115, క్యారెట్‌ 53, దొండ 35, చిక్కుడు 65, క్యాప్సికం 75, ఆలు 37, కీర 23, దోస 35, చామగడ్డ 45, అరటి 10, బీట్‌రూట్‌ 32, సొర 17, గోకర 35.

నాలుగేళ్ల చిన్నారిపై కుక్క దాడి

నిజాంపేట: పాఠశాల నుంచి ఇంటికి వెళ్తున్న చిన్నారిపై వీధికుక్క దాడి చేసిన సంఘటన దుండిగల్‌లో జరిగింది. దుండిగల్‌ అయిదవ వార్డులో మంత్రి మధు, కృష్ణవేణి దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బుధవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో పాఠశాల నుంచి కృష్ణవేణి కుమార్తెలను ఇంటికి తీసుకొస్తుండగా.. దారి మధ్యలో వీధికుక్క వెంబడించింది. భయంతో ఎల్‌కేజీ చదువుతున్న చిన్న కుమార్తె అక్షిత(4) పరుగు తీస్తూ కింది పడింది. దీంతో చిన్నారిపై కుక్క దాడి చేయడంతో తలకు గాయమైంది.

ముషీరాబాద్

● ముషీరాబాద్ ● అంబర్‌పేట

'విగ్రహాల ధ్వంసం'పై నిజనిర్ధారణ కమిటీ వేయాలి: శివసేన



నినాదాలు చేస్తున్న సుదర్శన్, గణేష్, పండరీనాథ్, మంజుల

కాచిగూడ, న్యూస్‌టుడే: నగరంలోని ప్రార్థనా మందిరాలపై వరుసగా జరుగుతున్న దాడులు, విగ్రహాల ధ్వంసం ఘటనలపై విచారణకు నిజనిర్ధారణ కమిటీని వేయాలని శివసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతంకాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని కోరారు. ప్రార్థనా మందిరాలపై దాడులను నిరసిస్తూ బుధవారం నింబోలిఅడ్డా నుంచి సికింద్రాబాద్ కుమ్మరివాడి వరకు చేపట్టిన ర్యాలీనుద్దేశించి ఆయన మాట్లాడారు. దాడుల ఘటనపై విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించడంతోపాటు ప్రార్థనా మందిరాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులను సూచించారు. రాష్ట్ర అధికార ప్రతినిధి గణేష్, నేతలు పండరీనాథ్, మంజుల పాల్గొన్నారు.

దసరాకు లక్ష్యాన్ని మించి ఆదాయం: డీఆర్‌ఎం



సిబ్బందికి మిఠాయి తినిపిస్తున్న జగన్, రఘు

కాచిగూడ, న్యూస్‌టుడే: దసరా పండగ వేళ నిర్ణీత లక్ష్యాన్ని అధిగమించి ఆదాయాన్ని సాధించడంతో ఆర్టీసీ కాచిగూడ డిపోలో వేడుకలను నిర్వహించారు. బుధవారం ఆర్టీసీ డిప్యూటీ రీజనల్ మేనేజర్(డీఆర్‌ఎం) జగన్, డిపో మేనేజర్ రఘు.. ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బందికి మిఠాయి లను పంచిపెట్టారు. అనంతరం జగన్ మాట్లాడుతూ... ట్రాఫిక్ విభాగంలో కాచిగూడ 97.33 శాతం సాధించి మూడో స్థానంలో నిలిచిందని తెలిపారు. ఈ దఫా రూ. 12.22 లక్షల ఆదాయం లక్ష్యాన్ని నిర్దేశించగా రూ. 13.44 లక్షలను సాధించినట్లు తెలిపారు. అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసులు, అసిస్టెంట్ ఇంజినీర్ వాసవి సహా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డీసీపీని సత్కరించిన నేతలు



అక్బర్నీయవుతో కూడిన సయ్యద్ మసూద్ తదితరులు

ముషీరాబాద్: అన్నివర్గాల ప్రజల సహకారంతో జరిగిన పండగలను ప్రశాంతంగా ముగిశాయని సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాన్స్‌యాదవ్ పేర్కొన్నారు. భోలక్‌పూర్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు సయ్యద్ మసూద్ ఆధ్వర్యంలో బుధవారం పలువురు నేతలు ఆయన్ను కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం మసూద్ భోలక్‌పూర్‌లో మాట్లాడారు. వినాయక చవితి, దేవీశరన్నవరాత్రి ఉత్సవాలతోపాటు మిలాద్ ఉన్ నబీ కూడా ప్రశాంతంగా ముగిసేలా పోలీసులు పటిష్ఠ చర్యలు చేపట్టారని తెలిపారు. నేతలు జమీల్, ఉస్మాన్, భైరతలి, మహ్మద్ నుస్రత్, కరీం తదితరులు పాల్గొన్నారు.

పండుటాకులకు ఆహారం పంపిణీ



గాంధీనగర్: పేదలను ఆదుకునేందుకు పారిశ్రామికవేత్తలతో పాటు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సొసైటీ ఫర్ హంగర్ ఎలిమినేషన్ సొసైటీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణప్రసాద్ కోరారు. ప్రపంచ ఆహారభద్రత దినోత్సవం సందర్భంగా బుధవారం సొసైటీ ఆధ్వర్యంలో.. గాంధీనగర్‌లోని లక్ష్మీసాయి చైతన్య వృద్ధాశ్రమంలోని పండుటాకులకు ఆహారం అందజేశారు. నిత్యావసరాలను నిర్వాహకులకు అందించాక ఆయన మాట్లాడారు. కార్యదర్శి సీతాపతిరావు తదితరులు పాల్గొన్నారు.

నియామకం



ఆర్.మోజెస్

రాంనగర్, న్యూస్‌టుడే: భారాస గ్రేటర్ హైదరాబాద్ కార్యనిర్వాహక కార్యదర్శిగా రాంనగర్‌కు చెందిన రాష్ట్ర పాటి మోజెస్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన నియామకాన్ని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ బుధవారం ప్రకటించారు. అనంతరం రాంనగర్‌లో మోజెస్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

మురుగు సమస్య పరిష్కరించండి

విద్యానగర్: బాగ్‌అంబర్‌పేట డివిజన్ మల్లికార్జుననగర్ పరిధిలో డ్రైనేజీ పైపులైన్లు తరచూ నిండి తలెత్తుతున్న మురుగు సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని జలమండలి అధికారులను కార్పొరేటర్ బి.పద్మ కోరారు. ఎయిర్‌టెక్ యంత్రం సాయంతో బుధవారం సంబంధిత పైపులైన్లలోని పూడికను కొంతమేరకు తీయించి నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కొన్ని నెలలుగా వేదిస్తున్న మురుగు సమస్యతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాగునీటి నల్లాల నుంచి సైతం దుర్వాసనతో కూడిన కలుషిత జలాలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

అక్రమ కేసులు పెట్టినవారిపై చర్యలకు డిమాండ్

గాంధీనగర్: హెబ్రోను చర్చి నిర్వహణ విషయమై ట్రస్ట్ సభ్యులు.. సొసైటీ సభ్యులైన వీరాచారి, అనుచరులపై పెట్టిన తప్పుడు కేసును హైకోర్టు కొట్టి వేసిందని క్రైస్తవ ప్రచార పరిరక్షణ సమితి అధ్యక్షుడు జెరుసలేం మత్తయ్య బుధవారం రాత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీరాచారికి బెయిల్ కూడా మంజూరు చేసిందన్నారు. ఈ నేపథ్యంలో చర్చిలోకి అక్రమంగా ప్రవేశించిన ట్రస్టు సభ్యులపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

కూరగాయల ధరలు

తిలక్‌నగర్, న్యూస్‌టుడే: (బుధవారం నాటిది.. కిలోకు రూపాయల్లో) టమాట 50, ఆలుగడ్డ 40, వంకాయ 40, బెండ 60, దొండ 45, దోసకాయ 40, కాకర 60, బీర 60, సొర 30, క్యాబేజీ 35, క్యాప్సికం 60, బీన్స్ 90, చిక్కుడు 55, క్యారెట్ 45, బీట్‌రూట్ 40, ఉల్లిగడ్డ 50, పచ్చిమిర్చి 40, వెల్లుల్లి 350, అల్లం 80.

వెలగని దీపాలు.. అంధకారంలో వీధులు



గాంధీనగర్ జనప్రియ అపార్టుమెంట్ వద్ద వెలగని వీధి దీపం



అంధకారంలో బ్యాంక్ ఆఫ్‌బరోడా ఏటీఎం వీధి

ముషీరాబాద్, న్యూస్‌టుడే: ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలో వీధిదీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. అధికారుల పర్యవేక్షణలోపం.. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా చాలాచోట్ల వీధిదీపాలు వెలగడం లేదు. ప్రధాన రోడ్లతోపాటు కాలనీలు, బస్తీలూ చీకట్లో మగ్గుతున్నాయి. వెలగని వాటికి మరమ్మతులు చేయించాలని జీహెచ్‌ఎంసీ అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రాత్రివేళల్లో ఇళ్ల నుంచి బయటికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు.

వేడుకల వేళా తప్పని పాట్లు

తెలంగాణ సంస్కృతికి ప్రతీకైన బతుకమ్మ ఉత్సవాలతో పాటు దసరా పర్వదినం రోజున కూడా అనేకచోట్ల వీధిదీపాలు వెలగక ప్రజలు అవస్థలు పడ్డారు. నియోజకవర్గంలోని భోలక్‌పూర్, గాంధీనగర్, కవాడిగూడ, ముషీరాబాద్, రాంనగర్, అడిక్‌మెట్ తదితర డివిజన్లలో స్ట్రీట్ లైట్లు సక్రమంగా వెలగడం లేదని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా.. పట్టించుకొనే నాథుడే కరవయ్యాడు. ఫిర్యాదు చేస్తున్నా నోచుకోవడం లేదు. వాటికి మరమ్మతులు చేపట్టేందుకు భాగ్యనగర్‌లోని అందుబాటులో లేకపోవడం, సిబ్బంది కొరత తదితర అధికారులు సాకుగా చూపుతున్నారని వారంతా ఆరోపిస్తున్నారు. వీధి దీపాలు వెలగకపోవడంతో భోలక్‌పూర్ పద్మశాలికాలనీవాసులు.. తమ వీధిలో ప్రత్యేకంగా ట్యూబ్‌లైట్లు ఏర్పాటుచేసుకుని ఐదేవల సద్దుల బతుకమ్మ వేడుకలను జరుపుకోవాల్సి వచ్చింది.

డివిజన్లవారీగా వీధిదీపాల సంఖ్య	
అడిక్‌మెట్	1,861
ముషీరాబాద్	2,756
రాంనగర్	2,272
భోలక్‌పూర్	1,721
గాంధీనగర్	2,481
కవాడిగూడ	2,319
మొత్తం:	13,410

హడలెత్తిస్తున్న వీధి శునకాలు

వీధిదీపాలు సక్రమంగా వెలగకపోవడంతో చీకట్లో రోడ్ల పక్కన వీధి శునకాలు గుంపులుగా మాటువేసి.. ఆటుగా రాకపోకలు సాగించే వాహనదారులను హడలెత్తిస్తున్నాయి. వాటిబారి నుంచి తప్పించుకునేందుకు వేగంగా వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నట్లు పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారంపై దృష్టి సారిస్తాం

– అనూష, జీహెచ్‌ఎంసీ వీధిదీపాల నిర్వహణ ఏఈ

దసరా పండగ కోసం సిబ్బందిలో ఎక్కువమంది సొంత ఊర్లకు వెళ్లడంతో.. వీధిదీపాల మరమ్మతుల్లో జాప్యం నెలకొంది. ప్రస్తుతం మూడు బృందాలు పనిచేస్తున్నాయి. వెలగని స్ట్రీట్‌లైట్లకు రెండు, మూడు రోజుల్లో మరమ్మతులు పూర్తిచేయిస్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

ముషీరాబాద్	8008573400
రాంనగర్	8008573395
అంబర్‌పేట	8008573390
నల్లకుంట	8008573389

నల్లకుంట, బాగ్‌లింగంపల్లి, రాంనగర్, న్యూస్‌టుడే:

? పాతనల్లకుంటలోని వమ్మాక్ష్మి పాఠశాల నుంచి రామాలయం వెళ్లే దారిలో మ్యాన్‌హోల్ కుంగిపోయింది. ప్రమాదాలు జరగకముందే వెంటనే మరమ్మతులు చేయించండి. – చారి, పాతనల్లకుంట

✓ సమస్యను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. – జనార్దన్, జలమండలి మేనేజరు

? బాగ్‌లింగంపల్లి పరిధిలో వారాంతపు సంత జరిగే శనివారం రోజున ట్రాఫిక్ తీవ్రంగా స్తంభించి.. అంబేడ్కర్ కళాశాల, సుందరయ్య పార్కు ప్రధాన రోడ్లపై రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంటోంది. – నవీన్, బాగ్‌లింగంపల్లి

✓ క్షేత్రస్థాయిలో పరిశీలించాక సమస్య పరిష్కారంపై దృష్టి సారిస్తాం. – విశాల, ట్రాఫిక్ సీఐ

? ముషీరాబాద్ డివిజన్ పటాన్‌బస్తీ నుంచి డ్రైనేజీ మురుగునీరు దిగువనున్న పవిత్రానగర్ ప్రాంతానికి బారీగా ప్రవహిస్తోంది. అపరిశుభ్రత, దుర్వాసనతో తీవ్ర అవస్థలు పడుతున్నాం. –శాంత్ర మురళీధర్, హరినగర్

✓ సమస్య మా దృష్టికి వచ్చింది. సిబ్బందిని పంపించి వెంటనే పరిష్కరిస్తాం –మోహన్‌రాజ్, డీజీఎం, చిలకలగూడ జలమండలి

'భారాసను క్షేత్రస్థాయిలో పటిష్ఠం చేయాలి'



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న బి.వెంకటరెడ్డి, శ్రీను

విద్యానగర్: భారాస పూర్వవైభవం సాధించేలా క్షేత్రస్థాయిలో మరింత పటిష్ఠం చేయాలని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్.. బాగ్‌అంబర్‌పేట డివిజన్‌కు చెందిన సీనియర్ నేత బి.వెంకటరెడ్డికి సూచించారు. భారాస రాష్ట్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఆయన్ను వెంకటరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై శ్రేణులంతా ఎప్పటికప్పుడు ఉద్యమించాలని కేటీఆర్ తమకు సూచించినట్లు బుధవారంమీడియాకు వెంకటరెడ్డి వెల్లడించారు. ఆయన వెంట నేతలు శ్రీను, సంతోష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గార్బా ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీక



వేడుకల్లో ముఠా జైసింహా తదితరులు

ముషీరాబాద్, న్యూస్‌టుడే: గార్బా ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని భారాస యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహా పేర్కొన్నారు. బుధవారం భోలక్‌పూర్ డివిజన్ బంగ్లాదేశ్ మార్కెట్‌లో.. భారాస మైనార్టీ నేత జహంగీర్ ఆధ్వర్యంలో సంబంధిత ఉత్సవాలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జైసింహా ముస్లింలతో కలిసి తొలుత ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం దట్టీలు సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. నేతలు వై.శ్రీనివాస్‌రావు, రహీం, మక్బుల్, ప్రవీణ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకుందాం



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో శ్రీనివాస్ ముదిరాజ్, చంద్రశేఖర్, అజయ్



తొలుపునూరి కృష్ణాగౌడ్, లక్ష్మణ్‌గౌడ్‌లను సన్మానించిన జగన్

అంబర్‌పేట, న్యూస్‌టుడే: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కోరారు. భాజపా సీనియర్ నేతలు చింతల శ్రీనివాస్ ముదిరాజ్, కెంచె చంద్రశేఖర్, అజయ్‌కుమార్, రవీందర్ గౌడ్ తదితరులు సన్మానించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సనాతన హిందూ ధర్మం గొప్పతనాన్ని నేటి యువతకు తెలియజేయాలని కేంద్ర మంత్రి సూచించారు.

గోల్నాక, న్యూస్‌టుడే: కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణాగౌడ్, అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి వైస్ చైర్మన్ గడ్డం లక్ష్మణ్‌గౌడ్‌ను జగన్ సన్మానించారు. నేతలు శ్రీమంత్‌గిరి, నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల సంబరాలు



వి.హనుమంతరావుతో నేతలు

గోల్నాక, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కులగణన ప్రక్రియను చేపట్టేలా ప్రభుత్వం జీవో జారీ చేసినందుకు కాంగ్రెస్ పార్టీ అంబర్‌పేట శ్రేణులు సంబరాలు నిర్వహించాయి. సీనియర్ నాయకుడు వి.హనుమంతరావు నేతృత్వంలో బుధవారం అలీ కేఫ్ చౌరస్తాలోని జ్యోతిరావు పులే విగ్రహం వద్ద జరిగిన వేడుకలకు నేతలు యూసుఫ్ జాహి, తొలుపునూరి కృష్ణాగౌడ్, షేక్ జమీర్‌లు హాజరయ్యారు. నిరుద్యోగ ఐకాస చైర్మన్ నీలం వెంకటేష్, బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసంతో ఆరోగ్యం



రంగయ్యకు జ్ఞాపిక ప్రదానం చేస్తున్న ప్రదీప్

గాంధీనగర్, న్యూస్‌టుడే: వయసును లెక్కచేయకుండా ప్రతిఒక్కరూ మానసికంగానూ ఉల్లాసంగా ఉండాలని సినీ నటుడు ప్రదీప్ అన్నారు. బుధవారం రాత్రి త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళావేదికలో నిర్వహించిన సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. వార్ధక్య ఆలోచనలే మనసును వృద్ధులుగా చేస్తాయన్నారు. ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడంతోపాటు ఆధ్యాత్మిక చింతన, మానవ సంబంధాలను కొనసాగిస్తూ ప్రేరణ పొందాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు వయోవృద్ధులను సన్మానించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మాచేర్ల రంగయ్య, అధ్యక్షుడు పల్లయ్య, సంయుక్త కార్యదర్శి నర్సింగరావు, ప్రముఖులు మురళీధర్‌రావు, అభినందన భవాని, చంద్రబోస్, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేక్షకరంజకంగా నాటక ప్రదర్శన



కళాకారులతో దైవజ్ఞశర్మ, లక్ష్మీనారాయణ, ధర్మారావు, నిర్మలాప్రభాకర్

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆరాధన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న పద్యనాటకోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి త్యాగరాయ గానసభలో.. పి.లక్ష్మీకాంత శర్మ రచించి, దర్శకత్వం వహించిన యుద్ధం తర్వాత పౌరాణిక పద్యనాటక ప్రదర్శన ప్రేక్షకరంజకంగా సాగింది. దుర్యోధనుడిగా లక్ష్మీకాంతశర్మ, ధృతరాష్ట్రుడిగా సూర్యనారాయణమూర్తి, కర్ణుడిగా సాల్వాచారి, శకునిగా జంగయ్యగౌడ్‌లు నటించి ప్రేక్షకులను రక్తికట్టించారు. అనంతరం కళాకారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖులు నిర్మలాప్రభాకర్, కె.ధర్మారావు, లంకా లక్ష్మీనారాయణ, వెంకటరావు, లోకం కృష్ణయ్య, శ్రావణ్‌కుమార్, దైవజ్ఞశర్మ, రాజబాబు పాల్గొన్నారు.

కళా ఉత్సవంలో సత్తాచాటిన విద్యార్థులు



విజేతలతో ఉప విద్యాధికారిణి విజయలక్ష్మి

కాచిగూడ, న్యూస్‌టుడే: హైదరాబాద్ జిల్లా స్థాయి కళా ఉత్సవ పోటీలు-2024లో విద్యాశాఖ అంబర్‌పేట, హిమాయత్‌నగర్ మండలాల విద్యార్థులు సత్తా చాటారు. బుధవారం సికింద్రాబాద్ బస్తీలోని ఆలేనే ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీల్లో.. అంబర్‌పేట బాపూనగర్‌లోని ప్రగతి విద్యానికేతన్‌కు చెందిన తేజస్విని(నృత్యం), హిమాయత్‌నగర్ సెయింట్ ఆంథోని స్కూల్‌కు చెందిన శ్రీనిధి(వాయిద్యం), అంబర్‌పేట సీపీఎల్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన సాయిరాజ్(థియేటర్ ఆర్ట్స్), నారాయణగూడ మాడపాటి హనుమంతరావు పాఠశాల విద్యార్థిని రేణు(స్టోరీ టెల్లింగ్) విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా వారిని ఉపవిద్యాధికారిణి విజయలక్ష్మి, డిప్యూటీ ఐఓఎస్ కస్తూరి కుమారి అభినందించారు. డిసెంబరు 1, 2 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు.

మూసీ నిర్వాసితులకు 'డబుల్ ఇళ్లు' కేటాయించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్. చిత్రంలో వెంకటరెడ్డి, శంకర్, బసవరాజు, రఘునందన్ తదితరులు

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: మూసీ నిర్వాసితులకు రెండు పడకగదుల ఇళ్లను సత్వరమే కేటాయించాలని పక్షం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య కళానిలయంలో.. దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మూసీ నది సుందరీకరణ పేరిట పేదల ఇళ్లను కూల్చివేయొద్దని కోరుతూ హక్కుల కోసం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పాలకుల ప్రయోజనాల కోసమే మూసీ సుందరీకరణ ప్రాజెక్టు చేపట్టారని ఆరోపించారు. ఇళ్ల కూల్చివేతతో ఏళ్లుగా అక్కడ నివసిస్తున్న పేదలు రోడ్డున పడే దుస్థితి నెలకొందని జీవనోపాధి కూడా దెబ్బతిందని ఆందోళన చెందారు. మానవహక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బసవరాజ్, బాలల హక్కుల సంఘం రాష్ట్ర బాధ్యుడు రఘునందన్, ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ వెంకటరెడ్డి, పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి సంధ్య, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ అధ్యక్షత వహించిన సమావేశంలో నేతలు పృథ్వీరాజ్, జాన్, నర్సింహ, ప్రసాద్, పులి కల్పన పాల్గొన్నారు.

అర్హత లేని ఏజెన్సీలను రద్దు చేయాలని విజ్ఞప్తి



సంయుక్త కమిషనర్ సునీతకు వినతిపత్రం అందజేస్తున్న నారాయణ

గాంధీనగర్, న్యూస్‌టుడే: జలమండలిలో అర్హతలేని ఏజెన్సీలను రద్దు చేయాలని హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు నారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కార్మికశాఖ కమిషనర్ కార్యాలయంలో.. సంయుక్త కమిషనర్ సునీతను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీలో పనిచేసే ఒప్పంద కార్మికుల సమస్యలను సత్వరం పరిష్కరించాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కార్యకలాపాలను నిర్వహించే ఏజెన్సీల కాలపరిమితి పూర్తయినా.. మరోదఫా కొనసాగించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే పొడిగింపును నిలిపేసి టెండర్లు పిలవాలని డిమాండ్ చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, నేతలు శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్, బాలకృష్ణారెడ్డి, బాలరాజ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ఉపాధ్యాయుల వేతనాల్లో జాప్యం తగదు: తెదేపా



సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా

రాంనగర్, న్యూస్‌టుడే: గురుకుల విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సకాలంలో వేతనాలను విడుదలచేయకపోవడంతో.. వారంతా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెదేపా సీనియర్ నాయకుడు పి.సాయిబాబా ఆరోపించారు. బుధవారం దోమలగూడలోని పార్టీ నగర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. గురుకుల ఉపాధ్యాయులకు 9 నెలలుగా వేతనాలు లేక జీతాలివ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందన్నారు. మరోవైపు, గురుకులాలు నేటికీ అద్దె భవనాల్లో కొనసాగుతుండటంతో విద్యార్థులు అవస్థలు తప్పడం లేదన్నారు. ఈ సమస్యలను పరిష్కరించేలా తక్షణం చొరవచూపాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. నేతలు నల్లెల కిషోర్, బాలరాజుగౌడ్, ప్రకాశ్, యాదగిరిరావు, శ్యాం, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

పాఠశాలల పునఃప్రారంభం..

పరీక్షలకు సమాయత్తం



తరగతి గదిలో చిన్నారులు

అంబర్‌పేట, న్యూస్‌టుడే: దసరా పండగ సెలవుల అనంతరం ముగిశాక విద్యాసంస్థలు పునఃప్రారంభమైనా పేదలు ఇంకా తరగతుల్లోకి రాలేదు. విద్యాశాఖ అంబర్‌పేట, హిమాయత్‌నగర్ మండలాల పరిధిలోని పాఠశాలలో పరీక్షల నిర్వహణకు అధికారులు సమాయత్తమవుతున్నారు. విజయదశమి సందర్భంగా ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలకు ఈ నెల 2 నుంచి 14 వరకు సెలవులిచ్చారు. దీంతో వాటిల్లో చదివే విద్యార్థుల్లో చాలామంది తమ కుటుంబాలతో కలిసి సొంతూళ్లకు తరలివెళ్లారు. 15 నుంచి పాఠశాలలు తిరిగి తెరుచుకున్నాయి. విద్యార్థులంతా తిరిగి స్వస్థలాల నుంచి చేరుకోకపోవడంతోపాటు పాఠశాలలకు హాజరవుతున్నారు. తొలి రోజు మాత్రం హాజరు శాతం తక్కువగానే నమోదైంది. రెండో రోజు నుంచి క్రమంగా పుంజుకుంది. మరోవైపు, పరీక్షలు మరికొద్ది రోజుల్లో ప్రారంభంకానున్న నేపథ్యంలో వాటి నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై యంత్రాంగం పూర్తిస్థాయిలో దృష్టి సారించింది.

21 నుంచి పరీక్షలు.. విద్యాశాఖ రెండు మండలాల్లో కలిపి ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు అంబర్‌పేట, మలక్‌పేట, ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల్లోని వివిధ ముఖ్యస్థలాల్లో డివిజన్లలో ఉన్నాయి. ఆయా బడుల్లో చదివే విద్యార్థులకు ఎస్‌ఏ-1 పరీక్షలు ఈ నెల 21న ప్రారంభమై 28 వరకు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను పరీక్షల కోసం ఇప్పటికే సమాయత్తం చేశామని అంబర్‌పేట, హిమాయత్‌నగర్ మండలాల ఉప విద్యాధికారిణి విజయలక్ష్మి తెలిపారు. సంబంధిత పరీక్షల్లో ప్రతిభ కనబరిచే విధంగా ప్రతిభ చూపేలా ప్రోత్సహిస్తుండడంతోపాటు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు ముందు కెళ్తున్నామని వివరించారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు	13
ప్రైమరీ స్కూళ్లు	36
ప్రైవేటు పాఠశాలలు	100
ఎయిడెడ్	6
మొత్తం విద్యార్థులు	38 వేలు

తపాలా శాఖ విశ్రాంత ఉద్యోగుల మౌన దీక్ష

అబిడ్స్: తమ డిమాండ్లు నెరవేర్చాలని హైదరాబాద్ అబిడ్స్‌లోని డాక్ సదన్ జీపీవో ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి తపాలా శాఖ విశ్రాంత ఉద్యోగులు జేఏసీ బుధవారం మౌన దీక్షకు దిగింది. సుప్రీం కోర్టు నిర్ణయించిన క్యాట్ ఉత్తర్వులను యథాతథంగా అమలు చేయాలని వారంతా డిమాండ్ చేశారు. 1980లో గంటకు రూ.2 చొప్పున వేతనంతో తమ సేవలను వినియోగించుకున్నారన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి 383 మందిలో 40 మంది చనిపోయారన్నారు. న్యాయబద్ధమైన హక్కుల సాధనకు మూడు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నా తపాలా శాఖ పట్టించుకోవడం లేదని వాపోయారు. అత్యున్నత న్యాయస్థానం తీర్పు ప్రకారం రావాల్సిన రాయితీలు సహాపాటు పోస్టల్ డైరెక్టరేట్ ఆదేశాలను అమలు చేయాలని కోరారు. జేఏసీ చైర్మన్ దుర్గాప్రసాద్, సభ్యులు ఖాన్ హర్, రవికృష్ణ, పి.యాదగిరి, కె.యాదగిరి, కరుణ్య పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ నిరసన

హిమాయత్‌నగర్: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.7700 కోట్ల ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ, బీఈడీ కోర్సుల విద్యార్థుల బోధన, ఉపకారవేతన బకాయిలను సత్వరమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్ వైజంక్షన్ కూడలి వద్ద నిరసన చేపట్టారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి ఆర్.బాలకృష్ణ, నెర్లకంటి శ్రీకాంత్ మాట్లాడారు.

రోడ్డుపైనే పార్కింగ్.. రాకపోకలకు అవస్థలు



నల్లకుంట డివిజన్ పరిధిలోని తిలక్‌నగర్ రైల్వే బ్రిడ్జి సమీపంలో.. రోడ్డు పైనే వాహనాలను నిలపడం కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సార్లు ట్రాఫిక్ జామ్ కూడా అంతరాయం కలుగుతోంది. స్థానికంగా ఇసుక విక్రయాలు సాగిస్తున్న నిర్వాహకులు.. తమ ఆటోట్రాలీలు, మినీ లారీలను అక్కడే రోడ్డు పక్కనే నిలిపివుంచుతున్నారు. ఇది ప్రధాన రహదారి రావడంతో నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుందని, సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, నల్లకుంట

అడుగడుగునా గుంతలు.. ఆదమరిస్తే ప్రమాదాలు



ముషీరాబాద్ నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్డుకు వెళ్లే ప్రధాన రహదారిపై పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. స్థానికంగా ఉన్న హస్తకళల అభివృద్ధి సంస్థ(గోల్కొండ) ఎదుట రోడ్డుపై.. తారు కొట్టుకుపోయి ప్రస్తుతం అడుగడుగునా గుంతలు దర్శనమిస్తున్నాయి. నిత్యం ఇటుగా రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదాలబారిన పడాల్సివస్తోందని ఆందోళన చెందుతున్నారు. రహదారికి తక్షణం మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు. – న్యూస్‌టుడే, రాంనగర్

పేదల సొంతింటి కల సాకారం


కీసర...రేకుల ఇంటిలో కుటుంబం

సమన్వయానికి ఇందిరమ్మ కమిటీలు
ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సాయం

కీసర, న్యూస్‌టుడే: ఇళ్లులేని నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అడుగులు పడుతున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో పేదలకు ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించే ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డు స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. కమిటీల కోసం పేర్లు పంపించాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను ప్రభుత్వం ఆదేశించింది. ఒక్కో నియోజకవర్గానికి 3500 గృహాలు కేటాయించనున్నారు.

నియోజకవర్గంలో ఇలా...: నియోజకవర్గంలోని ఉమ్మడి మండలాలను ప్రామాణికంగా తీసుకొని కమిటీలు ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుకు అధికారులు గ్రామసభలు, పట్టణాల్లో వార్డు సభలు నిర్వహిస్తారు. ఇటీవల మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామాలతో పాటు మేడ్చల్, శామీర్‌పేట్, మూడుచింతలపల్లి మండలాల్లోని 33 గ్రామ పంచాయతీలు, బోడుప్పల్, ఫీర్జాదిగూడ, జవహర్‌నగర్ పురపాలికలు, నాగారం, దమ్మాయిగూడ, ఘట్‌కేసర్, పోచారం, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, తూంకుంట మున్సిపాలిటీల్లో కమిటీల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నారు.

రూపకల్పన ఇలా..: ◆ ప్రత్యేకాధికారులు, ఇద్దరు మహిళా సంఘాల సభ్యులు, ముగ్గురు గ్రామస్థులు, బీసీ, ఎస్సీ, ఎస్టీల్లో ఒకరు చొప్పున, పంచాయతీ కార్యదర్శి ఉంటారు. ◆ పురపాలిక సంఘాల పరిధిలో వార్డు కౌన్సిలర్, ఇద్దరు మహిళా పొదుపు సంఘాల సభ్యులు, బీసీ, ఎస్సీ, ఎస్టీల్లో ఒకరు చొప్పున ఉంటారు.

లబ్ధిదారుల ఎంపిక: లబ్ధిదారులను గ్రామసభల్లో ఎంపిక చేస్తారు. మూడు దశల్లో ఇంటికి రూ.5 లక్షలు చెల్లిస్తారు. ఎవరైనా అనర్హులు ఎంపికై బిల్లులు తీసుకుంటే వారిపై ఫిర్యాదు చేసి నిధులు రాబట్టే అధికారం ఇందిరమ్మ కమిటీ సభ్యులకు ఉంటుంది.

ఎవరు అర్హులు... ★ జాతీయ ఆహార భద్రత కార్డు ఉండాలి. ★ ఒంటరి మహిళలు, వితంతువులు అర్హులు. ★ సొంతిళ్లు, అద్దె భవనాల్లో నివసిస్తున్న వారికి ప్రాధాన్యం ★ లబ్ధిదారులు పేద, మధ్య తరగతివారై ఉండాలి. ★ సొంతంగా ఇంటి స్థలం కలిగి ఉండాలని పేర్కొన్నారు.

ఉప్పల్
• ఉప్పల్ • మేడ్చల్

పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

ఉప్పల్, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం చేయకూడదని చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతా ముదిరాజ్ పేర్కొన్నారు. బుధవారం పారిశుద్ధ్య సిబ్బందితో సమీక్ష చేశారు. జీవీపీ పాయింట్ల వద్ద కెమెరాల ఏర్పాటుకు కాలనీల సంక్షేమ సంఘాలు ముందుకు వస్తున్నారని తెలిపారు. వారితో సమన్వయం చేసుకొని చెత్త వేయకుండా చూడాలన్నారు. ఎక్కడా అపరిశుభ్రత కనిపించొద్దని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
ఉ.10 నుంచి మ.1 గంట మధ్య

(8008573370 ఉప్పల్) (80085 73372 కాప్రా), (80085 73288 బోడుప్పల్), (98485 99881 ఘట్‌కేసర్), (80960 04937 నాగారం),

న్యూస్‌టుడే: కీసర, నాగారం, మేడ్చల్, కాప్రా

? కీసరలోని రెడ్డి కాలనీలో ఇటీవల రోడ్లు భవనాల శాఖ అధికారులు సిమెంట్ రోడ్డును చాలా ఎత్తులో వేశారు. పక్కల మట్టిపోయక పోవడంతో వాహనాలు రోడ్డు ఎక్కాలంటే కష్టంగా ఉంది.
– భూపాల్‌రెడ్డి, రెడ్డి కాలనీ, కీసర

✓ వాహనాలు ఎక్కే చోట ఇరుపక్కల సిమెంట్ వేసి ఇబ్బందులు రాకుండా చూస్తాం.
– ధన్‌రాజు, ఆర్‌అండ్‌బి ఏఈ కీసర

? రాంపల్లి శ్రామిక్‌నగర్‌లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. బయటకు వెళ్లాలంటే భయపడుతున్నాం
– చలపతిరావు, శ్రామిక్‌నగర్, నాగారం

✓ కుక్కలను అదుపు చేస్తున్నాం ఎక్కడైనా కుక్కలతో సమస్య వస్తే తమను సంప్రదిస్తే చర్యలు తీసుకుంటాం.
–రామిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, నాగారం

? రాంపల్లి సిగ్నల్ నుంచి ఘట్‌కేసర్ వెళ్లే మార్గంలో విద్యుత్తు స్తంభాలకు కేబుల్ తీగలు తెగిపడి ప్రమాదకరంగా ఉన్నాయి.
–రమాకాంత్, అరవింద్‌నగర్, నాగారం

✓ కేబుల్ తీగల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసి వారిపై చర్యలు తీసకుంటాం
– రామిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, నాగారం

? మేడ్చల్ పట్టణం ముకుంద సినిమా హాల్, సూర్యనగర్‌కాలనీ మీదుగా రైల్వేస్టేషన్ వరకు వీధి దీపాలు లేవు.
– శ్రీనివాస్‌రావు, మేడ్చల్.

✓ త్వరలోనే ఏర్పాటు చేస్తాం.
–నాగిరెడ్డి, కమిషనర్, మేడ్చల్ మున్సిపాలిటీ.

? కృష్ణానగర్ రోడ్డు నంబరు5, లైన్ 'ఓ'లో మున్సిపాలిటీ చెత్త డబ్బాలు వదిలేసి వెళ్లారు. ఇబ్బందులు పడుతున్నాం.
– వీఎన్ నిర్మల, కృష్ణానగర్ కాలనీ

✓ రెండు రోజుల్లో చెత్త డబ్బాలు, చెత్తను తొలగిస్తాం.
– సుదర్శన్, శానిటరీ సూపర్‌వైజర్, జీహెచ్ఎంసీ

ట్రాఫిక్ రింగురోడ్డు

◆ వాహనాల పెరుగుదల
◆ దిద్దుబాటు చర్యలు ఎలా..!
◆ అధికారుల మల్లగుల్లాలు

ఉప్పల్: ఉప్పల్ రింగురోడ్డులో పాదచారులకు ఏకంగా రూ.30 కోట్లతో స్కైవాక్‌ను ఏర్పాటు చేశారు. స్కైవాక్ ఏర్పాటుతో రింగురోడ్డు రూపురేఖలు మారిపోయాయి. ఉప్పల్‌లో ప్రధాన రహదారి విస్తరణతో కొంత వరకు ట్రాఫిక్ సమస్య తగ్గింది. కానీ ఉప్పల్ రింగురోడ్డులో మాత్రం రెట్టింపు అయింది. రింగురోడ్డుకు నలువైపులా ఈ సమస్య ఉంది. కారణాలు ఏమైనప్పటికీ రింగురోడ్డులో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరిగిపోతుంది.

ప్రధాన కారణం: సికింద్రాబాద్ నుంచి విజయవాడ, ఎయిర్‌పోర్టుకు వెళ్లే వారి సంఖ్య బాగా పెరిగింది. దానికి తోడూ అంతర్గత రోడ్లు దెబ్బతినడంతో వాహనాలు లింక్ రోడ్ల గుండా వెళ్లలేకపోతున్నాయి. వాహనాల సంఖ్యకు అనుగుణంగా రింగురోడ్డులో విస్తరణ జరగకపోవడమేనని తెలుస్తోంది.


రింగురోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

స్టీల్ వంతెనల నిర్మాణాలు

◆ వరంగల్ వైపు నుంచి వచ్చే వాహనాలకు రింగురోడ్డుకు రావడమే ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ◆ వరంగల్ జాతీయ రహదారిపై ఉప్పల్ రింగురోడ్డులో రెండు వైపులా శ్మశానవాటికలున్నాయి. ◆ వీటితో రింగురోడ్డులో బాటిక్ నెక్‌గా మారింది. పాదచారులు ఇరుకైన మార్గంలో వాహనాల రద్దీతో భయభయంగా నడవాల్సిన పరిస్థితి నెలకొంది. ◆ వీరి కోసం రెండు వైపులా స్టీల్ వంతెనల నిర్మాణం చేయాలనుకుంటున్నారు. ◆ అవసరమైతే పంజాగుట్ట తరహాలో వాహనాలకు సైతం స్టీల్ వంతెనల నిర్మాణాలను చేసే ఆలోచన ఉంది.


ట్రాఫిక్ కిట.. కిట..

చెక్ ఎలా..! ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు ట్రాఫిక్, జీహెచ్ఎంసీ, ఇతర ప్రభుత్వ విభాగాల అధికారులు ఇటీవల చేసిన పరిశీలనలో అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయి.

అధికారుల సంయుక్త పరిశీలన..

ఉప్పల్ రింగురోడ్డులో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఇటీవల ప్రభుత్వ విభాగాల అధికారులు పరిశీలన చేశారు. ● హబ్సిగూడ-ఉప్పల్ రింగురోడ్డు మార్గంలో లిటిల్ ఫ్లవర్ స్కూల్ దాటిన తర్వాత ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. మున్సిపల్ సర్కిల్ కార్యాలయం వైపు రోడ్డు విస్తరణ చేయాలనే నిర్ణయానికి వచ్చారు. ● సర్వే ఆఫ్ ఇండియా ప్రాంతంలోని పిస్తా హౌస్ వద్ద ట్రాఫిక్ సమస్యకు వన్ వే విరుగుడుగా భావిస్తున్నారు. ● రింగురోడ్డుకు నలువైపులా ఎక్కడా కూడా వాహనాలు ఆగకుండా వెళ్లిపోయేలా చూస్తారు.

బస్టాపులను దూరంగా జరుపుతాం..ఆంజనేయులు,డీసీ,ఉప్పల్

ఉప్పల్ రింగ్‌రోడ్డులో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండటంతో అధికారుల బృందం పరిశీలించింది. ప్రత్యామ్నాయ మార్గాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. మరికొన్ని అంశాలపై చర్చలు జరుగుతున్నాయి. కొద్ది రోజుల్లో చర్యలు తీసుకుంటాం.

ఇళ్ల నిర్మాణంలో కమిటీదే బాధ్యత


మాట్లాడుతున్న వజ్రేష్‌యాదవ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి

నాగారం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు నిర్మించే ఇళ్లలో కమిటీ బాధ్యత కీలకమని మేడ్చల్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ బాధ్యుడు తోటకూర వజ్రేష్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి పట్టణ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన కీసర మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పురపాలికల పరిధి కౌన్సిలర్ పరిధిలో ఐదుగురితో ఇందిరమ్మ ఇళ్ల కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, నాగారం,దమ్మాయిగూడ పుర వైస్‌ఛైర్మన్లు బండారు మల్లేష్ యాదవ్, మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

మేడ్చల్: ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల కమిటీ ఏర్పాట్లపై మేడ్చల్ మండలంలోని నాయకులతో బుధవారం మేడ్చల్‌లో సమావేశాన్ని నియోజక పార్టీ ఇన్‌ఛార్జి వజ్రేశ్ యాదవ్ నిర్వహించారు. ఇందులో జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం


బిడ్డను ఇస్తున్న సుధాకర్

జవహర్‌నగర్ , న్యూస్‌టుడే: జవహర్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రానికి బుధవారం రెండో కాన్పుకు వెళ్లిన సోనీ (23)ని పరీక్షించిన వైద్యులు.. కడుపులో బిడ్డ ఉమ్మనీరు తాగిందని గాంధీకి వెళ్లాలని సూచించారు. 108 ఈఎంటీ సుధాకర్, పైలట్ రాజశేఖర్‌లు గర్భిణిని అంబులెన్స్‌లో తీసుకెళుతుండగా మార్గమధ్యలో తీవ్ర నొప్పులు రావడంతో అందులోనే ప్రసవం చేశారు. ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీ, కుమారుడిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు క్షేమంగా ఉన్నారని తెలిపారు.

విసిరేసి వెళ్తున్నారు..!

కొందరు వ్యక్తులు చెత్తను రోడ్లపై విసిరేసి వెళ్తున్నారు. దీంతో ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లు చెత్తతో నిండిపోతున్నాయి. ఈ పరిస్థితి సాకేత్-దమ్మాయిగూడ, ఎల్లారెడ్డిగూడ, వంపుగూడ ప్రధాన రహదారులపై ఉంది. – న్యూస్‌టుడే, కాప్రా



క్రమశిక్షణతో ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలి
విశ్రాంత మేజర్ జనరల్ బీవీ రావు

శామీర్‌పేట, న్యూస్‌టుడే: విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యాన్ని పట్టుదల క్రమశిక్షణతో చేరుకోవాలని ఇండియన్ ఆర్మీ విశ్రాంత మేజర్ జనరల్ బీవీరావు పేర్కొన్నారు. బుధవారం తూంకుంట పుర పాలికలోని విశ్వ విశ్వాని ఇనిస్టిట్యూట్ ఆఫ్ సిస్టం అండ్ మేనేజ్‌మెంట్ విద్యాసంస్థలో ఎంబీఏ 2024-2026 బ్యాచ్ శిఖర్-2024 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని నూతన ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విశ్వ విశ్వాని విద్యాసంస్థలో సైనిక-వ్యాపార విజయానికి కీలకమైన నైపుణ్యాలు అందిస్తూ విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమని తెలిపారు. గౌరవ అతిథిగా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మాజీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రాజశ్రీ బోతల వ్యూహాత్మక ప్రణాళికలతో విద్యార్థులు ఎంచుకున్న రంగాల్లో రాణించేందుకు నిరంతర కృషి అవసరమన్నారు. ఇందులో విద్యాసంస్థల డైరెక్టర్ పి.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.


ఇండియన్ ఆర్మీ విశ్రాంత మేజర్ జనరల్ బీవీరావు, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మాజీ డిప్యూటీ డైరెక్టర్ రాజశ్రీ బోతల, తదితరులు

భక్తిశ్రద్ధలతో సామూహిక బోనాలు

శామీర్‌పేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని శ్రీరేణుకాఎల్లమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో సామూహిక బోనాలను ఊరేగింపుగా తరలివెళ్లి బుధవారం సమర్పించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో ఒగ్గు కళాకారుల డోలు వాయిద్యాల చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, అనురాధ జోగిని ఆటా పాటలు, తుంకి ప్రవీణ్‌గౌడ్, శివసత్తి సత్తయ్య నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యువకుల ఆధ్వర్యంలో ఫలహారం బండి ఊరేగింపు నిర్వహించారు.


బోనాల ఊరేగింపులో అనురాధ జోగిని, ప్రవీణ్‌గౌడ్, శివసత్తి సత్తయ్య

మొక్కలు పెరిగి... దారి ఇరుకై

పట్టణంలోని ఎర్ర చెరువు కట్టపై రహదారికి ఇరువైపులా మొక్కలు ఏపుగా పెరిగాయి. వరుస వర్షాలతో పచ్చదనం పరుచుకుంది. కొన్నిచోట్ల వాహనాల రాకపోకలకు అడ్డంకిగా మారాయి.
– న్యూస్‌టుడే, మేడ్చల్ రూరల్



సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి

మేడ్చల్, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సూచించారు. మల్లారెడ్డి విశ్వవిద్యాలయంలో అగ్రికల్చర్ సైన్స్ విభాగంలో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ షేక్ ఎన్ మీరాన్, వైస్ ఛాన్స్‌లర్ వీఎస్‌కే రెడ్డి, అగ్రికల్చర్ విభాగాధిపతి రాజారెడ్డి, తదితర పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

పాఠశాల విద్యార్థిని చితకబాదిన గుర్తు తెలియని వ్యక్తులు

ఘట్‌కేసర్: పాఠశాల విద్యార్థిని గుర్తుతెలియని వ్యక్తులు చితకబాది ఖాళీ ప్రదేశంలో పడేసి వెళ్లిపోయిన సంఘటన ఘట్‌కేసర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుషాయిగూడ శివసాయినగర్‌కు చెందిన డ్రైవర్ గంధమల్ల రాజు కొడుకు చరణ్(15) మంగళవారం ఉదయం ఇంటి నుంచి దమ్మాయిగూడలోని పాఠశాలకు వెళ్లేందుకు కుషాయిగూడ బస్‌స్టాప్ వద్ద ఆటో ఎక్కాడు. రాంపల్లి చౌరస్తా వద్దకురాగానే చరణ్, ఆటోలో ఉన్న నలుగురి వ్యక్తుల మధ్య గొడవ జరిగింది. దీంతో విద్యార్థిపై దాడి చేశారు. తీవ్ర గాయాలు కావడంతో స్పృహ కోల్పోయాడు. ఆటోలోనే ఘట్‌కేసర్ మండలం ఘనపూర్‌లోని ఖాళీ ప్రదేశానికి తీసుకొచ్చి పడేసి వెళ్లిపోయారు. స్పృహలోకి వచ్చిన తర్వాత స్థానికుల ద్వారా జరిగిన విషయం తండ్రికి చెప్పాడు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఘట్‌కేసర్,న్యూస్‌టుడే: దసరాకు ఊరెళ్లి వచ్చేలోగా ఇంట్లో భద్రపరిచిన బంగారు నగలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తికెళ్లారు. ఘట్‌కేసర్ ఎస్సై నరసింహ తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ పట్టణం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన లకావత్ సంపత్ ఈనెల 12న దసరా పండగకు జనగాం జిల్లా రఘునాథ్‌పల్లికు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. తిరిగి బుధవారం వచ్చి చూసేసరికి తాళం పగలుగొట్టి ఉంది. బీరువాలో ఉన్న 2తులాల బంగారు, సుమారు రూ.30వేలు కనిపించకపోవడంతో బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బాబోయ్.. బైక్ దొంగలు

ఘట్‌కేసర్,న్యూస్‌టుడే: ఘట్‌కేసర్ పోలీసు స్టేషన్ పరిధిలో ద్విచక్రవాహనాల దొంగలు రెచ్చిపోయారు. ◆ ఘట్‌కేసర్ పట్టణం బాలాజీనగర్‌కు చెందిన బండారి శ్రీను ఈనెల 12న కొండాపూర్ మార్గంలో ఉన్న బార్ ఆవరణలో ద్విచక్రవాహనాన్ని పార్కు చేశారు. కొద్ది సేపటి తర్వాత వచ్చి చూస్తే కనిపించలేదు. ◆ అంబేడ్కర్‌నగర్‌కు చెందిన ఈరటిం రాజేశ్ కూడా అదే రోజు గురుకుల్ మైదానంలో జరిగిన దసరా వేడుకలకు ద్విచక్రవాహనంపై వెళ్లాడు. సమీపంలో బైక్‌ను పార్కు చేశాడు. వేడుకల తర్వాత చూస్తే వాహనం లేకుండా పోయింది. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదయ్యింది.

డిమాండ్లు నెరవేర్చాలని మౌనదీక్ష
తపాలా శాఖ విశ్రాంత ఉద్యోగులు

అబిడ్స్, న్యూస్‌టుడే: తమ డిమాండ్లు నెరవేర్చాలని హైదరాబాద్ అబిడ్స్‌లోని డాక్ సదన్ జీపీవో ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి తపాలా శాఖ విశ్రాంత ఉద్యోగుల జేఏసీ బుధవారం మౌన దీక్షకు దిగింది. సుప్రీంకోర్టు నిర్ధారించిన క్యాట్ ఉత్తర్వులను యథాతథంగా అమలు చేయాలని జేఏసీ సభ్యులు డిమాండ్ చేశారు. 1980లో గంటకు రూ.2 చొప్పున వేతనంతో తమ సేవలను వినియోగించుకున్నారన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 383 మందిలో 40మంది చనిపోయారన్నారు. న్యాయబద్ధమైన హక్కుల సాధనకు మూడు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్న తపాలా శాఖ పట్టించుకోవడం లేదని వాపోయారు. అత్యున్నత న్యాయస్థానం తీర్పు ప్రకారం అన్ని రకాల రాయితీలు ఇవ్వడంతో పాటు పోస్టల్ డైరెక్టరేట్ ఆదేశాలను అమలు చేయాలని కోరారు. క్యాట్ ఆర్డర్ల ప్రకారం సర్వీస్ క్రమబద్ధీకరణ చేసి... నియామకం ప్రారంభ తేదీ నుంచి పే ఫిక్సేషన్‌లో ఉన్న అవకతవకలను వెంటనే సరిదిద్దాలి. ఐదో సీపీసీ(సెంట్రల్ పే రివిజన్ కమిషన్) ప్రకారం ఇంక్రిమెంట్లు, పెన్షనరీ బెనిఫిట్స్ వెంటనే ఇవ్వాలని కోరారు. తమ డిమాండ్లు పరిష్కరించేంత వరకు దశలవారీగా ఆందోళన చేస్తామన్నారు. జేఏసీ ఛైర్మన్ దుర్గాప్రసాద్, సభ్యులు మనోహర్, రవికృష్ణ, పి.యాదగిరి, కె.యాదగిరి, కారుణ్య, ఎలిజబెత్ క్రిస్టియన్‌తో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి దాదాపు 200 మంది పాల్గొన్నారు.


అబిడ్స్ జీపీవో వద్ద దీక్షలో పాల్గొన్న తపాలా శాఖ విశ్రాంత ఉద్యోగులు

టపాసుల దుకాణాలకు అనుమతి తప్పనిసరి
రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు

ఈనాడు– హైదరాబాద్: దీపావళి సందర్భంగా తాత్కాలికంగా టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు కచ్చితంగా డీసీపీల నుంచి అనుమతి తీసుకోవాలని రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు స్పష్టం చేశారు. బుధవారం నుంచి 28వ తేదీ వరకూ లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకోవాలని నోటిఫికేషన్ జారీ చేశారు. దరఖాస్తుకు సమర్పించాల్సిన పత్రాలు. ◆ డివిజనల్ ఫైర్ అధికారి నుంచి నిరభ్యంతర పత్రం. ◆ ప్రభుత్వ స్థలమైతే జీహెచ్ఎంసీ నుంచి నిరభ్యంతర పత్రం. ప్రైవేటు స్థలమైతే యజమానులతో చేసుకున్న ఒప్పంద పత్రం. ◆ గతేడాది జారీ చేసిన లైసెన్సు పత్రాలు, పక్కా దుకాణమైతే ఇరుగుపొరుగు నుంచి నిరభ్యంతర పత్రాలు. ◆ దుకాణం స్థలం వివరాలు(సైట్ ప్లాన్), రూ.600 చలానా సమర్పించాలి.

ఆగేవి తక్కువ.. వెళ్లేవే ఎక్కువ

◆ రైల్వే ప్రయాణికుల అవస్థలు..
◆ ఆగని ఎక్స్‌ప్రెస్ రైళ్లు



ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్

ఘట్‌కేసర్, న్యూస్‌టుడే: ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ ఏమన్నారంటే... ఘట్‌కేసర్ మండల కేంద్రానికి చెందినవాడినే అయినా.. ఉత్తర్‌ప్రదేశ్‌లో రాజ్యసభ సభ్యుడిగా అవకాశం ఇచ్చారు.. నా తండ్రి స్టేషన్‌లో క్యాంటీన్ నిర్వహించారు.. ఇక్కడి ప్రయాణికుల సమస్యలు చిన్నప్పుడే నాకు బాగా తెలుసు.. ఎక్స్‌ప్రెస్ రైలు ఆగేందుకు చర్యలు తీసుకుంటా. . సమస్యను కేంద్ర రైల్వే శాఖ మంత్రి దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లా.. మళ్లీ ప్రయత్నిస్తా.. అని గత ఏడాది పౌర సన్మానంలో మాట ఇచ్చారు.. కానీ ఇంతవరకు వరకు అమలు కాలేదు.

నగర శివారు ప్రాంత ప్రజలకు సేవలందించే ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ ప్రయాణికులకు రైళ్లు ఆగక పడుతున్న ఇబ్బందులు తప్పడం లేదు.

◆ కేవలం వరంగల్‌కు వెళ్లే పుష్‌పుల్, రేపల్లె రైళ్లు మాత్రమే ఆగుతున్నాయి.

◆ ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు భువనగిరి, సికింద్రాబాద్ వెళ్లాల్సి వస్తోంది.

ఆకలి తీర్చుతున్న వీధి భోజనశాలలు

◆ పెరుగుతున్న ఆదరణ
◆ పరిశుభ్రతపై దృష్టి సారిస్తే మేలు

హబ్సిగూడ, న్యూస్‌టుడే: ఏదైనా పనికి వెళ్లినా.. ఎక్కడైనా కార్యాలయాల్లో పని చేసినా మధ్యాహ్నం భోజనం చేసేందుకు పెద్ద హోటళ్లకు పరుగులు పెట్టడం లేదు. పొట్ట నింపుకునేందుకు ఎక్కడో కాస్త తినేద్దాం..అనుకునే వారికి ఫుట్‌పాత్‌లోని భోజనశాలలు అనుకూలంగా ఉంటున్నాయి. రద్దీ ప్రాంతాల్లో అనుకూలంగా ఉంటున్నాయి. నోరూరించే రుచులతో పాటు అనుకూలమైన ధర ఉండటంతో ఆసక్తి చూపిస్తున్నారు. నచ్చిన కూరలు: అన్నం, చపాతీలతో పాటు చికెన్, బోటీ, మటన్, కూరగాయలతో కూరలు అందుబాటులో ఉన్నాయి. సాంబారు, పెరుగు వేస్తుండటంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఇక్కడే ఎక్కువ: హబ్సిగూడ నుంచి ఉప్పల్ రింగ్‌రోడ్డు వరకు, రామంతాపూర్ నుంచి ఉప్పల్ వెళ్లే దారి, ఉప్పల్ పారిశ్రామిక వాడ, నాచారం, మల్లాపూర్ ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా నడకదారిలో భోజన విక్రయశాలలను ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగుతున్నాయి. ధర రూ.70లోపే ఎక్కువ చోట్ల ఉంటోంది.


భోజనం చేస్తున్న యువకులు

పరిశుభ్రత పాటిస్తే మేలు...: నిరుద్యోగులు ఉపాధికి నగరానికి వస్తున్నారు. వాళ్లకు భోజన విక్రయ కేంద్రాలు అనుకూలంగా ఉన్నాయి. ఆహారం, మంచినీటిలో పరిశుభ్రత పాటిస్తే ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు.


ఈ పనులు చేస్తే బాగు

◆ భోజనం చేసిన తర్వాత విస్తర్లను ఓ సంచిలో వేయాలి. ◆ ప్లాస్టిక్ గ్లాసులను రోడ్లపై వేయొద్దు. ◆ మిగిలిన ఆహార పదార్థాలను విచ్చలవిడిగా పడేస్తే కుక్కలతో సమస్యలు వస్తాయి. ◆ మిగిలిన ఆహారపదార్థాలను వేడి చేసి పెట్టొద్దు ◆ ఆహారంపై దుమ్ము, ధూళి పడకుండా చూడాలి. ◆ వంటల్లో మంచి నూనె వాడాలి. ◆ చేతికి గ్లౌజులు, తలకు టోపీ తప్పక ధరించాలి.

ఆహార పదార్థాలు నాణ్యతగా ఉండాలి.. – ఆంజనేయులు, ఉపకమిషనర్, ఉప్పల్



వీధి ఆహారం విక్రయించే యజమానులు తక్కువ ధరకు ఇస్తున్నామని నాణ్యత లేని పదార్థాలను వినియోగించొద్దు. మాంసాహారం సరిగా లేకపోతే ఆరోగ్యం దెబ్బతింటుంది. శుచి, శుభ్రత పాటించాలి. నిబంధనలు పాటించని యజమానులపై చర్యలు తీసుకుంటాం.



రోడ్డు పక్కకు వెళ్లారో...రంగు పడుద్ది

చెక్‌పోస్ట్ పారిశ్రామిక వాడ ప్రధాన రహదారిలో గుంతలే కాదు.. నీళ్లు ఆగిపోయి పాదచారులను ఇబ్బంది పెడుతోంది. పెద్ద గుంతల నుంచి వాహనాలు వెళితే పక్కనున్న వారిపై బురద చల్లుతోంది. కార్మికులు ఆ మార్గం గుండా వెళ్లాలంటే భయపడిపోతున్నారు. – న్యూస్‌టుడే, మేడ్చల్

గడప దాటొచ్చి.. కేడీల ఉచ్చులోకి!



అమ్మ తిట్టిందని.. నాన్న కోప్పడ్డాడని.. మార్కులు సరిగా రాలేదని.. మిత్రులతో సినిమాకు వెళ్లడం ఇంట్లో తెలిసిపోతుందనే భయం పిల్లలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఏం చేయాలో పాలుపోని పరిస్థితుల్లో ఇల్లొదిలి వచ్చేస్తారు. ఇలా వచ్చిన అధిక శాతం బాలబాలికలు మాయగాళ్ల వలకు చిక్కుతున్నారు. డబ్బు కోసం వారు చెప్పినట్టు చేస్తున్నారు. నేరస్థులుగా పోలీసు జాబితాలో చేరుతున్నారు.

- నేర వలయంలోకి.. ఇల్లొదిలిన చిన్నారులు
- నగరంలో 3 వేల మంది బాలబాలికలు

రైల్వే పోలీసులకు చిక్కిన చిన్నారులు

సంవత్సరం	అక్రమ రవాణా	అదృశ్యం
2023	64	153
2024(9నెలలు)	102	78

కర్మాన్‌ఘాట్ పోలీసులు ఇటీవల సెల్‌ఫోన్ దొంగను అరెస్ట్ చేశారు. అతడు 12 ఏళ్ల కిందట జార్ఖండ్ నుంచి పారిపోయి సికింద్రాబాద్ చేరినట్టు చెప్పాడు. సిగరెట్ తాగిన విషయం తండ్రికి తెలిసిందనే భయంతో ఇల్లొదిలిన ఆ పసివాడి నిస్సహాయత ఆసరాగా పాత నేరస్థుడు నేరాలకు ఉపయోగించుకున్నట్టు నిర్ధారించారు. పాతబస్తీ పరిధిలో ఆటోల్లో వెళ్తూ జేబు దొంగతనాలకు పాల్పడుతున్న బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. కర్ణాటక నుంచి వచ్చిన ఆ పిల్లాడికి తినుబండారాలు, గంజాయి ఇచ్చి ఓ వ్యక్తి ఈ చోరీలు చేయిస్తున్నట్టు గుర్తించారు. ఇలా ఇంటి నుంచి పారిపోయి దేశం నలువైపుల నుంచి నగరంలోని రైల్వే, బస్సు స్టేషన్లకు చేరే పిల్లలు ఏటా 500-600 మంది ఉంటారని అంచనా. మైగ్రేషన్, రైల్వే పోలీసులు పసిగట్టిన సందర్భాల్లో వీరి వివరాలు సేకరించి తల్లిదండ్రులకు అప్పగిస్తున్నారు. ఇలాంటి 3 వేల మందికి వివిధ నేరాలతో సంబంధమున్నట్టు పోలీసుశాఖ గుర్తించింది.



పన్నెండేళ్ల తరువాత అర్మాన్‌ను తల్లికి అప్పగించిన కార్ఖానా పోలీసులు (పాతచిత్రం)

ఎందుకిలా మారుతున్నారంటే..

అదృశ్యమైన బిడ్డల ఆచూకీ కోసం తల్లిదండ్రులు రూ.లక్షలు ఖర్చుపెడుతుంటారు. కొన్నిసార్లు పోలీసులు కూడా మిస్సింగ్ కేసులను తేలికగా తీసుకోవటంతో పిల్లలపై ఆశలు వదిలేసుకుంటున్నారు. తమకు చిక్కిన చిన్నారుల రూపురేఖలను బెగ్గింగ్ మాఫియా పూర్తిగా మార్చేస్తోంది. స్వగ్రామం ఉంటే గుర్తుపడతారని, ఇతర ప్రాంతాలకు పంపి యాచక వృత్తిలోకి దింపుతున్నారు. ఇంటినుంచి పారిపోయి వచ్చిన చిన్నారుల పరిస్థితి దయనీయంగా ఉంటోందని నగరానికి చెందిన పోలీసు అధికారి విశ్లేషించారు. రౌడీషీటర్లు, పాత నేరస్థులు వారిని తమకు అనువుగా మలుచుకుంటున్నారు. రద్దీ ప్రాంతాల్లో సెల్‌ఫోన్ స్నాచింగ్ నుంచి గంజాయి సరఫరా వరకూ పిల్లలను పావులుగా వాడుకుంటున్నారని తెలిపారు. బాలికలను బాలకార్మికులుగా, మాదకద్రవ్య యాచనకు పంపుతున్నారు. యుక్తవయసు వచ్చాక వ్యభిచార గృహాలకు విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో గుర్తించారు.

ఈనాడు, హైదరాబాద్ రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే

ఎంఎంటీఎస్ రైళ్ల సేవలు మెరుగుపరుస్తాం



మాట్లాడుతున్న డీఆర్ఎం లోకేష్ విష్ణోయ్

కాచిగూడ, న్యూస్‌టుడే: నగరంతోపాటు శివారు ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం ఎంఎంటీఎస్ రైళ్ల సేవలను మరింత మెరుగుపరుస్తామని దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజనల్ మేనేజర్(డీఆర్ఎం) లోకేష్ విష్ణోయ్ తెలిపారు. సంబంధిత సేవలపై సలహాల స్వీకరణకు బుధవారం హైదరాబాద్ డివిజన్‌లోని జంట నగరాల రైలు ప్రయాణికుల సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంఎంటీఎస్ రైళ్ల సమయపాలన పాటించేలా చూస్తామని పేర్కొన్నారు. సీనియర్ డీసీఎం అనిరుధ్ పామర్, సీనియర్ డీవోఎం విద్యాధర్, సీనియర్ డీఈఎన్ కోఆర్డినేషన్ ముత్యాలనాయుడు, ఏసీఎం గోవిందరావు, ప్రయాణికుల సంఘాల ప్రతినిధులు నూర్, రఫీక్, శివరాముడు, పణికుమార్, ప్రభాకర్‌రావు, బాలాజీ, కార్తికేయ, శిరీష్, మనీష్, మారుతి, అజిత్, కేశవ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అభిమాన నటుడి కోసం.. 1600 కి.మీ. సైకిల్‌పై ప్రయాణం



అల్లు అర్జున్‌తో అభిమాని

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: సినీ నటుడు అల్లు అర్జున్ కోసం ఓ అభిమాని సైకిల్‌పై 1600 కి.మీ. ప్రయాణించాడు. అల్లు అర్జున్ అభిమాని ఉత్తరప్రదేశ్ అలీగఢ్ నుంచి సైకిల్‌పై బయల్దేరి జూబ్లీహిల్స్‌లో నటుడిని కలుసుకున్నాడు. అభిమాని హీరోతో కాసేపు ఫొటోలు దిగాడు. ఈ వీడియో వైరల్‌గా మారింది. సైక్లింగ్ మొదలుపెట్టే ముందు చాలాసార్లు హనుమాన్ చాలీసా చదివానని అతను తెలిపాడు.

ఒకేసారి జన్మించి.. మరణించి

- రసాయనాల ట్యాంకులో పడి కవలల దుర్మరణం

ఈనాడు- హైదరాబాద్, జీడిమెట్ల, న్యూస్‌టుడే: హైదరాబాద్ శివారు జీడిమెట్ల పారిశ్రామికవాడలో బుధవారం విషాదం చోటుచేసుకుంది. మూతపడ్డ పరిశ్రమలో పనులు చేస్తూ రసాయనాల ట్యాంకులో పడి కవలలు దుర్మరణం చెందారు. జీడిమెట్ల డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ కనకయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం దొంతికుర్రుకు చెందిన రామ్, లక్ష్మణ్(32)లు కవలలు. ఉపాధి కోసం నగరానికి వచ్చి శివారులోని గండిపోచంపల్లిలో ఉంటూ కూలీలుగా పనిచేస్తున్నారు. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని మూతపడ్డ 'సాబూరి ఫార్మా ప్రైవేటు లిమిటెడ్' సంస్థలో ఫ్యాబ్రికేషన్ పనులు జరుగుతున్నాయి. ఈ పనులను గుత్తేదారు సాదు నారాయణరావు చేయిస్తున్నారు. ఇతడి వద్ద రామ్‌లక్ష్మణ్‌లు పనిచేస్తున్నారు. రోజువారీగానే బుధవారం ఉదయం కంపెనీకి చేరుకుని ఓ షెడ్డుకు ఉన్న పైపులను తొలగిస్తున్నారు. ఈ క్రమంలో రామ్ అదుపుతప్పి కింద ఉన్న ప్రమాదకర రసాయనాలు నిల్వ ఉన్న ట్యాంకులో పడిపోయాడు. రసాయనాలు మింగి రామ్ ఉక్కిరిబిక్కిరి అవ్వడం గమనించిన లక్ష్మణ్ రామ్‌ను కాపాడేందుకు సంపులోకి దిగాడు. అతన్ని వెలికి తీస్తున్న క్రమంలో కొంత రసాయనం లక్ష్మణ్ నోట్లోకి వెళ్లింది. స్పృహ కోల్పోయిన రామ్‌ను బయటకు తీసిన లక్ష్మణ్.. నోట్లో నుంచి నురగలు కక్కుకుంటూ అక్కడే పడిపోయాడు. వీరిద్దర్నీ కాపాడే ప్రయత్నంలో మరో కార్మికుడు వెంకట్రామ్‌రెడ్డి రసాయనం బారిన పడ్డారు. మిగిలిన కార్మికులు గమనించి సమీపం షాపూర్‌నగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు రామ్, లక్ష్మణ్‌లు మృతి చెందినట్లు నిర్ధారించారు. వెంకట్రామ్‌రెడ్డి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. ట్యాంకులో నిల్వ చేసిన రసాయనం ఏమిటన్నది ఇంకా నిర్ధారణ కాలేదు.



రామ్ లక్ష్మణ్

మూసి వేసిన సంస్థలో ప్రమాదకర రసాయనాలు

ఇద్దరి మృతికి కారణమైన సాబూరి పరిశ్రమ నాలుగేళ్లుగా మూసివేసినట్లు జీడిమెట్ల పోలీసు విచారణలో తేలింది. కొన్ని రోజులుగా ఆధునీకరణ పనులను చేపడుతున్నారు. సంస్థ ఆవరణలోని ట్యాంకులో ప్రమాదకర రసాయనాలు ఎలా నిల్వ ఉన్నాయనేది అర్థంకావడం లేదు. రసాయన నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు. ఘటనకు బాధ్యులైన గుత్తేదారు నారాయణరావు, పరిశ్రమ నిర్వాహకుడు సతీశ్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదం గురించి తెలుసుకున్న రాష్ట్ర కార్మిక సంఘం నేత ముద్దాపురం మదన్‌గౌడ్ ఘటన స్థలానికి వెళ్లి మృతుల బంధువుల్ని కలిశారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

డూప్లికేటుగాళ్ల సైబర్ ఆట

స్టాక్ మార్కెట్‌లో మెలకువలంటూ మోసాలు

ప్రతి నెలా జీతానికి తోడు.. ఎంతోకొంత అదనపు ఆదాయం వస్తే ఇంటికి చేదోడుగా ఉంటుందని ఎంతోమంది వేతనజీవులు ఆలోచిస్తుంటారు. ఖాళీ సమయాల్లో స్టాక్‌మార్కెట్లో పెట్టుబడుల మీద ఆసక్తి చూపుతుంటారు. వీరంతా షేర్లు కొనే ముందు పాటించేది ఒక్కటే.. ఆ రంగంలో నిపుణుల సూచన. సరిగ్గా ఇలాంటి నిపుణుల తరహాలోనే సైబర్ నేరగాళ్లు బోల్తా కొట్టిస్తున్నారు. స్టాక్ మార్కెట్ విశ్లేషణచేసే ప్రముఖుల పేర్లతో మోసగిస్తున్నారు. కోట్లల్లో కొల్లగొడుతున్నారు. అందుకు కృత్రిమ మేధ(ఏఐ)ను, మార్ఫింగ్ వీడియోలను వాడేస్తున్నారు. నగరంలో ఈ తరహా మోసాలు వరుసగా పెరుగుతున్నాయి.



వీటి ఆధారంగా ప్రముఖ సంస్థల్లో ఉద్యోగుల డేటా తీసుకొని నేరుగా వారికే మెసేజ్‌లను పంపుతున్నారు. వారి ఫోన్ నంబర్లను వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల్లో చేరుస్తున్నారు. నిపుణుల ఫోటోలను వాట్సాప్ డీపీలో పెట్టి గ్రూపులో సందేశాలు పంపుతున్నారు. ఇవన్నీ చూసి నిజమని భావిస్తున్న బాధితులు రూ.లక్షల్లో పోగొట్టుకుంటున్నారు.

సందేశాలను నమ్మితే అంతే

స్టాక్ నిపుణుల పేరిట జరిగే మోసాల్లో ఎక్కువగా విద్యావంతులు, ఐటీ కంపెనీల ఉద్యోగులు ఉంటున్నారు. దీనికి కారణం నేరుగా ఈ వర్గాలనే లక్ష్యంగా చేసుకోవడమూ ఒక కారణమని పోలీసులు చెబుతున్నారు. సైబర్ ముఠాలు ప్రజల వ్యక్తిగత వివరాలు, పనిచేస్తున్న సంస్థ, వారి బ్యాంకు ఖాతా వివరాలు సేకరిస్తాయి.

మోసానికి ఏఐ సాయం

స్టాక్ నిపుణుల పేరుతో జరిగే మోసాల్లో నేరగాళ్లు ఏఐని విస్తృతంగా వినియోగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఏఐ సాయంతో గొంతు మార్చి ఫలానా కంపెనీ షేర్లు కొనాలని, యాప్ డౌన్‌లోడ్ చేయాలంటూ వీడియోలు సృష్టిస్తున్నారు. మార్ఫింగ్ వీడియోలు, నకిలీ పోస్టులు గ్రూపుల్లో పోస్టు చేస్తున్నారు. వీటిని గుడ్డిగా నమ్ముతున్న బాధితులు చెప్పినట్లు వింటూ కష్టార్జితం కోల్పోతున్నారు.

ఇటీవల ఉదంతమిదీ..!

- బాచుపల్లికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి(51) ఫోన్ నంబరును గుర్తు తెలియని వ్యక్తులు ఓ వాట్సాప్ గ్రూపులో చేర్చారు. షేర్ల క్రయవిక్రయాలపై మెళకువలు నేర్పిస్తామంటూ బాధితుడికి వేర్వేరు కారణాలు చెప్పి రూ. 2.26 కోట్లు కొట్టేశారు.
- బహదూర్‌పుర ప్రాంతానికి చెందిన ప్రైవేటు ఉద్యోగి వాట్సాప్ నంబరును గుర్తుతెలియని వ్యక్తులు ఓ వాట్సాప్ గ్రూపులో చేర్చారు. క్రిప్టోకరెన్సీ మీద తరచూ విశ్లేషణలు చేసే నిపుణుడి డీపీ ఉన్న వాట్సాప్ నంబరుతో సందేశాలు పంపేవాడు. క్రిప్టో కరెన్సీ కొనుగోలు చేయాలని ఓ యాప్ డౌన్‌లోడ్ చేయించి రూ. 94 లక్షలు వసూలు చేశారు.

ఈనాడు- హైదరాబాద్



వేడుక ముగిసె.. వ్యర్థాలే తరలాలిక

నెల రోజులుగా హుస్సేన్ సాగర్‌లో వేల సంఖ్యలో విగ్రహాల నిమజ్జనం నిర్వహించగా (వినాయక విగ్రహాలు, విశ్వకర్మ, దుర్గామాత విగ్రహాలు) నిర్విరామంగా పనిచేసిన హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ సిబ్బంది అలిసిపోయారు. నెక్లెస్ రోడ్డులో పేరుకుపోయిన పీవోపీ వ్యర్థాలు గుట్టలను తలపిస్తున్నాయి. వీటిని నగరం వెలుపలకు తరలించడానికి మరో యజ్ఞమే చేయాలని పారిశుద్ధ్య సిబ్బంది వాపోతున్నారు.

భారత్-తుర్కియేల వ్యాపార బలోపేతానికి ఐటీఎఫ్ఏ



మాట్లాడుతున్న తుర్కియే కాన్సుల్ జనరల్ ఒకాన్, పక్కన ఫయాజ్ ఖాన్

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: భారత్-తుర్కియే దేశాల మధ్య వ్యాపార సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి ఇండో-తుర్కియే ఫ్రెండ్‌షిప్ అసోసియేషన్(ఐటీఎఫ్ఏ)ను ఏర్పాటుచేసినట్లు హైదరాబాద్‌లో తుర్కియే కాన్సుల్ జనరల్ ఒర్హాన్ యల్మాన్ ఒకాన్ తెలిపారు. 2023లో ఇరుదేశాల మధ్య 2 బిలియన్ అమెరికన్ డాలర్ల వ్యాపార లావాదేవీలు దాటాయని, రానున్నరోజుల్లో 20బిలియన్ డాలర్ల వ్యాపారాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. తుర్కియే కాన్సులేట్‌లో బుధవారం ఐటీఎఫ్ఏ ఛైర్మన్ ఎంఏ ఫయాజ్ ఖాన్‌తో కలిసి ఆయన వివరాలను వెల్లడించారు. భారత్-తుర్కియే మధ్య ఆర్థిక, సామాజిక, సంస్కృతిక సంబంధాలను ద్వైపాక్షికంగా మరింత బలోపేతం చేసే దిశగా ఒక వేదికగా ఐటీఎఫ్ఏ నిలుస్తుందన్నారు. వ్యాపారపరంగా భారత్ నుంచి దాదాపు 70 శాతం ఎగుమతులు అవుతున్నాయని, తుర్కియే నుంచి దాదాపు 30 శాతం దిగుమతులు భారత్‌కు జరుగుతున్నాయన్నారు. హైదరాబాద్ నగరం అన్ని రంగాల్లో అతివేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఒకటని ఆయన అభిప్రాయపడ్డారు. ఎంఏ ఫయాజ్ మాట్లాడుతూ.. సినిమా రంగానికి ఇక్కడ మంచి అవకాశాలున్నాయని, చిత్రాలతోపాటు వెబ్ సిరీస్‌లు నిర్మించుకోవడానికి మంచి దేశమని వివరించారు.

ఆర్య వైశ్యుల అభివృద్ధికి నిరంతరం కృషి: ఐవీఎఫ్



కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులు

మాదాపూర్, న్యూస్‌టుడే: ఆర్య వైశ్యుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు అశోక్ అగర్వాల్ అన్నారు. బుధవారం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం హైటెక్ సిటీలోని ఓ హోటల్‌లో నిర్వహించారు. ఐవీఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి అశోక్ అగర్వాల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఐవీఎఫ్ జాతీయ నాయకులు గంజి రాజమౌళి గుప్తా, రాష్ట్ర నాయకులు ముత్యాల సత్తయ్య, సంతోష్ గుప్తా, బిజ్జల నవీన్ గుప్తా, గట్టు మహేష్ గుప్తా, సంబు పాండు గుప్తా, కటకం శ్రీనివాస్ గుప్తా, చింతల రజినీకాంత్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

అగ్రశ్రేణి జాబితాలో 27 మంది ఐఐసీటీ శాస్త్రవేత్తలకు చోటు

ఈనాడు, హైదరాబాద్: ప్రపంచంలోని అగ్రశ్రేణి 2 శాతం శాస్త్రవేత్తల జాబితాలో నగరంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ(ఐఐసీటీ) చెందిన 27 మంది శాస్త్రవేత్తలకు చోటు దక్కింది. యూఎస్ఏలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ఈ జాబితాను ఇటీవల ప్రచురించింది. ఐఐసీటీ మాజీ డైరెక్టర్ డాక్టర్ శ్రీవారి చంద్రశేఖర్‌తో పాటూ ఇతర శాస్త్రవేత్తలు అగ్రశ్రేణి జాబితాలో చోటు నిలుపుకున్నారు.

కులగణనకు అన్ని పార్టీలు సహకరించాలి: వీహెచ్

అంబర్‌పేట: రాష్ట్రంలో కులగణనకు అన్ని పార్టీలు సహకరించాలని కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు కోరారు. కులగణనకు ప్రభుత్వం జీవోజారీచేసిన నేపథ్యంలో బుధవారం అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తాలో బీసీ సంక్షేమసంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ రాంబాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్‌లతో కలిసి జ్యోతిరావు పులే విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు.



పులే విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న వీహెచ్. చిత్రంలో గుజ్జ కృష్ణ, దిడ్డి రాంబాబు, శ్రీకాంత్‌గౌడ్

అత్యాచారం చేసిన ఆటోడ్రైవర్ అరెస్టు

గచ్చిబౌలి, న్యూస్‌టుడే: అర్ధరాత్రి ప్రయాణికురాలిపై అత్యాచారానికి పాల్పడిన ఆటోడ్రైవర్‌ను గచ్చిబౌలి పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్ తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల 15న తెల్లవారుజామున 2.15 గంటలకు గచ్చిబౌలి వెళ్లేందుకు రామచంద్రాపురం వద్ద ఆటో ఎక్కిన ఓ యువతి(32)పై మార్గమధ్యలో ఆటోడ్రైవర్ అత్యాచారానికి పాల్పడింది జంగం ప్రవీణ్(24)గా గుర్తించారు. నల్గొండ జిల్లా కేతెపల్లి మండలం కొర్లపహాడ్‌కు చెందిన ఇతను కొంతకాలం క్రితం శేరిలింగంపల్లికి వలసవచ్చాడు. సీసీకెమెరాల దృశ్యాల ఆధారంగా ఆటోను గుర్తించిన పోలీసులు ఐదు బృందాలుగా ఏర్పడి ప్రవీణ్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఆల్విన్‌కాలనీలో ఉన్న ప్రవీణ్‌ను అరెస్టుచేసి ఆటోను స్వాధీనం చేసుకున్నారు.

అభ్యంతరకర ప్రసంగాలతో మత విద్వేషం

- విగ్రహం ధ్వంసం కేసులో నిందితుడిపై ప్రభావం
- హోటల్ గదిలో అనుమతిలేని వ్యక్తిత్వ వికాస శిక్షణ కేంద్రం

ఈనాడు, హైదరాబాద్ రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: నగరంలో కలకలం రేకెత్తించిన విగ్రహం విధ్వంసం కేసులో.. నిందితుడు ఇతర మతాలపై విద్వేషంతోనే ఈ దుశ్చర్యకు పాల్పడినట్టు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో గుర్తించినట్లు ఉత్తరమండలం డీసీపీ రష్మి పెరుమాళ్ బుధవారం తెలిపారు. ఈనెల 14న సికింద్రాబాద్‌లోని ఓ ప్రార్థనమందిరంలోకి అక్రమంగా ప్రవేశించిన ముంబయికి చెందిన వ్యక్తి(30).. విగ్రహాన్ని ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. ఘటనపై పోలీసులు కేసు నమోదుచేశారు. దర్యాప్తులో పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు డీసీపీ వెల్లడించారు. ముంబయికి సమీపంలోని ముంబ్రా ప్రాంతానికి చెందిన యువకుడు ఇంజినీరింగ్ పూర్తిచేశాడు. యూట్యూబ్‌లో నిషేధిత మతబోధకుడు జకీర్‌నాయక్ ప్రసంగాలకు ప్రేరేపితుడై ఇతర మతాలపై ద్వేషం పెంచుకున్నాడు. 2022 ముంబయిలో ఓ మందిరానికి పాదరక్షలతో వెళ్లి నిర్వాహకులతో గొడవ పెట్టుకొన్నాడు. ఈ ఏడాది ఆగస్టులో మరో మందిరంలోకి అక్రమంగా ప్రవేశించి విగ్రహాన్ని ధ్వంసం చేశాడు. అక్టోబరు మొదటి వారంలో హైదరాబాద్‌కు చేరాడు. కొన్నాళ్లుగా రెజిమెంటల్‌బజార్‌లోని హోటల్ మెట్రోపోలిస్‌లో ఇంగ్లిష్ హౌస్ అకాడమీవారి పర్సనాలిటీ డెవలప్‌మెంట్ తరగతులకు హాజరవుతున్నాడు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటుచేసిన అకాడమీ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీసీపీ తెలిపారు. ప్రస్తుతం ఆసుపత్రిలో ఉన్న నిందితుడి ఆరోగ్యం విషమంగా ఉందని పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో రియల్‌ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య

నాగోలు, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ రియల్‌ఎస్టేట్ వ్యాపారి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎల్బీనగర్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మంచిర్యాలకు చెందిన సామ రోహిత్‌కుమార్ (32) ఎల్బీనగర్ శ్రీశంకర్‌కాలనీలో ఉంటున్నాడు. భార్య ప్రియాంక, ఆరేళ్ల పాప ఉన్నారు. గతంలో మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేశాడు. ప్రస్తుతం రియల్‌ఎస్టేట్ చేస్తున్నాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు అధికం కావడంతో తీవ్ర మనో వేదనకు గురయ్యాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొంతకాలంగా ఎల్బీనగర్ సూర్యోదయనగర్‌లో అత్తగారింట్లో ఉంటున్నారు. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో బ్యాంక్‌కు వెళ్తున్నానని చెప్పి, శ్రీశంకర్‌నగర్‌లో వారుండే ఇంటికి వెళ్లాడు. అనంతరం ఫోను స్విచాఫ్ చేశాడు. వేరే పని మీద భార్య.. శ్రీశంకర్‌నగర్‌లోని ఇంటికి రాగా, సీలింగ్ ఫ్యానుకు ఉరేసుకొని కనిపించాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు.

'బీసీ కుల గణన వెంటనే ప్రారంభించాలి'

నేరేడ్‌మెట్: రాష్ట్ర ప్రభుత్వం బీసీ కుల గణనకు విడుదల చేసిన జీవో నం.18 ప్రకారం వెంటనే కార్యాచరణ ప్రారంభించాలని రాష్ట్ర బీసీ కులసంఘాల ఐకాసా ఛైర్మన్ గణేష్‌చారి డిమాండ్ చేశారు. బీసీ జాతీయ సంక్షేమసంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆదేశాలతో సైనిక్‌పురిలోని జ్యోతిరావు పులె విగ్రహానికి గణేష్‌చారి నివాళులర్పించారు. బత్తిని నరసింహగౌడ్, శేఖర్, శ్రీరాములు, శంకరాచారి పాల్గొన్నారు.



జ్యోతిరావు పులె విగ్రహానికి నివాళులర్పిస్తున్న గణేష్ చారి

చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి బాలుర అప్పగింత

ఈనాడు కథనానికి స్పందన

కాచిగూడ: 'కదులుతున్న రైలులో..ఎక్కుతూ దిగుతూ విన్యాసాలు' పేరిట 16న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి కాచిగూడ ఆర్పీఎఫ్ అధికారులు స్పందించారు. బడికి వెళ్లకుండా ఎంఎంటీఎస్ రైళ్లలో విన్యాసాలు చేస్తున్న రాంనగర్‌కు చెందిన 11-12 ఏళ్ల మధ్య వయసున్న ముగ్గురు బాలురను జామై ఉస్మానియా స్టేషన్ వద్ద బుధవారం అదుపులోకి తీసుకుని జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులకు అప్పగించారు.

నాలుగు నెలల్లో మరో రెండు ఛార్జింగ్ యూనిట్లు



ఈనాడు, హైదరాబాద్: విద్యుత్ బస్సుల కొనుగోళ్లు, ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుపై గ్రేటర్ ఆర్టీసీ వడివడిగా అడుగులేస్తోంది. ఇప్పటికే హెచ్‌సీయూ, జేబీఎస్, కంటోన్మెంట్, మియాపూర్ డిపోల్లో ఛార్జింగ్ స్టేషన్లు అందుబాటులోకి రాగా మరో రెండు ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు కానున్నాయి. హయత్‌నగర్, రాణిగంజ్ డిపోల్లో ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు రూ.9కోట్లు టీఎస్ఎస్పీడీసీఎల్‌కు చెల్లించింది. ఈ మేరకు పనులు చేపట్టేందుకు టీఎస్ఎస్పీడీసీఎల్ టెండర్లను ఆహ్వానించింది. టెండర్ల ప్రక్రియ, పనులు పూర్తయి, విద్యుత్ సరఫరా ప్రారంభించేందుకు మరో నాలుగు నెలలు పట్టే అవకాశం ఉంది. ఈలోగా కొత్త బస్సుల కొనుగోలు ప్రక్రియపై ఆర్టీసీ దృష్టిపెట్టింది. నాలుగు నెలల్లో మరో 150 బస్సులను రోడ్డెక్కించాలని కసరత్తు చేస్తోంది.

హయత్‌నగర్ నుంచి విద్యుత్ బస్సులు: నగరంలో ప్రస్తుతం 187 విద్యుత్ బస్సులను ఆర్టీసీ నడుపుతోంది. అందులో సిటీ ఆర్డినరీ, ఏసీ, నాన్ ఏసీ బస్సులున్నాయి. హయత్‌నగర్‌లో ఛార్జింగ్ స్టేషన్ కోసం సుమారు రూ.4కోట్లు టీఎస్ఎస్పీడీసీఎల్‌కు ఆర్టీసీ చెల్లించింది. టెండర్ ప్రక్రియ, పనులు పూర్తయి విద్యుత్ సరఫరా ప్రారంభమవడానికి మరో రెండు నెలల పడుతుందని, రాణిగంజ్ డిపోలో ఛార్జింగ్ స్టేషన్‌కు రూ.5కోట్లు చెల్లించగా నాలుగు నెలల్లో పనులు పూర్తవుతాయని ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు.

అంబేడ్కర్ విదేశీ విద్యా నిధి దరఖాస్తు గడువు పొడిగింపు

గన్‌ఫౌండ్రి: ఎస్సీ విద్యార్థులు అంబేడ్కర్ విదేశీ విద్యా నిధి పథకం ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకునే గడువును ఈనెల 29 వరకు పొడిగించినట్లు హైదరాబాద్ జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ పెరిక యాదయ్య ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు https://telanganaepass.org.gov.in లో సంప్రదించాలని ఆయన కోరారు.

అండర్-19 ఛాలెంజర్ ట్రోఫీకి హైదరాబాద్ అమ్మాయిలు

ఈనాడు, హైదరాబాద్: బీసీసీఐ అండర్-19 ఛాలెంజర్ ట్రోఫీకి అయిదుగురు నగర క్రికెటర్లు ఎంపికయ్యారు. హైదరాబాద్ నుంచి త్రిష, కావ్య, ధృతి, సంధ్య గోరా, నిధి ఎంపికైనట్లు హెచ్‌సీఏ కార్యదర్శి దేవరాజ్ ఓ ప్రకటనలో తెలిపాడు. ఈనెల 24న రాయ్‌పుర్‌లో ఈ టోర్నీ ప్రారంభంకానుంది.

భుజంగరావు మధ్యంతర బెయిల్ గడువు పొడిగింపు

ఈనాడు, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడైన భుజంగరావు మధ్యంతర బెయిల్‌ను నాంపల్లి కోర్టు నవంబరు 10 వరకు పొడిగించింది. బెయిల్ పిటిషన్‌పై ఈ నెల 9న వాదనలు జరగ్గా తీర్పును బుధవారానికి వాయిదా వేసింది. రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేసిన న్యాయస్థానం మధ్యంతర బెయిల్‌ను పొడిగిస్తున్నట్టు ఉత్తర్వులిచ్చింది. నవంబరు 11న కోర్టు ఎదుట హాజరు కావాలని భుజంగరావును ఆదేశించింది.



వరద బాధితులకు అండగా..

వరద బాధితుల సహాయార్థం ఈనాడు రిలీఫ్ ఫండ్‌కు రూ.1,50,083 విరాళం అందజేసిన సికింద్రాబాద్‌లోని సత్యం వెంచర్ ఇంజినీరింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఉద్యోగులు.

బజాజ్ ఎలక్ట్రానిక్స్ బంపర్ డ్రా



కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: కేపీహెచ్‌బీలో సినీతార ఫరియా అబ్దుల్లా(జాతిరత్నాలు ఫేమ్) సందడి చేసింది. బుధవారం నెక్సెస్‌మాల్ హైదరాబాద్‌లో బజాజ్ ఎలక్ట్రానిక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన బంపర్ డ్రాలో నటి లక్కీ కూపన్ తీసి విజేతను ప్రకటించింది. లక్డీకాపూల్‌కు చెందిన వ్యక్తి రూ.20లక్షలు నగదు బహుమతి గెలుచుకున్నాడు. పండగల నేపథ్యంలో బజాజ్ ఎలక్ట్రానిక్స్ 'ఇండియన్ బిగ్గెస్ట్ ఫెస్టివల్ ఆఫర్'కి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. రూ.కోటి నగదు బహుమతులతోపాటు 30 ఆల్టో కే10 కార్లను లక్కీడ్రా కింద తమ వినియోగదారులకు అందించనుంది. బజాజ్ ఎలక్ట్రానిక్స్ సీఈవో కరణ్ వినియోగదారులకు కృతజ్ఞతలు తెలిపారు.

మాదిగల దసరా మిలాప్ వేడుకలు 20న



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న కేపీ నర్సింగ్‌రావు, బి.నర్సింగ్‌రావు తదితరులు

బషీర్‌బాగ్: అరుంధతీయ బంధు సేవా మండలి తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మాదిగల దసరా మిలాప్ వేడుకలు నిర్వహించనున్నట్లు సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కేపీ నర్సింగ్‌రావు, జంటనగరాల అధ్యక్షుడు బి.నర్సింగ్‌రావు వెల్లడించారు. బుధవారం మాట్లాడుతూ కాచిగూడ స్టేషన్‌రోడ్డులోని మున్నూరుకాపు మ్యాడం అంజయ్య హాల్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6.30వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ రంగ సంస్థలు.. దేశాభివృద్ధికి ప్రాథమిక స్తంభాలు




మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ. చిత్రంలో బుర్రా వెంకటేశం, అజయ్ మిశ్రా

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ(సీపీఎస్‌యూ)లు కేవలం ఆర్థిక సంస్థలు మాత్రమే కాకుండా వృద్ధిని పెంపొందించడం, ఉపాధిని సృష్టించడం, స్వావలంబనగా దేశానికి తోడ్పటం ద్వారా దేశ అభివృద్ధికి తోడ్పడే ప్రాథమిక స్తంభాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అభివర్ణించారు. రాష్ట్రంలోని సీపీఎస్‌యూల అధిపతులతో బుధవారం రాజ్‌భవన్‌లో సమావేశం జరిగింది. గవర్నర్ మాట్లాడుతూ.. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) సహకారం అణగారిన వర్గాల జీవితాలను గణనీయంగా మెరుగుపరుస్తుందన్నారు. సీపీఎస్‌యూలు విద్య, ఆరోగ్య కార్యక్రమాలతో పిల్లలకు ఉజ్వల భవిష్యత్తును అందించడం అనేది దేశ భవిష్యత్తుకు పెట్టుబడి అన్నారు. సమావేశంలో గవర్నర్ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఐఆర్‌సీఎస్ తెలంగాణ రాష్ట్ర శాఖ ఛైర్మన్ అజయ్ మిశ్రా, రాజ్‌భవన్ అధికారులు, సీపీఎస్‌యూ అధినేతలు పాల్గొన్నారు.

హీరో రామ్‌చరణ్ పెద్ద మనసు

ప్రాణాపాయంలో ఉన్న చిన్నారికి అండదండ



ఈనాడు, హైదరాబాద్: పుట్టుకతోనే పల్మనరీ హైపర్‌టెన్షన్‌తో బాధపడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ చిన్నారికి 53 రోజులపాటు చికిత్సకు హీరో రామ్‌చరణ్ సాయం అందించారు. మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు ఆగస్టు 22న నగరానికి చెందిన ఓ ఫొటో జర్నలిస్టు దంపతులకు చిన్నారి జన్మించింది. పాప గుండెలో సమస్య ఉందని, బతకడం కష్టమని వైద్యులు చెప్పడంతో చిన్నారిని అపోలో ఆసుపత్రిలో చేర్పించారు. లక్షలు ఖర్చు చేసే ఆర్థికస్థితి ఆ తండ్రికి లేకపోవడంతో సతమతమవుతున్నారు. ఈ సమాచారం రామ్‌చరణ్‌కు తెలియడంతో 53 రోజులపాటు చికిత్సకు సాయమందించారు. రక్తం, ప్లేట్‌లెట్లు వంటివి చిరంజీవి బ్లడ్ బ్యాంకు అందించింది. చిన్నారి కోలుకోవడంతో బుధవారం డిశ్చార్జి చేశారు.

నగరంలో ఈనాడు

- ఉస్మానియా వర్సిటీ ఆడిటోరియంలో మ.3 గంటలకు డా.సూరి భగవంతం 115వ జయంతి సందర్భంగా ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానం.
- బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మ.12 కు పిల్లలపై లైంగిక నేరాలు అరికట్టడంపై చర్చ.

చికెన్ ధరలు

ఫాంరేటు	126-00
రిటైల్	148-00
డ్రెస్డ్	215-00
స్కిన్‌లెస్	244-00

టపాసుల దుకాణాలకు అనుమతి తప్పనిసరి

రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు

ఈనాడు, హైదరాబాద్: దీపావళి సందర్భంగా తాత్కాలికంగా టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు కచ్చితంగా డీసీపీల నుంచి అనుమతి తీసుకోవాలని రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు స్పష్టం చేశారు. బుధవారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకూ లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకోవాలని నోటిఫికేషన్ జారీ చేశారు. **దరఖాస్తుకు సమర్పించాల్సిన పత్రాలు.** ☛ డివిజనల్ ఫైర్ అధికారి నుంచి తీసుకున్న నిరభ్యంతర పత్రం. ☛ ప్రభుత్వ స్థలమైతే జీహెచ్ఎంసీ నుంచి నిరభ్యంతర పత్రం. ప్రైవేటు స్థలమైతే యజమానులతో చేసుకున్న ఒప్పందపత్రం ఇవ్వాలి. ☛ గతేడాది జారీ చేసిన లైసెన్సు పత్రాలు, పక్కా దుకాణమైతే ఇరుగు పొరుగు నుంచి నిరభ్యంతర పత్రాలు అవసరం ☛ దుకాణం స్థలం వివరాల(సైట్ ప్లాన్)తో పాటు రూ.600 చలానా అందజేయాలి.

ఎల్.బి.నగర్

•ఎల్.బి.నగర్ • మలక్‌పేట

ఉపకార వేతనాలు విడుదల చేయాలని రాస్తారోకో



మూసారాంబాగ్, న్యూస్‌టుడే: ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం దిల్‌సుఖ్‌నగర్ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. పలు కళాశాలల విద్యార్థులు దిల్‌సుఖ్‌నగర్‌లో జాతీయ రహదారిపై సుమారు గంటన్నర పాటు బైఠాయించడంతో ట్రాఫిక్ స్తంభించింది. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపకార వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ రహదారిపై పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోవడంతో మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులు.. అక్కడకు చేరుకున్నారు. విద్యార్థి నేతలను అదుపులోకి తీసుకొని.. వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ.10 నుంచి మ.1 గంట మధ్య
ఎల్బీనగర్: 76759 19030
మలక్‌పేట: 80085 73284
హయత్‌నగర్: 98336 64897
కర్మన్‌ఘాట్: 94400 32872
బండ్లగూడ: 96034 78579
మూసారాంబాగ్: 79933 00559

న్యూస్‌టుడే, బండ్లగూడ, చంచల్‌గూడ, వనస్థలిపురం, సైదాబాద్, కర్మన్‌ఘాట్

? చావుని డివిజన్ పరిధిలో రేతిబౌలి, మామా రజనీ, నూరుల్ ఆసఫా, ఫతేయుల్లా బేగ్ మసీదుల వద్ద చెత్త, ఇతర వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. శుక్రవారం ప్రార్థనలకు మసీదులకు వెళ్లే సమయంలో దారులు అధ్వానంగా ఉంటున్నాయి. – మహమూద్, చావుని

✓ వెంటనే పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి.. చెత్త, ఇతర వ్యర్థాలను తరలిస్తాం. – డా.అనురాధ, పారిశుద్ధ్య అధికారి, మలక్‌పేట

? ఫత్తుల్లాగూడ వసంత్ విహార్ వేడుకల మందిరం నుంచి గ్రామానికి వెళ్లే దారిలో నాలుగు వీధి దీపాలు పది రోజులుగా వెలగడం లేదు. సిబ్బందికి సమాచారమిద్దామంటే, ఫోన్లు ఎత్తడం లేదు. – కాటేపాక విజయ్, ఫత్తుల్లాగూడ

✓ తక్షణమే సిబ్బందిని పంపించి, మరమ్మతులు చేయిస్తాం. – కోటయ్య, సూపర్‌వైజర్, వీధి దీపాల విభాగం, జీహెచ్ఎంసీ

? వైదేహి నగర్ నుంచి బీఎన్‌రెడ్డి నగర్ చౌరస్తా మధ్యలో కరెంటు స్తంభం కూలేందుకు సిద్ధంగా ఉంది. కొత్తది ఏర్పాటు చేయాలి. – యుగంధర్, బీఎన్‌రెడ్డి నగర్

✓ తక్షణమే ధ్వంసమైన విద్యుత్తు స్తంభాన్ని తొలగించి, నూతన స్తంభాన్ని ఏర్పాటు చేస్తాం. – రామచంద్ర, ఏడీ, విద్యుత్తు విభాగం

? సైదాబాద్- చంచల్‌గూడ మార్గం డబుల్ బెడ్‌రూమ్ నివాసాల వద్ద గతంలో బస్‌స్టాపులు ఉండేవి. రహదారి విస్తరణలో భాగంగా వాటిని తొలగించారు. అప్పటినుంచి ఆర్టీసీ బస్సులు ఆపడం లేదు. – ఎంకే అఖిల్, సైదాబాద్

✓ సమయానుసారం బస్సులు ఆపేలా డ్రైవర్లకు తగు ఆదేశాలు జారీ చేస్తాం. – విజయకుమార్, డీఎం, మిధాని

? బైరామల్‌గూడ నుంచి సరూర్‌నగర్ రోడ్డు మార్గంలో గుంతల కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలి. – శ్రీనివాసులు, లింగోజిగూడ

✓ ఈ సమస్య మా పరిశీలనలో ఉంది. కొన్ని ప్రాంతాల్లో గుంతలకు మరమ్మతులు పూర్తిచేశాం. మరోసారి పరిశీలించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు చేపడతాం. – విజయ్‌కుమార్, ఏఈ

నిరంతర సరఫరాకు నిధుల సమస్య

ముందుకు సాగని కవర్ కండక్టర్ల ఏర్పాట్లు

సైదాబాద్, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారులకు కోతలు లేని, మెరుగైన సరఫరా అందించేందుకు అధికారులు చేస్తున్న ప్రయత్నాలు. . ముందుకు సాగడం లేదు. ఆస్మాన్‌గఢ్ (సిటీ-8) పరిధిలో మలక్‌పేట, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట, చార్మినార్, ఎల్బీనగర్ నియోజకవర్గాల్లో 122 ఫీడర్లు ఉన్నాయి. ప్రధానంగా ఆస్మాన్‌గఢ్, సైదాబాద్, సలీంనగర్ సెక్షన్ల పరిధిలో పెద్ద సంఖ్యలో వృక్షాలు, చెట్లు ఉండటంతో సరఫరాకు తరచూ అంతరాయాలు ఎదురవుతున్నాయి. చిరుజల్లులు కురిసినా సాంకేతిక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సమస్య పరిష్కారానికి ఇన్సులేటెడ్ వైర్లు (కవర్ కండక్టర్లు) ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. నియోజకవర్గ పరిధిలో 220 కిలో మీటర్ల మేరకు ఈ పనులు చేపట్టాల్సి ఉంటుందని అధికారులు గతంలోనే అంచనా వేశారు. అయితే నిధులు లేక.. ఈ పనులు చేపట్టలేక పోతున్నారు.

డిజిటల్ సర్వే కలిసొచ్చేనా?

డీఈ హనుమంతరెడ్డి పర్యవేక్షణలో పలువురు అధికారులతో కూడిన ప్రత్యేక బృందం ఈ ఏడాది మే నెలలో విద్యుత్తు ఫీడర్ల సమగ్ర డిజిటల్ సర్వే చేపట్టింది. 'జీఐఎస్ మ్యాపింగ్' చేస్తూ ఫీడర్ల పక్కా సమాచారం పొందుపర్చారు. క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ 'పోల్-టూ-పోల్' సమస్యలు గుర్తించారు. 122 ఫీడర్ల పరిధిలోని విద్యుత్తు నియంత్రికలు, 168 విద్యుత్తు స్తంభాలు అధ్వాన దశలో ఉన్నట్లు గుర్తించారు. నియంత్రికల సామర్థ్యం, స్తంభాల పరిస్థితి, వాటి మధ్య ఉన్న దూరం, ఏబీ స్విచ్‌ల పనితీరు, ఇన్సులేటర్లు, నియంత్రికలపై ఓవర్‌లోడ్, కండక్టర్లతో సహా తీగలకు చెట్ల కొమ్మలు అడ్డుగా ఉన్న పలు ప్రాంతాల వివరాలు యాప్‌లో నమోదు చేశారు. ధ్వంసమైన, వంగిన, తుప్పుబట్టిన స్తంభాలతో పాటు వేలాడుతున్న తీగలను మార్చాల్సి ఉందని ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. అయితే నేటికీ నిధులు మంజూరు కాలేదు.

వారంవారం మరమ్మతులు..: సకాలంలో నిధులు మంజూరు కాకపోవడంతో ప్రణాళికను అమలు చేసేందుకు అవాంతరాలు ఎదురవుతున్నాయి. నిరంతర సరఫరాలో ఇక్కట్లు లేకుండా ప్రతీ వారం ఫీడర్ల పరిధిలో మరమ్మతులు చేయాల్సి వస్తోంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, గుర్తించిన వివిధ సమస్యల వివరాలు కొత్తగా రూపొందించిన టీజీఐఏఎంఎస్ యాప్‌లో నమోదు చేశారు. కొత్త విధానం, యాప్ ద్వారా జియోగ్రాఫికల్ సమాచార వ్యవస్థతో సమస్య నెలకొన్న ప్రాంతాన్ని సులభంగా గుర్తించి సత్వర చర్యలు తీసుకునేందుకు వీలుంటుంది. ప్రతి శనివారం అత్యవసర ప్రాంతాల్లో అర గంట నుంచి గంటన్నర పాటు అధికారికంగా విద్యుత్తు కోతలు అమలు చేస్తున్నారు. నిర్వహణ పనుల కారణంగా కోతలు అమలు చేస్తున్నట్లు ఆస్మాన్‌గఢ్ సీబీడీ/ఏడీఈ ఇమ్రాన్‌ఖాన్ తెలిపారు.



ఆస్మాన్‌గఢ్‌లో విద్యుత్తు తీగలపై పడిన చెట్ల కొమ్మలు తొలగిస్తున్న సిబ్బంది

ఆస్మాన్‌గఢ్ డీఈగా విష్ణువర్ధన్‌రెడ్డి

సైదాబాద్: ఆస్మాన్‌గఢ్ విద్యుత్తు డివిజన్‌కు డీఈగా టి.విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మేడ్చల్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు డీఈగా ఉన్న హనుమంతరెడ్డి బంజారాహిల్స్‌కు బదిలీ అయ్యారు. కొత్త డీఈని 1104 ఆస్మాన్‌గఢ్ యూనియన్ కార్యదర్శి కందుకూరి రామకృష్ణానంద్ ఆధ్వర్యంలో సన్మానించారు ● ఆస్మాన్‌గఢ్ ఏడీఈ రాజేందర్‌రెడ్డి సీఎండీ కార్యాలయానికి బదిలీ కాగా, ఆయన స్థానంలో తుర్కయంజాల్ నుంచి వినోద్‌రెడ్డి వచ్చారు. ● ఆస్మాన్‌గఢ్ ఏఈ వేణుగోపాల్‌రెడ్డి కందుకూరుకు బదిలీకాగా, ఆయన స్థానంలో తుర్కయంజాల్ నుంచి శ్రీనివాస్‌రెడ్డి వచ్చారు. ● సలీమ్‌నగర్ ఏఈ ప్రీతి సరూర్‌నగర్‌కు బదిలీ కాగా, ఆమె స్థానంలో సైనిక్‌పురి నుంచి వచ్చిన ఏఈ నరేందర్ బాధ్యతలు స్వీకరించారు.

తెదేపా బలోపేతానికి కృషి

వనస్థలిపురం: తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు తమ వంతు కృషి చేస్తామని బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ తెదేపా అధ్యక్షుడు గద్దె విజయ నేత అన్నారు. మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డిని బుధవారం మీర్‌పేటలో కలిసి సత్కరించారు. తెదేపా హయాంలో జరిగిన నగరాభివృద్ధి గురించి ఈ సందర్భంగా చర్చించినట్లు తెలిపారు.

తపాలా శాఖ విశ్రాంత ఉద్యోగుల మౌన దీక్ష



అబిడ్స్ జీపీవో వద్ద నిరసనలో విశ్రాంత ఉద్యోగులు

అబిడ్స్, న్యూస్‌టుడే: తమ డిమాండ్లు నెరవేర్చాలని హైదరాబాద్ అబిడ్స్‌లోని డాక్ సదన్ జీపీవో ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి తపాలా శాఖ విశ్రాంత ఉద్యోగుల జేఏసీ బుధవారం మౌన దీక్షకు దిగింది. సుప్రీం కోర్టు నిర్ధారించిన క్యాట్ ఉత్తర్వులను యథాతథంగా అమలు చేయాలని జేఏసీ సభ్యులు డిమాండ్ చేశారు. 1980లో గంటకు రూ.2 చొప్పున వేతనంతో తమ సేవలను వినియోగించుకున్నారన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 383 మందిలో 40మంది చనిపోయారన్నారు. న్యాయబద్ధమైన హక్కుల సాధనకు మూడు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్న తపాలా శాఖ పట్టించుకోవడం లేదని వాపోయారు. అత్యున్నత న్యాయస్థానం తీర్పు ప్రకారం అన్ని రకాల రాయితీలు ఇవ్వడంతో పాటు పోస్టల్ డైరెక్టరేట్ ఆదేశాలను అమలు చేయాలని కోరారు. క్యాట్ ఆర్డర్ల ప్రకారం సర్వీస్ క్రమబద్ధీకరణ చేసి... నియామకం ప్రారంభ తేదీ నుంచి పే ఫిక్సేషన్‌లో ఉన్న అవకతవకలను వెంటనే సరిదిద్దాలి. ఐదో సీపీసీ(సెంట్రల్ పే రివిజన్ కమిషన్) ప్రకారం ఇంక్రిమెంట్లు, పెన్షనరీ బెనిఫిట్స్ వెంటనే ఇవ్వాలని కోరారు. తమ డిమాండ్లు పరిష్కరించేంత వరకు దశలవారీగా ఆందోళన చేస్తామన్నారు. జేఏసీ ఛైర్మన్ దుర్గాప్రసాద్, సభ్యులు మనోహర్, రవికృష్ణ, పి.యాదగిరి, కె.యాదగిరి, కారుణ్య, ఎలిజబెత్ క్రిస్టియన్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి 200 మంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం నేడు

చంచల్‌గూడ, న్యూస్‌టుడే: చంచల్‌గూడ చౌరస్తాలోని 'డబుల్' ఇళ్ల వద్ద గురువారం అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు సీడీపీవో పావని తెలిపారు. మూసీ నిర్వాసితుల కుటుంబాలకు చెందిన చిన్నారులకు ఇక్కడ ఏర్పాటు చేయనున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని శాసన సభ్యుడు అహ్మద్ బలాల ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

అసంపూర్తి నిర్మాణాలు.. విద్యార్థులకు అవస్థలు

నత్తనడకన ప్రభుత్వ కళాశాలల పనులు



ఫ్లోరింగ్, కిటికీలు లేని డిగ్రీ కళాశాల తరగతి గది

చంచల్‌గూడ, న్యూస్‌టుడే: చంచల్‌గూడ ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల భవన నిర్మాణాల్లో తీవ్ర జాప్యం విద్యార్థులకు శాపంగా మారుతుంది. నిధుల కొరతతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రభుత్వం నుంచి రూ.1.5 కోట్లు నిధులు విడుదల కావాల్సి ఉండటంతో పనుల్లో పురోగతి కనిపించడం లేదు. రూ.5.కోట్ల నిర్మాణ వ్యయంతో 2022 జూన్‌లో డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులు మొదలయ్యాయి. ప్రస్తుతం మొదటి అంతస్తు వరకే పనులు పూర్తయ్యాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో 10 గదులు మాత్రమే వినియోగించుకునేలా ఉన్నాయి. మొదటి అంతస్తులో కిటికీలు, ఫ్లోరింగ్ పూర్తికాలేదు. 1,300 మంది విద్యార్థులు ఉండటంతో, తప్పనిసరి పరిస్థితిలో ఒక్కో గదిలో రెండేసి తరగతులు బోధిస్తున్నారు. 2023 జులైలో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఏడాది గడిచినా నేటికీ గ్రౌండ్ ఫ్లోర్ కూడా పూర్తి కాలేదు. ఇదే ప్రాంగణంలోని చంచల్‌గూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలిక పాఠశాలలను షిఫ్టు పద్ధతిలో నిర్వహిస్తూ.. ఆ భవనాలను ఇంటర్ విద్యార్థులకు వినియోగిస్తున్నారు. నెల కిందట హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, నగర మేయర్, ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు సైతం భవనాల నిర్మాణాలను పరిశీలించారు. తాజాగా మంగళవారం హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ సైతం నిర్మాణంలోని భవనాలను పరిశీలించి, వేగం పెంచాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని గుత్తేదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



జూనియర్ కళాశాల భవనం పనులు ఇలా..

వసతులు కల్పించాలని వినతి

హయత్‌నగర్: హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని శివారు కాలనీల్లో వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి సూచించారు. పలు కాలనీలవాసులతో కలిసి బుధవారం హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ యాదయ్యతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను అధికారి దృష్టికి తీసుకెళ్లారు. శ్రీనివాసకాలనీలో తాగునీటి పైపులైన్, భూగర్భ డ్రైనేజీ సమస్య ఉందని, వీలైనంత త్వరగా పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు. సుదర్శన్‌రెడ్డి, కృష్ణ, శ్రీనివాస్, నర్సింహారెడ్డి, పారంద మహేశ్, శ్రీను పాల్గొన్నారు.

డిసెంబరులో వ్యాపారులకు క్రీడాపోటీలు

అక్బర్‌బాగ్, న్యూస్‌టుడే: శ్రీకృప మార్కెట్ హోల్‌సేల్, రిటైల్ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్‌కేఎం హైదరాబాద్ గ్లోబల్ మర్చంట్ స్పోర్ట్స్ లీగ్ సీజన్-4 పేరిట క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రమోహన్ తెలిపారు. మలక్‌పేట మార్కెట్‌లో బుధవారం స్పోర్ట్స్ లీగ్ కరపత్రం, బ్యానర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగోల్‌లోని సీఎన్‌ఆర్ క్రికెట్ మైదానంలో డిసెంబరు 1, 8, 15, 22 తేదీలు నాలుగు ఆదివారాల్లో పోటీలు ఉంటాయి. బేగం బజార్, మహారాజ్ గంజ్, సికింద్రాబాద్ వ్యాపారులు అంతా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. హైదరాబాద్ కిరాణా అసోసియేషన్ కార్యదర్శి మనీశ్ బాటి, దాల్ మర్చంట్ అసోసియేషన్ కార్యదర్శి అనిల్ కాబ్రా, శ్రీకృప మార్కెట్ అసోసియేషన్ కార్యదర్శి దీపక్ మోదీ, సలహాదారులు మహేందర్ జైన్, అశోక్‌గుప్తా పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరణలో ప్రతినిధులు

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

సైదాబాద్: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మలక్‌పేట పరిధిలో చోటుచేసుకుంది. అడ్మిన్ ఎస్సై శ్రుతిరెడ్డి కథనం ప్రకారం.. మూసారాంబాగ్ ఎస్బీఐ బ్యాంక్ పక్కన పాదబాటపై గుర్తుతెలియని వ్యక్తి (45) అపస్మారక స్థితిలో ఉన్నట్లు ఈ నెల 12న డయల్ 100కు సమాచారం వచ్చింది. సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని, అతడిని 108 అంబులెన్స్‌లో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందటంతో ఏఎస్సై రవికాంత్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫొటోగ్రఫీ శిక్షణకు పేర్లు నమోదు చేసుకోండి



గోడపత్రాన్ని ఆవిష్కరిస్తున్న హరికృష్ణ తదితరులు

బషీర్‌బాగ్: నిరుద్యోగులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, సిగ్మా అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీల ఆధ్వర్యంలో ఉచిత ఫొటోగ్రఫీ డిప్లొమా కోర్సు నిర్వహిస్తున్నామని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, అకాడమీ ఛైర్మన్ ఎంసీ శేఖర్‌లు తెలిపారు. బుధవారం కోర్సుకు సంబంధించి గోడపత్రాలను ఆవిష్కరించారు. నవంబరు 14 నుంచి శిక్షణ ప్రారంభమవుతాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 31లోపు 80080 21075, 70956 92175లో సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. నగరంలో ఆరు నెలల ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ శిక్షణ ఉంటుందన్నారు.

అడుగుకో గుంత.. ఆపై మురుగు చింత



చంపాపేట డివిజన్ మానస గార్డెన్ నుంచి రెడ్డి బస్తీ మధ్యలో రోడ్డు అధ్వానంగా మారింది. పెద్ద పెద్ద గుంతలతో పాటు మురుగు పారుతుండటంతో.. దుర్వాసన, అపరిశుభ్రతతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. – న్యూస్‌టుడే, కర్మన్‌ఘాట్

108 వాహనంలో ప్రసవం

జవహర్‌నగర్, న్యూస్‌టుడే: జవహర్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రానికి బుధవారం రెండో కాన్పుకు వెళ్లిన సోనీ (23)ని పరీక్షించిన వైద్యులు.. కడుపులో బిడ్డ ఉమ్మనీరు తాగిందని గాంధీకి వెళ్లాలని సూచించారు. 108 ఈఎంటీ సుధాకర్, పైలట్ రాజశేఖర్‌లు గర్భిణిని అంబులెన్స్‌లో తీసుకెళుతుండగా మార్గమధ్యలో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీ, కుమారుడిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. తల్లీ, కుమారుడు క్షేమంగా ఉన్నారని తెలిపారు.

స్థల ప్రహరీ ధ్వంసం కేసులో..
నిందితుల గుర్తింపు.. ఒకరి అరెస్టు

హయత్‌నగర్, న్యూస్‌టుడే: పద్మశ్రీ పురస్కార గ్రహీత కిన్నెర మొగిలయ్యకు కేటాయించిన ప్రభుత్వ భూమిలో ఆయన నిర్మించుకున్న ప్రహరీని ధ్వంసం చేసిన నిందితులను హయత్‌నగర్ పోలీసులు గుర్తించారు. బాగ్ హయత్‌నగర్ పరిధిలో 159 సర్వే నంబర్‌లో మొగిలయ్యకు ప్రభుత్వం 600 గజాల స్థలాన్ని కేటాయించింది. ఆ స్థలం చుట్టూ ఆయన ప్రహరీ నిర్మించుకోగా, ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు కూల్చి వేశారు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ఇందుకు కారణమైన వ్యక్తులను గుర్తించారు. నిందితుల్లో ఒకరైన వనస్థలిపురం వనస్థలి హిల్స్ కాలనీకి చెందిన భవనం బ్రహ్మారెడ్డి (70)ని అరెస్టు చేశారు. లక్ష్మయ్య, గోవర్దన్, శ్రీను అనే ముగ్గురు పరారీలో ఉన్నట్లు సీఐ నాగరాజు గౌడ్ తెలిపారు. నిందితుడు బ్రహ్మారెడ్డికి చెందిన ఓ వాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

మహాప్రభో.. మరమ్మతులు చేయండి!



హయత్‌నగర్ జాతీయ రహదారి నుంచి నేతాజీ కాలనీకి వెళ్లే మార్గంలో రోడ్డు మధ్యలో మ్యాన్‌హోల్ కుంగింది. ఈ మార్గంలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మరమ్మతులు చేయకుండా వదిలేయడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. –న్యూస్‌టుడే, హయత్‌నగర్

పార్కింగ్ లేక పరేషాన్!

● పరీక్ష కేంద్రాల వద్ద సమస్య
● పట్టించుకోని యంత్రాంగం

కర్మన్‌ఘాట్, న్యూస్‌టుడే: సాగర్ రోడ్డులో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్రీనిధి కాలనీ నుంచి దుర్గానగర్, బైరామల్‌గూడ, అల్తాఫ్ నగర్, కాకతీయ కాలనీ, బైరామల్‌గూడ చెరువు, సాగర్ రింగ్ రోడ్డు వరకూ దాదాపు 1.5 కిలోమీటర్ల రోడ్డు రెండు వందల అడుగులు ఉండాల్సి ఉండగా.. వంద అడుగులకు కుచించుకుపోయింది. దుర్గానగర్ ముఖ ద్వారానికి ఎదురుగా ఓ పోటీ పరీక్షల కేంద్రం ఉంది. ఇక్కడ వారానికి ఒకటి, రెండు పరీక్షలు జరుగుతుంటాయి. పరీక్ష రాయడానికి వచ్చిన అభ్యర్థులు.. తమ వాహనాలను రోడ్డుపైనే పార్క్ చేయాల్సిన పరిస్థితి. ఓ వైపు ఇరుకు రోడ్డు.. మరోవైపు అక్రమ పార్కింగ్ కారణంగా, సుమారు 1.5 కిలోమీటర్ల దూరం ప్రయాణించాలంటే గంట పడుతుంది.



సాగర్ రోడ్డులో బారులు తీరిన వాహనాలు

రద్దీ మార్గం..: ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలో ట్రాఫిక్ సమస్య నియంత్రణకు రూ.వందల కోట్ల వ్యయంతో పలు పై వంతెనలు, అండర్ పాసులు నిర్మించారు. అయినా కర్మన్‌ఘాట్ నుంచి సాగర్ రోడ్డు మార్గంలో రహదారిని వెడల్పు చేయలేదు. ఈ రోడ్డు మీదుగా సాగర్ కాంప్లెక్స్, బీఎన్‌రెడ్డి నగర్, హస్తినాపురం, ఇబ్రహీంపట్నం, యాచారం, మాల్, మల్లెపల్లి, దేవరకొండ, నాగార్జునసాగర్, మాచర్లకు ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేటు వాహనాలు నిత్యం వేలసంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. సాధారణ సమయంలోనే రద్దీ ఉంటుంది. ఇక పరీక్షల సమయంలో సాగర్ రింగ్ రోడ్డు నుంచి కర్మన్‌ఘాట్ చౌరస్తా వరకూ వాహనాలు నిలిచి పోతుంటాయి. సమస్య పరిష్కారానికి దుర్గానగర్ వద్ద ఉన్న యూటర్న్‌ను అధికారులు మూసివేసి, అడ్డుగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. వాహనదారులు కొంతమంది బారికేడ్లు తొలగించి.. రాకపోకలు సాగిస్తుండటంతో సమస్యలు తప్పడం లేదు. అత్యవసర సమయంలో అంబులెన్స్ సైతం వెళ్లే వీలు ఉండటం లేదు. రహదారిని విస్తరించి, పరీక్ష కేంద్రాల వద్ద పార్కింగ్ వసతి కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. 'పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలని పరీక్ష కేంద్రానికి నోటీసులు ఇచ్చాం. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటా'మని ఎల్బీనగర్ ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

చార్మినార్

• చార్మినార్ • కార్వాన్ • నాంపల్లి • గోషామహల్ • చాంద్రాయణగుట్ట • యాకుత్‌పుర • బహదూర్‌పుర

తపాలా శాఖ విశ్రాంత ఉద్యోగుల మౌన దీక్ష



అబిడ్స్ జీపీవో వద్ద దీక్షలో పాల్గొన్న తపాలా శాఖ విశ్రాంత ఉద్యోగులు

అబిడ్స్, న్యూస్‌టుడే: తమ డిమాండ్లు నెరవేర్చాలని హైదరాబాద్ అబిడ్స్‌లోని డాక్ సదన్ జీపీవో ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి తపాలా శాఖ విశ్రాంత ఉద్యోగుల జేఏసీ బుధవారం మౌన దీక్షకు దిగింది. సుప్రీంకోర్టు నిర్ధారించిన క్యాట్ ఉత్తర్వులను యథాతథంగా అమలు చేయాలని జేఏసీ సభ్యులు డిమాండ్ చేశారు. 1980లో గంటకు రూ.2 చొప్పున వేతనంతో తమ సేవలను వినియోగించుకున్నారన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 383 మందిలో 40మంది చనిపోయారన్నారు. న్యాయబద్ధమైన హక్కుల సాధనకు మూడు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్న తపాలా శాఖ పట్టించుకోవడం లేదని వాపోయారు. అత్యున్నత న్యాయస్థానం తీర్పు ప్రకారం అన్ని రకాల రాయితీలు ఇవ్వడంతో పాటు పోస్టల్ డైరెక్టరేట్ ఆదేశాలను అమలు చేయాలని కోరారు. క్యాట్ ఆర్డర్‌ల ప్రకారం సర్వీస్ క్రమబద్ధీకరణ చేసి... నియామకం ప్రారంభ తేదీ నుంచి పే ఫిక్సేషన్‌లో ఉన్న అవకతవకలను వెంటనే సరిదిద్దాలి. ఐదో సీపీసీ(సెంట్రల్ పే రివిజన్ కమిషన్) ప్రకారం ఇంక్రిమెంట్లు, పెన్షనరీ బెనిఫిట్స్ వెంటనే ఇవ్వాలని కోరారు. తమ డిమాండ్లు పరిష్కరించేంత వరకు దశలవారీగా ఆందోళన చేస్తామన్నారు. జేఏసీ ఛైర్మన్ దుర్గాప్రసాద్, సభ్యులు మనోహర్, రవికృష్ణ, పి.యాదగిరి, కె.యాదగిరి, కారుణ్య, ఎలిజబెత్ క్రిస్టియన్‌తో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి దాదాపు 200 మంది పాల్గొన్నారు.

దసరా సమ్మేళనం



సమ్మేళనంలో వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: ఉప్పుగూడ ధన్‌రాజ్ ఫంక్షన్ హాల్‌లో నవశక్తి వాకర్స్ అసోసియేషన్, సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో బుధవారం దసరా సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టర్ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమ్మేళనంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కార్యదర్శి ఆర్.అంజయ్య ముదిరాజ్, ప్రతినిధులు మల్లేష్, లక్ష్మీనారాయణ, తోట శ్రీనివాస్, పుల్లన్న, గోపాల్‌గౌడ్, అశోక్‌కుమార్ తదిరులు పాల్గొన్నారు.

పండగలతో ఐక్యత

బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్



మాట్లాడుతున్న రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్

చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: పండగలు, ఉత్సవాలు ప్రజల మధ్య ఐక్యత పెంపొందించడానికి దోహద పడతాయని రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్ పేర్కొన్నారు. పాతనగర మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు ఆకుల శ్రీరాములు ఆధ్వర్యంలో ఉప్పుగూడ హనుమాన్‌నగర్‌లో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన దసరా సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సేవా కార్యక్రమాలతోనే కుల సంఘాలకు గుర్తింపు లభిస్తుందన్నారు. మున్నూరుకాపుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానన్నారు. పలువురు ప్రముఖులను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ శైలజ, మున్నూరుకాపు వసతిగృహం ట్రస్టీ దడువై రాఘవేందర్, జీహెచ్‌ఎంసీ విశ్రాంత జాయింట్ కమిషనర్ రవీందర్, మహిళా మండలి ఛైర్‌పర్సన్ చంద్రకుమారి, మున్నూరుకాపు సంఘం ప్రధాన కార్యదర్శి హంసరాజ్, ఉపాధ్యక్షుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మిద్దె తోట.. ఆరోగ్య బాట

• సేంద్రియ పద్ధతిలో కూరగాయల సాగు
• ఆదర్శం ఐఎస్ సదన్‌కు చెందిన విశ్రాంత ఉద్యోగి

న్యూస్‌టుడే, ఐఎస్ సదన్

ఆరోగ్యమే మహాభాగ్యం అన్నానుడిని గట్టిగా నమ్ముతున్నారు ఐఎస్ సదన్ డివిజన్ సరస్వతీనగర్ కాలనీకి చెందిన డాక్టర్ బేతు రవిచంద్ర కుమార్. ఇంటి పైనే సేంద్రియ పద్ధతిలో చేపల సాగు, కూరగాయలు పండించి ఆరోగ్యకరమైన ఆహారాన్ని పొందొచ్చని నిరూపిస్తున్నారు. రసాయన అవశేషాలు కలిగిన కూరగాయలు తింటే అనారోగ్యానికి గురవుతున్నామని గ్రహించిన ఆయన సేంద్రియ కూరగాయలు పండించి ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందుతున్నారు. ఆయన ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌లో మేనేజర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారు. ఇంటి పైనే చేపలు, కూరగాయలను డ్రిప్, డ్రెయిన్ విధానం ద్వారా కుటుంబానికి సరిపడా పండిస్తున్నారు. టమాటా, వంకాయలు, మిర్చి, బెండ, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, చిక్కుడు, బీర, సొర కాయలు, దుంపలు, వివిధ రకాల ఆకుకూరలతో పాటు పండ్ల తోటలు సాగు చేస్తున్నారు.



ఇంటి డాబాపై ఏర్పాటు చేసుకున్న రూఫ్ గార్డెన్లో రవిచంద్ర కుమార్

నీటి వినియోగం ఇలా.. కొబ్బరి పొట్టు, వర్మీ కంపోస్ట్, ఆవు పేడ, నీమ్‌కేకల మిశ్రమాన్ని తయారుచేసి సాగులో వాడుతున్నారు. వాడి పారేసిన బకెట్లు, మినరల్ వాటర్ క్యాన్లు, ప్లాస్టిక్ డ్రమ్ములను కుండీలుగా వినియోగిస్తున్నారు. చేపలను పెంచుతూ వాడిన నీటిని మొక్కలకు మళ్లించి తిరిగి మొక్కల నుంచి నీటిని చేపలకు వినియోగిస్తున్నారు. రీసర్క్యులేటరీ విధానం ద్వారా నీరు వృథా కాకుండా చూస్తున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

- టెర్రస్‌పై నీరు నిలవకుండా చూసుకోవాలి.
- అన్ని కుండీలను ఎనిమిది గంటలు సూర్యరశ్మి తగిలేలా ఏర్పాటు చేసుకోవాలి.
- పెంచే మొక్కలను బట్టి కుండీలను ఎంచుకోవాలి
- తేమను బట్టి అవసరమైన నీరు అందించాలి. తెగుళ్లు రాకుండా పర్యవేక్షించాలి.
- నీరు వెళ్లేందుకు కలుపు మొక్కల నివారణ, కాయల కోతకు అనువుగా ఉండేలా పెంపకాన్ని చేపట్టాలి.

తక్కువ ఖర్చుతో సాగు

– డాక్టర్ బేతు రవిచంద్ర కుమార్

ఇంటి పైనే సేంద్రియ పంట చాలా తక్కువ ఖర్చుతో కూడుకున్న పని. రసాయనిక అవశేషాలు లేని కూరగాయలు, చేపలు తినొచ్చు. ఇలా పండించడం ద్వారా ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది. కంటి ముందు పండించిన పంటలతో పూర్తి ఆరోగ్యకరంగా ఉంటాం. నగరంలో 50 వేల ఎకరాల టెర్రస్ ఉంది. అందులో 40 శాతం టెర్రస్ గార్డెన్ పెడితే నగరం మొత్తానికి ఉచితంగా కూరగాయలు ఇవ్వవచ్చు. కాలుష్య రహిత నగరంగా మార్చవచ్చు. పిల్లలకు ప్రకృతిపై అవగాహన పెరుగుతుంది.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ధూల్‌పేట: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళ్‌హాట్ ఠాణా పరిధిలో బుధవారం జరిగింది. ఎస్సై షేక్ అస్లాం తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి(58) మంగళ్‌హాట్‌లోని జుంగూర్‌బస్తీలో ఓ ఇంటి వద్ద పడి ఉండగా పోలీసులకు సమాచారం అందింది. వారు అక్కడికి చేరుకొని పరిశీలించారు. అప్పటికే అతను కదలికలు లేకుండా ఉండటంతో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీలో భద్రపరిచారు.

స్కూటర్‌ను ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం

ఒకరి మృతి, మరొకరికి తీవ్రగాయాలు

నార్సింగి న్యూస్‌టుడే: వేగంగా దూసుకొచ్చిన గుర్తుతెలియని వాహనం, ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. నార్సింగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...కార్వాన్‌కు చెందిన మహేష్(39) వృత్తిరీత్యా డ్రైవర్. మంగళవారం రాత్రి స్నేహితుడు కార్వాన్‌కే చెందిన నిఖిల్(28)తో కలిసి బండ్లగూడ సన్‌సిటీ ప్రాంతంలో నివసించే స్నేహితుడి వద్దకు స్కూటర్‌పై బయలుదేరారు. బుధవారం తెల్లవారుజామున 3గం.ల సమయంలో తిరుగు ప్రయాణంలో టిప్పుఖాన్ బ్రిడ్జి వద్ద వారిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. స్కూటర్ వెనక కూర్చున్న మహేష్ తలకు తీవ్రగాయాలై చనిపోగా, నిఖిల్ ముఖం, కాళ్లకు గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రమాద స్థలంలో వీధిదీపాలు వెలగక పోవడంతో సీసీ టీవీ కెమెరాల ఫుటేజీ సరిగా కనిపించడం లేదని పోలీసులు తెలిపారు.

మహిళ అదృశ్యం



బేగంబజార్, న్యూస్‌టుడే: గృహిణి అదృశ్యమైన ఘటన అఫ్జల్‌గంజ్ ఠాణా పరిధిలో జరిగింది. ఎస్సై జగదీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం శాఖాపూర్‌కు చెందిన ఎల్ల స్వామి(40) కొంతకాలంగా ఉపాధి నిమిత్తం నగరానికి వచ్చారు. మల్కాజిగిరి భరత్‌నగర్‌లో ఉంటూ కూలీ పని చేస్తున్నారు. ఆయన సోదరి **తిరుపతమ్మ**(25) ఈ నెల 10న స్వగ్రామం నుంచి సోదరుడి వద్దకు వచ్చింది. కూలీ పని చూసుకుందామని వచ్చింది. అదే రోజు దసరా సందర్భంగా సొంతూరుకు వెళ్లేందుకు ఆయన ఎంజీబీఎస్‌లో ఆమెను కర్నూలు వెళ్లే బస్సు ఎక్కించారు. రాత్రి ఇంటికి ఫోన్ చేయగా చేరుకోలేదని చెప్పారు. వెతికినా ఆచూకీ దొరకలేదు. స్వామి అఫ్జల్‌గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టమాటా కిలో రూ.43

మెహిదీపట్నం: రైతుబజార్‌లో (బుధవారం నాటి ధరలు, కిలో రూ.లో) టమాటా 43, వంకాయ 35, బెండకాయ 45, పచ్చిమిర్చి 35, కాకరకాయ 38, బీరకాయ 45, క్యాబేజీ 25, బీన్స్ 105, క్యారట్ 53, దొండ 28, చిక్కుడుకాయ 65, గోకరకాయ 35, బీట్‌రూట్ 32, క్యాప్సికం 75, ఆలుగడ్డ 37, కీర 23, దోసకాయ 35, సొరకాయ 17, పొట్లకాయ 18, ఉల్లిగడ్డ 45, చామగడ్డ 45.

సమస్యల ప్రాంగణం







మెహిదీపట్నం ప్రయాణ ప్రాంగణంలో అసౌకర్యాలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి నుంచి వివిధ జిల్లాలకు వెళ్తుంటారు. బస్సులు నిలిపే ప్రాంతాల్లో గుంతలు పడ్డాయి. కూర్చోడానికి కుర్చీలు లేవు. ఎండావానకు నానాయాతన పడుతున్నారు. కండక్టర్లు, డ్రైవర్లు సైతం శౌచాలయాలు లేక అవస్థలు పడుతున్నారు. బస్సుల్లోనే భోజనం చేయాల్సిన పరిస్థితి.

మేమున్నాం.. మీకు తోడుగా..

చాంద్రాయణగుట్ట-8008573324, కార్వాన్-8008573341, నాంపల్లి-8008573338, గోషామహల్-8008573334, యాకుత్‌పుర-8008573307, చార్మినార్-9100581018

న్యూస్‌టుడే, మాదన్నపేట, బేగంబజార్, జియాగూడ

? మాదన్నపేట గ్యాస్ ఏజెన్సీ నుంచి ఠాణాకు వెళ్లే దారిలో వరద గుంత మూత పగిలింది. వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. – **మురళి, మాదన్నపేట**

✓ వెంటనే సిబ్బందిని పంపి మూత ఏర్పాటు చేస్తాం. – **ఏకాంబరం, ఈఈ, సంతోష్‌నగర్**

? ఎంజీబీఎస్‌లోని అలైటింగ్ పాయింట్ వద్ద శౌచాలయాల్లో నీటి కొరత తీవ్రంగా ఉంది. ప్రయాణికులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ఇబ్బందులకు గురవుతున్నారు. – **రాజేశ్వర్‌రావు, అఫ్జల్‌గంజ్**

✓ నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. – **శ్రీనివాస్, సీఆర్‌ఎం, ఎంజీబీఎస్**

? జియాగూడ, పురానాపూల్, మూసీ తీర ప్రాంతాల్లో ఆకతాయిలు, తాగుబోతులు, దారిదోపిడీ దొంగల ఆగడాలు ఎక్కువయ్యాయి. – **రాజశేఖర్, ఇక్బాల్‌గంజ్**

✓ తరచూ పెట్రోలింగ్ నిర్వహించడంతో పాటు పోలీసుల నిఘా పెంచుతాం. ఆకతాయిల ఆటకట్టిస్తాం. – **సునీల్, ఇన్‌స్పెక్టర్, కుల్సుంపుర**

? జియాగూడ డబుల్ బెడ్‌రూమ్ కాలనీలోని కొన్ని క్వార్టర్స్‌లలో లీకేజీ సమస్యలు వేధిస్తున్నాయి. – **విజయలక్ష్మి, స్థానికురాలు**

✓ సీవరేజీ లీకేజీ సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకుంటాం. – **సత్యనారాయణ, సెక్షన్ మేనేజర్, జలమండలి జియాగూడ**

సబ్జిమండీలో జిల్లా స్థాయి కుస్తీ పోటీలు



క్రీడాకారులు, నిర్వాహకులతో ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్

కార్వాన్, న్యూస్‌టుడే: క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ పేర్కొన్నారు. సబ్జిమండీలో బుధవారం జిల్లా స్థాయి కుస్తీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మల్లయోధులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. చిన్నారులు ఆటల్లో రాణించేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ స్వామియాదవ్, గంగపుత్ర సంఘం ప్రతినిధులు, విద్యాశాఖాధికారులు, నిర్వాహకులు, కోచ్‌లు పాల్గొన్నారు.

తెజసలో చేరిక



సంపత్‌కుమార్ స్వామికి కండువా కప్పుతున్న ఆచార్య కోదండరాం

అబిడ్స్: తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు చిలగాని సంపత్‌కుమార్ స్వామి బుధవారం ఎంజే మార్కెట్‌లోని తెజస కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు ప్రొ.కోదండరాం సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బైరి రమేశ్, పల్ల వినయ్ కుమార్, యువజన విభాగం అధ్యక్షుడు సలీమ్ పాషా, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు నర్సయ్య, బి.రాంచందర్, నేతలు ఏ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్య సదస్సు



విద్యార్థినులతో డాక్టర్ కరీం

నాంపల్లి: బాలికలపై జరుగుతున్న లైంగికదాడులు, అఘాయిత్యాలను ఎదుర్కొనేందుకు వారిలో మానసిక ఆత్మస్థైర్యం, నైపుణ్యాలను పెంపొందించాలని తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.ఎ.కరీం సూచించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా బుధవారం నాంపల్లిలోని సంస్థ కార్యాలయంలో వయోధికులు, విద్యార్థినులకు మానసిక ఆరోగ్య సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సమాజంలో బాలికలు, యువతులు ఎదుర్కొంటున్న అసమానతలు, అవమానలను తొలగించి వారిలో విద్య, వైద్య, పోషణ, చట్టపరమైన హక్కులు, సంరక్షణ, స్వీయరక్షణతో పాటు వారిలో ఆత్మవిశ్వాసం పెరిగేలా చూడాలని పిలుపునిచ్చారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ ఎ.రాఖేష్‌కుమార్, డాక్టర్ కృష్ణగోపాల్‌భండారి, శివ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఫొటోగ్రఫీ కోర్సుకు పేర్లు నమోదు చేసుకోండి



గోడపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మామిడి హరికృష్ణ తదితరులు

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: నిరుద్యోగులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, సిగ్మా అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీల సంయుక్తాధ్వర్యంలో ఉచిత ఫొటోగ్రఫీ డిప్లొమా కోర్సు నిర్వహిస్తున్నామని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, అకాడమీ ఛైర్మన్ ఎంసీ శేఖర్‌లు తెలిపారు. బుధవారం కోర్సుకు సంబంధించి గోడపత్రాలను ఆవిష్కరించారు. నవంబరు 14 నుంచి కోర్సు శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31లోపు చరవాణి 80080 21075, 70956 92175లో సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. నగరంలో ఆరు నెలల ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ శిక్షణ ఉంటుందన్నారు.

నీరు చిమ్మి.. నిమజ్జనం చేసి



సుల్తాన్‌బజార్, న్యూస్‌టుడే: దసరా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నవదుర్గా నవరాత్రి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో చాదర్‌ఘాట్‌లోని విక్టరీ ప్లేగ్రౌండ్ మైదానంలో ప్రతిష్ఠించిన 65 అడుగుల భారీ దుర్గామాత నిమజ్జనం మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. అంతకుముందు విగ్రహంతో ఇసామియాబజార్, టీవీ హోటల్‌లేన్, రెసిడెన్సీ క్వార్టర్స్, కోమటిబస్తీ ప్రాంతాల మీదుగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది నిమజ్జన క్రతువు పూర్తి చేశారు.

‘ప్రమాదం’ తేలింది



ఆసిఫ్‌నగర్ గాంధీ విగ్రహం రోడ్డులో అనూష మెడికల్ హాల్ వద్ద తాగునీటి పైపులైన్ వాల్వు రోడ్డులో పైకి తేలింది. ద్విచక్ర వాహనాల టైర్లు పంక్చర్ అవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, ఆసిఫ్‌నగర్

తోపుడుబండే సూచిక



పాతబస్తీ పంచ్‌మొహల్లాలో రహదారిపై నాలా కుంగిపోయి నెలలు గడుస్తోంది. అధికారులు పట్టించుకోకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పాత తోపుడు బండిని రక్షణగా ఉంచారు.

అధ్యాపకుడికి లెఫ్టినెంట్ ర్యాంకు



ఆసిఫ్‌నగర్, న్యూస్‌టుడే: మాసబ్‌ట్యాంక్‌లోని సైఫాబాద్ సైన్స్ కళాశాల భౌతికశాస్త్రం అధ్యాపకుడు డా.పల్లాటి నరేష్‌కు ఆర్మీలో లెఫ్టినెంట్ ర్యాంకు లభించింది. కళాశాలలో ఆయన ఎన్‌సీసీ అధికారిగా కొనసాగుతున్నారు. నాగ్‌పూర్‌లో జరిగిన ఎన్‌సీసీ అధికారుల శిక్షణ శిబిరానికి హాజరయ్యారు. మూడు నెలల పాటు శిక్షణ పూర్తి చేసుకుని మేజర్ జనరల్ కపిల్‌జిత్ సింగ్ ర్యాంకును ప్రకటించి, బ్యాడ్జిని అందజేశారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకుని తిరిగొచ్చిన ఆయన్ని ఎన్‌సీసీ 3వ తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ శరత్, కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ లక్ష్మణ్‌నాయక్, అధ్యాపకులు బుధవారం అభినందించారు.

గర్భిణులు ఆరోగ్యంపై దృష్టి సారించాలి

ఆసిఫ్‌నగర్: దత్తాత్రేయనగర్ సామాజిక భవనంలో ఐసీడీఎస్ ఆసిఫ్‌నగర్ సెక్టార్ ఆధ్వర్యంలో గర్భిణులు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై బుధవారం అవగాహన శిబిరం నిర్వహించారు. గోల్కొండ ప్రాజెక్టు అధికారిణి రేణుక, సూపర్‌వైజర్ సబియా, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి డా.జననీ, వైద్యశాఖ అధికారులు జాన్సీ, దీపిక తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. గర్భిణులు నిత్యం యోగా, వ్యాయామం చేయడంతో సుఖ ప్రసవం అయ్యే అవకాశం ఉందన్నారు. సీజనల్ పండ్లతో పాటు ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. నిర్ణీత సమయంలో వైద్య పరీక్షలు, వైద్యుల సలహా మేరకు మందులు వాడాలన్నారు.

అర్చకుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

సుల్తాన్‌బజార్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధితో పాటు దేవాదాయ శాఖలో పని చేస్తున్న అర్చక, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని దేవాదాయ శాఖ అర్చక, ఉద్యోగ సంఘాల ఐకాస అధ్యక్షుడు కాండూరి కృష్ణమాచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి కొండా సురేఖ గుడుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం 18న

జియాగూడ: నాంపల్లి గాంధీభవన్ ప్రాంగణంలో ఈ నెల 18న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు గాంధీభవన్ ట్రస్టు మేనేజర్ విజయభాస్కర్ బుధవారం ప్రకటనలో తెలిపారు.

ఎన్‌హెచ్‌ఎస్ ఉద్యోగుల ధర్నా



తమ సర్వీసులు క్రమబద్ధీకరించాలని కోఠిలోని డీఎంహెచ్‌ఎస్ ఆవరణలోని సీఎఫ్‌డబ్ల్యూ కార్యాలయం ఎదుట ఎన్‌హెచ్‌ఎస్ ఒప్పంద, పొరుగుసేవల ఉద్యోగులు బుధవారం ధర్నా చేశారు. – న్యూస్‌టుడే, సుల్తాన్‌బజార్

సీపీఆర్, ప్రాథమిక చికిత్సలపై అవగాహన



శిక్షణ తీసుకుంటున్న విశ్రాంత ఐఏఎస్ అధికారిణి ఉషారాణి

జూబ్లీహిల్స్: చిన్నారుల్లో సీపీఆర్, ప్రథమ చికిత్స తదితర అంశాలపై వైద్యురాలు శివరంజని అవగాహన కల్పించారు. జూబ్లీహిల్స్‌లోని తాజ్‌మహల్ హోటల్‌లో పలువురు వైద్యనిపుణులతో పాటు గృహిణులు, యువత హాజరయ్యారు. చిన్నారుల ఆహారం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. గొంతులో ఏదైనా చిక్కుకుంటే ఊపిరి ఆడకుండా తీవ్ర ఇబ్బంది పడతారన్నారు. వెంటనే ఎలాంటి చికిత్స అందించాలో వివరించారు. చిన్నవయసులోనే గుండెపోటు వస్తే సీపీఆర్ ఎలా చేయాలో చేసి చూపారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లపై లేబుల్ చూడకుండానే అసలు, నకిలీ గుర్తించకుండా కొనుగోలు చేస్తున్నామన్నారు. అవి ప్రమాదకరమన్నారు.

రాజేంద్రనగర్
• రాజేంద్రనగర్ • షాద్‌నగర్ • చేవెళ్ల



రికార్డులను పరిశీలిస్తున్న డీపీవో సురేష్‌మోహన్

పారిశుద్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యం

నందిగామ, న్యూస్‌టుడే: గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగు నీటి వ్యవస్థల నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని డీపీవో సురేష్‌మోహన్ అధికారులకు సూచించారు. మండలంలోని చేగూరు పంచాయతీని బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పారిశుద్ధ్యం, వాటర్ పైప్‌లైన్‌ల నిర్వహణ పరిశీలించారు. అనంతరం రికార్డులను చూసి... అధికారులకు పలు సూచనలు చేశారు. ఇంటి పన్నులు సకాలంలో బ్యాంకులో డిపాజిట్ చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మరోమారు ఇలా జరగకుండా చూడాలని సిబ్బందిని హెచ్చరించారు.

వైభవంగా గ్రామ దేవత విగ్రహాల పునఃప్రతిష్ఠ

నందిగామ: నందిగామలో గ్రామస్థుల సహకారంతో నూతనంగా నిర్మించిన ఐదు గ్రామ దేవతల ఆలయాల్లో విగ్రహాల పునః ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి హోమాలు, అభిషేకాలు చేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో పాటు పలు పురు నేతలు హాజరయ్యారు. గ్రామంలో పండగ వాతావరణం కనిపించింది.



పోచమ్మ ఆలయం వద్ద పూజల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు

చేవెళ్ల-ముడిమ్యాల రోడ్డు నిర్మాణానికి రూ.3.35 కోట్లు

చేవెళ్ల, న్యూస్‌టుడే: చేవెళ్ల మండల కేంద్రం నుంచి మల్కాపూర్ మీదుగా ముడిమ్యాల వరకు సుమారు 3.28 కి.మీ బీటీ రోడ్డు నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ.3.35 కోట్లు మంజూరైనట్లు చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో ఆయా గ్రామాల ప్రజలు సమస్యను తన దృష్టికి తీసుకురాగా.. సంబంధిత శాఖ మంత్రి సీతక్కకు లేఖ రాశానని, ఆమె స్పందించి నిధులు మంజూరు చేసినట్లు ఎంపీ వివరించారు. మంత్రికి ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు.

రహదారి విస్తరణ పనుల ప్రారంభం

షాద్‌నగర్, న్యూస్‌టుడే: ఫరూక్‌నగర్ మండలం ఎలికట్ట నుంచి షాబాద్ మండలం సర్దార్‌నగర్ గ్రామానికి రోడ్డు విస్తరణ పనులను బుధవారం ప్రారంభించారు. రెండు గ్రామాల మధ్యన ఉన్న ఈ నక్షాబాటను ప్రజలు ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. వాహనాలు కూడా వెళుతుంటాయి. ఈ నేపథ్యంలో విస్తరించాలని గ్రామస్థులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కోరడంతో ఆయన అనుమతి ఇప్పించారు. దీంతో పనులు ప్రారంభమయ్యాయి.

విస్తరించిన కాలనీలు.. సరిపోని కార్మికులు

• అధ్వానంగా పారిశుద్ధ్య నిర్వహణ
• రాజేంద్రనగర్ సర్కిల్‌లో దుస్థితి

న్యూస్‌టుడే, రాజేంద్రనగర్

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో పారిశుద్ధ్య సమస్య తీవ్రమవుతోంది. గడిచిన 20 సంవత్సరాల్లో పెద్దసంఖ్యలో కాలనీలు రావడం, ఉన్నవి విస్తరించడం జరిగింది. ఇందుకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెరగలేదు. దీంతో ఉన్న వారిపైనే పని భారం పడటంతో.. నిర్వహణ సక్రమంగా సాగడం లేదు. ఈ క్రమంలో వీధుల్లో చెత్తకుప్పలు పేరుకుపోతూ... మురుగు పారుతూ... వ్యాధులు విజృంభిస్తున్నాయి. సర్కిల్ పరిధిలో ఇటీవల ఒక్క నెలలో 15 డెంగీ కేసులు వెలుగు చూశాయి. ఇవి కేవలం ప్రభుత్వ ఆసుపత్రుల్లో నమోదైనవే. ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించిన వారు ఇంతకు రెట్టింపు ఉంటారని ఓ అధికారి తెలిపారు. దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని పలు బస్తీలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమల నివారణకు ఫాగింగ్, సిబ్బంది ఇంటింటికి వెళ్లి రసాయనాలు నీటి నిల్వ ప్రాంతాల్లో చల్లాల్సి ఉంది. కొంతకాలంగా ఈ రెండు పనులూ సక్రమంగా జరగడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

డివిజన్	ప్రస్తుతం ఉన్న వారు	అదనంగా అవసరమైన వారు
సులేమాన్‌నగర్	91	111
శాస్త్రీపురం	112	92
మైలార్‌దేవ్‌పల్లి	147	265
రాజేంద్రనగర్	112	124
అత్తాపూర్	140	114

కేవలం ప్రధాన మార్గాలే శుభ్రం

అవసరమైన సంఖ్యలో పారిశుద్ధ్య సిబ్బంది లేని కారణంగా సమస్య ఏర్పడుతోందని అధికారులు పేర్కొంటున్నారు. సర్కిల్‌లోని అన్ని డివిజన్లలో ఇదే పరిస్థితి ఉండటంతో ఎప్పటికప్పుడు చెత్త తొలగింపు సాధ్యం కావడం లేదు. ఇంటింటికి తిరిగి సేకరించాల్సిన స్వచ్ఛ ఆటోలు కొన్ని బస్తీల ముఖం చూడని పరిస్థితి ఉంది. దీంతో ఆయా బస్తీల్లో వ్యర్థాలను ఖాళీ ప్రదేశాల్లో వేస్తున్నారు. కార్మికుల సంఖ్య పెంచే అంశంపై సంవత్సరాలుగా చర్చ జరుగుతున్నా కార్యరూపం దాల్చడం లేదు. కేవలం ప్రధాన రహదారులపై కార్మికులు దృష్టి సారిస్తుండటంతో... బస్తీల్లో సమస్య తీవ్రం అవుతోంది. ఉన్నతాధికారులు అప్పుడప్పుడు పర్యటనలకు వస్తున్నా వారంతా ప్రధాన రహదారులను మాత్రమే పరిశీలిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.



కాలేదాన్‌లో పేరుకుపోయిన చెత్త

గతం కంటే నిర్వహణ మెరుగైంది: రవికుమార్, ఉపకమిషనర్

సర్కిల్‌లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. గతంకంటే నిర్వహణ చాలా మెరుగైంది. ఏవైనా కాలనీలు, బస్తీలకు చెత్తసేకరించే ఆటోలు రాకపోతే స్థానికులు ఫిర్యాదు చేయండి. వెంటనే చర్యలు తీసుకుంటాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

రాజేంద్రనగర్: 8008573330
శంకర్‌పల్లి : 8008573266
షాద్‌నగర్: 8008573907
శంషాబాద్: 9963096353

న్యూస్‌టుడే, పహడీ షరీఫ్, నందిగామ, నార్సింగి

? మైలార్‌దేవుపల్లి మీదుగా జల్‌పల్లి కార్గోరోడ్డుపై తెల్లవారుజామున వాకింగ్‌కు వెళ్లేందుకు వీధి దీపాలు లేక అవస్థలు పడుతున్నాం. మరోవైపు రాత్రివేళ జల్‌పల్లి, శంషాబాద్ వెళ్లాలంటే చీకట్లో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. – యాదగిరి, ఎ.రాజు, వినయ్


✓ రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులతో మాట్లాడి లక్ష్మీగూడ, వాంబేకాలనీ వరకు వీధి దీపాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. – ప్రకాష్‌గౌడ్, రాజేంద్రనగర ఎమ్మెల్యే

? నందిగామ పరిధిలో పాత జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన భారత్, హెచ్‌పీ పెట్రోల్ పంపుల్లో గాలి నింపే పరికరాలు పనిచేయడం లేదు. సిబ్బందిని అడిగితే దురుసుగా సమాధానం ఇస్తున్నారు. నిబంధన ప్రకారం వినియోగదారులకు కల్పించాల్సిన వసతులు గురించి అధికారులు పట్టించుకోవాలి. – రాజు, అయ్యప్ప టెంపుల్

✓ సిబ్బందిని పంపించి సౌకర్యాలు కల్పించని పెట్రోల్ పంపుల వివరాలు సేకరిస్తాం. యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటాం. – రాజేశ్వర్, తహసీల్దారు నందిగామ

? నార్సింగి పట్టణంలోని వెస్టెండ్ మిడోస్ లేఅవుట్‌లో దాదాపు 300 కుటుంబాలు ఉంటున్నాయి. వీధిదీపాలు వెలగక రాత్రివేళ రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. – శ్రీధర్, వెస్టెండ్ మిడోస్, నార్సింగి.

✓ మరమ్మతులు చేయిస్తాం.–శ్రీనివాస్, మున్సిపాలిటీ ఏఈ



పడితే ప్రాణాలకే ప్రమాదం

కాటేదాన్-గగన్‌పహాడ్ అండర్‌పాస్ వద్ద ఒరిగిన విద్యుత్ స్తంభమిది. వాహనం ఢీకొని మూడు నెలలవుతున్నా సరిచేయడం లేదు. పారిశ్రామికవాడ సమీపంలో ఉండటంతో వాహనాలతో రహదారి రద్దీ ఉంటుంది. ప్రమాదం జరగకముందే స్తంభాన్ని సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

తెరుచుకోని తలుపులు.. అందని సేవలు



పాపిరెడ్డిగూడలో మూతపడిన పశువైద్య కేంద్రం

పాపిరెడ్డిగూడలోని పశువైద్య కేంద్రం మూతపడి నాలుగేళ్లు కావస్తోంది. సిబ్బంది కొరతతో మూసివేశారు. ఈ గ్రామంతో పాటు చుట్టుపక్కల మరో మూడు నాలుగు పల్లెల్లోని మూగజీవులకు సేవలు అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయానికి అనుబంధంగా పాడిని నమ్ముకున్న వారికి అవస్థలు తప్పడం లేదు. పశువులు అస్వస్థత బారిన పడితే గత్యంతరం లేక ప్రైవేటు వారితో వైద్యం చేయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిబ్బందిని నియమించి పశు వైద్యశాలను తెరవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కేశంపేట



ప్రైవేటు వాహనాల ఆరాంఘర్

ఆరాంఘర్ కూడలిలో సిగ్నల్ వద్ద ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా నిలిపిన ప్రైవేటు వాహనాలు ఇవి. మహబుబ్‌నగర్, రాయలసీమ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల కోసం వీటిని ఇలా నిలిచి ఉంచారు.

దిగుబడి రాక నష్టపోయిన రైతులు
పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు



మొక్కజొన్న పొలంలో శాస్త్రవేత్తలు, అధికారులు

కేశంపేట, న్యూస్‌టుడే: అల్వాల గ్రామ శివారులో మొక్కజొన్న పంటను బుధవారం రాజేంద్రనగర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డా. నగేష్, డా.మల్లయ్య పరిశీలించారు. ఈ సీజన్‌లో గ్రామ రైతులు కొందరు సింజెంట విత్తన కంపెనీకి చెందిన 6802 రకం మొక్కజొన్న విత్తనాలు కొనుగోలు చేసి పంట సాగు చేశారు. చివరి దశలో చేనులో ఒక్కో కర్రకు ఒక బుట్టకు బదులుగా నాలుగు నుంచి ఐదు రావడం జరిగింది. వాటికి గింజలు సరిగా లేకపోవడంతో పాటు ఉన్నవాటిలో తాలు శాతం అధికంగా ఉన్నాయి. ఈ కారణంగా 40 శాతం మేరకు పంట నష్టపోవాల్సి వచ్చింది. ఈ విషయమై రైతులు ఇటీవల వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి సమస్యను తెలిపారు. ఈ నేపథ్యంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ షాద్‌నగర్ సహాయ సంచాలకులు రాజారత్నం, మండల ఏవో శిరీష, ఏఈవో వినయ్‌తో కలిసి పంటను పరిశీలించారు. సాగు విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎంపీటీసీ సురేశ్‌రెడ్డి, రైతులు పరిస్థితిని శాస్త్రవేత్తలకు వివరించి విత్తన లోపమే కారణమని ఆరోపించారు. నష్టపరిహారం ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

లంచం తీసుకున్నాడని ఉద్యోగిపై రైతు ఫిర్యాదు

షాద్‌నగర్, న్యూస్‌టుడే: పట్టాదారు పాస్‌బుక్‌లో తప్పుల సవరణకు డబ్బు తీసుకున్నాడంటూ ఉద్యోగిపై తహసీల్దార్‌కు ఫిర్యాదు అందింది. ఫరూక్‌నగర్ మండలం బూర్గుల గ్రామానికి చెందిన రైతు కావలి అంజయ్యకు సర్వే నంబరు 575లో 2.17 ఎకరాల భూమి ఉంది. పాస్‌బుక్‌లో ఈ వివరాలు తప్పుగా నమోదయ్యాయి. సరిచేస్తానని చెప్పి ఆరు నెలల క్రితం రెవెన్యూ కార్యాలయ ఉద్యోగి ఒకరు తన వద్ద రూ.6.42 లక్షలు తీసుకున్నాడని రైతు ఆరోపణ. బాధితుడు బుధవారం తహసీల్దార్ పార్థసారధికి లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. విచారణ జరుపుతున్నామని తహసీల్దార్ పేర్కొన్నారు.

చెత్త సక్రమ నిర్వహణతో పర్యావరణ పరిరక్షణ

మణికొండ, న్యూస్‌టుడే: తడిపొడి చెత్తను వేరు చేయడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడవచ్చని మణికొండ మున్సిపల్ వైస్ ఛైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం వట్టినాగులపల్లిలోని డంపింగ్ యార్డ్‌ను ఆయన సందర్శించారు. ఇక్కడ సేంద్రియ ఎరువుగా తయారీకి సిద్ధం చేస్తున్న కేంద్రాన్ని పరిశీలించారు. త్వరగా అందుబాటులోకి తేవడానికి అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఇళ్ల వద్దనే ప్రజలు చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి ఇవ్వాలని ప్రజలను కోరారు. కమిషనర్ ప్రదీప్‌కుమార్, సంపత్, రవికాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో ఉద్యోగుల బదిలీలు
చేవెళ్ల ఏడీఈగా రాజేష్‌బాబు

చేవెళ్ల, న్యూస్‌టుడే: చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో పలువురు విద్యుత్తు సిబ్బంది బదిలీఅయ్యారు. చేవెళ్ల ఏడీఈ స్వామి బదిలీ కాగా కొత్తగా రాజేష్‌బాబు, ఏఈ జానీ మొయినుద్దీన్ స్థానంలో రాజేందర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

షాబాద్: షాబాద్ ట్రాన్స్‌కో ఏఈగా పనిచేస్తున్న నరేందర్ బదిలీపై అబ్దుల్లాపూర్‌మెట్‌కు వెళ్లగా ఆ స్థానంలో బంజారాహిల్స్ ఏఈ కోటేశ్వరరావు ఇక్కడికి వచ్చారు.

కొత్తూరు, న్యూస్‌టుడే: కొత్తూరు మండల విద్యుత్తు శాఖ ఏఈగా రమేష్ గౌడ్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. కందుకూరు నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన సాయికృష్ణ షాద్‌నగర్ డివిజనల్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

నత్తనడకన కాలిబాట నిర్మాణం
ఆక్రమణల తొలగింపులో అధికారుల కాలయాపన

బండ్లగూడజాగీర్: గండిపేట మండలం బండ్లగూడజాగీర్ కార్పొరేషన్ హైదర్షాకోట్ పరిధిలోని ఎర్రకుంట ఆధునికీకరణకు కొందరు ఆటంకం కల్పిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కుంట అభివృద్ధితో పాటు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి ఏడాది క్రితం రూ.95 లక్షలు మంజూరయ్యాయి. పూడికను తొలగించి, చుట్టూ కాలిబాట నిర్మాణం చేపట్టారు. విజయగణపతి దేవాలయం పక్కన అడ్డుగా ఉన్న వ్యాపారుల డబ్బాలు తొలగించడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. దీంతో పనులు ముందుకు సాగడం లేదు. సమస్యను స్థానిక కాలనీవాసులు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ను కలిసి విన్నవించారు. ఆయన కమిషనర్ శరత్‌చంద్రతో మాట్లాడి వెంటనే డబ్బాలను తొలగించాలని ఆదేశించారు. ఇది జరిగి రెండు మాసాలవుతున్నా.. ఎలాంటి పురోగతి లేదు. ఈ విషయంలో స్థానికంగా ఉండే అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు అడ్డు తగులుతున్నట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులైనా స్పందించి ఎర్రకుంట అభివృద్ధిని త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఎర్రకుంట వద్ద వాకింగ్‌ట్రాక్ ఏర్పాటుకు అడ్డుగా డబ్బాలు

'మల్టీపర్పస్' విధానం రద్దుకు డిమాండ్



ఎంపీవో లాలయ్యకు వినతిపత్రం ఇస్తున్న కార్మిక నాయకులు

కొందుర్గు, న్యూస్‌టుడే: మల్టీపర్పస్ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని కోరుతూ బుధవారం పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టంగుటూరి నర్సింహారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య కొందుర్గు ఎంపీవో లాలయ్యకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులకు వారాంతపు సెలవులు ఇవ్వాలని. పీఎఫ్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రమాదవశాత్తు మృతిచెందిన వారికి రూ.పది లక్షలు పరిహారం అందించాలని, పారిశుద్ధ్య కార్మికులకు చేతిగ్లౌజ్‌లు, సబ్బులు, నూనెలు, బూట్లు అందజేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం పొంగి పొర్లుతోంది!

పురపాలక కేంద్రంలోని 7వ వార్డులో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. చిరు వ్యాపారులు కూరగాయలు అమ్మేచోట మురుగు పారుతోంది. అదే ప్రాంతంలో మరోచోట మ్యాన్‌హోల్ నుంచి మురుగు పొంగుతున్నా సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంపు భరించలేక కాలనీవాసులు, స్థలం లేక చిరు వ్యాపారులు అవస్థలు పడుతున్నారు. –న్యూస్‌టుడే, కొత్తూరు





మహిళలపై అకృత్యాలకు అందరూ బాధ్యులే
మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు

షాద్‌నగర్ న్యూటౌన్: సమాజంలో మహిళలపై అఘాయిత్యాలకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాల్సిందేనని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నారు. షాద్‌నగర్‌లోని పలు విద్యాసంస్థలను బుధవారం ఆయన సందర్శించి అధ్యాపకులతో సమావేశమై.. మహిళలు, బాలికలపై అకృత్యాలకు కారణాలపై అభిప్రాయాలు సేకరించారు. అనంతరం మాట్లాడుతూ... కుటుంబం, సమాజంపై అవగాహన రాహిత్యం, మానవ సంబంధాలపై నిర్లక్ష్యం, పిల్లల ప్రవర్తన, నడవడికపై తల్లిదండ్రులు అశ్రద్ధ, సెల్‌ఫోన్ విచ్చలవిడి వినియోగం ప్రస్తుత పరిస్థితికి కారణాలన్నారు. విద్యార్థులను, యువతను క్రమశిక్షణలో ఉంచడంలో తల్లిదండ్రులు, గురువులు, సమాజం కీలకపాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నార్సింగి న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని జీవితంలో స్థిరపడిన వారు తమ పిల్లలనూ సర్కారు బడుల్లోనే చదివించడానికి ప్రయత్నించాలని పలువురు విశ్రాంత ఉపాధ్యాయులు తమ శిష్యులకు సూచించారు. నార్సింగి జడ్పీ ఉన్నత పాఠశాలలో 2001-02 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు బుధవారం స్థానిక ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో సమావేశమయ్యారు. పరస్పరం యోగక్షేమాలు తెలుసుకుంటూ సరదాగా గడిపారు. తమ సహచరులు ఆరుగురు చనిపోయారని తెలుసుకుని వారి కుటుంబాలకు అండగా నిలవాలని నిర్ణయించారు. తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.



నార్సింగి జడ్పీ హైస్కూలు 2001-02 బ్యాచ్ విద్యార్థులతో విశ్రాంత, ప్రస్తుత ఉపాధ్యాయులు

అంగన్వాడీ టీచర్‌కు ఆత్మీయ వీడ్కోలు

కొందుర్గు, న్యూస్‌టుడే: చిన్నారులకు 33 ఏళ్ల పాటు అక్షర జ్ఞానాన్ని అందించిన అంగన్వాడీ టీచర్ శారద సేవలు మరువజాలమని గ్రామస్థులు అన్నారు. బుధవారం ముట్పూరు అంగన్వాడీ టీచర్ శారదమ్మ పదవీ విరమణ సందర్భంగా ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. పలువురు శాలువాలతో సన్మానించారు. ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం రాజ్‌కుమార్, మాజీ సర్పంచి నర్సింహారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎవరికీ చందాలు ఇవ్వకండి: విజయగణపతి ఆలయ కమిటీ

బండ్లగూడజాగీర్, న్యూస్‌టుడే: అన్నదానం పేరిట చందాల వసూళ్లకు వస్తున్న వారిని నమ్మవద్దని విజయగణపతి దేవాలయం కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కొంతమంది దేవాలయంలో అన్నదానం నిర్వహిస్తున్నట్లు కాలనీల్లో చందాల వసూళ్లకు పాల్పడుతున్నారని తెలిపారు. బుధవారం ఇద్దరు రఘురాంనగర్, పద్మశ్రీహిల్స్, రాధానగర్, నర్సారెడ్డి, పీఅండ్‌టీ, భాగ్యనగర్, శాంతినగర్ కాలనీల్లో చందాల కోసం రాగా స్థానికులు పట్టుకొని నిలదీయడంతో పొంతనలేని సమాధానాలు చెప్పారు.

నాగర్‌కర్నూల్‌లో మాలల ఆత్మగౌరవ సభ 27న

షాద్‌నగర్ న్యూటౌన్, న్యూస్‌టుడే: మాలల అణిచివేతకు పాల్పడుతున్న ప్రభుత్వాలకు బుద్ధి చెప్పడానికి ఈనెల 27న నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నట్లు మాలమహానాడు రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మహేష్ తెలిపారు. షాద్‌నగర్‌లోని ప్రభుత్వ అతిథిగృహం ఆవరణలో బుధవారం జరిగిన కార్యక్రమంలో సంబంధిత గోడపత్రికలను సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు.

అంకితభావంతో విధులు నిర్వహించండి: ఎంఈవో

కేశంపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా అంకితభావంతో విధులు నిర్వహించాలని ఎంఈవో చంద్రశేఖర్ సూచించారు. బుధవారం విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులతో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యతతో కూడిన చదువు అందించాలన్నారు.

స్కూటర్‌ను ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం
ఒకరి మృతి, మరొకరికి తీవ్రగాయాలు

నార్సింగి, న్యూస్‌టుడే: అతివేగంగా దూసుకొచ్చిన గుర్తుతెలియని వాహనం, ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. నార్సింగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...కార్వాన్‌కు చెందిన మహేష్ (39) వృత్తిరీత్యా డ్రైవర్. మంగళవారం రాత్రి స్నేహితుడు కార్వాన్‌కే చెందిన నిఖిల్(28)తో కలిసి బండ్లగూడ సన్‌సిటీ ప్రాంతంలో నివసించే స్నేహితుడి వద్దకు స్కూటర్‌పై బయలుదేరారు. బుధవారం తెల్లవారుజామున 3గం.ల సమయంలో తిరుగు ప్రయాణంలో టిప్పుఖాన్ బ్రిడ్జి వద్ద వారిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. స్కూటర్ వెనక కూర్చున్న మహేష్ తలకు తీవ్ర గాయాలై చనిపోగా, నిఖిల్ ముఖం, కాళ్లకు గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రమాద స్థలంలో వీధిదీపాలు వెలగక పోవడంతో సీసీ టీవీ కెమెరాల పుటేజీ సరిగా కనిపించడం లేదని పోలీసులు తెలిపారు.

చెరువులో పడి పారిశుద్ధ్య కార్మికుడి మృతి



యాదయ్య

షాబాద్, న్యూస్‌టుడే: చేపలు పట్టేందుకు వెళ్లి చెరువులో పడి పారిశుద్ధ్య కార్మికుడు మృతి చెందిన ఘటన బుధవారం షాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కేశవగూడకు చెందిన తోటమీది యాదయ్య(35) మంగళవారం చేపలు పట్టేందుకు చెరువు వద్దకు వెళ్లాడు. రాత్రయినా ఇంటికి రాలేదు. బుధవారం ఉదయం అదే గ్రామానికి చెందిన భవాని భౌవయ్య చెరువులో శవం తేలడాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని యాదయ్యదిగా గుర్తించారు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రమాదవశాత్తు నీటిలో పడి చనిపోయినట్లు అనుమానిస్తున్నారు.

శంషాబాద్‌లో ద్విచక్ర వాహనం చోరీ

శంషాబాద్: శంషాబాద్‌లో ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. ఆర్జీఐఏ పోలీసుల కథనం ప్రకారం.. పాత శంషాబాద్‌కు చెందిన తరుణ్ ఎలక్ట్రీషియన్. ఈ నెల 10న తన వాహనాన్ని మధురానగర్ కాలనీలో నిలిపి పనులు ముగించుకుని వచ్చేసరికి కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదుతో బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్త అదృశ్యంపై కేసు నమోదు

కేశంపేట: భర్త అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం సూరారం గ్రామానికి చెందిన గడ్డల శ్రీలక్ష్మి, యాదగిరి దంపతులు హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో ఉంటూ కూలీ పనులతో జీవనం సాగిస్తున్నారు. ఇద్దరు కలిసి దసరాకు ఈనెల 12న కేశంపేట మండలం దత్తాయపల్లిలో ఉన్న బంధువుల వద్దకు వచ్చారు. మర్నాడు యాదగిరి(37) హైదరాబాద్ వెళుతున్నానని బయలు దేరాడు. తర్వాత వెళ్లిన భార్యకు ఆయన కనిపించలేదు. చుట్టుపక్కల వారిని సంప్రదించినా ప్రయోజనం లేక.. బుధవారం భార్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

శంషాబాద్‌లో బాలిక అదృశ్యం

శంషాబాద్, న్యూస్‌టుడే: శంషాబాద్‌లో ఓ బాలిక అదృశ్యమైంది. ఆర్జీఐఏ పోలీసుల కథనం ప్రకారం.. బాలిక(16) పదవ తరగతి వరకు చదువుకుంది. కొంత కాలంగా ఇంటి వద్ద ఉంటోంది. ఈ నెల 14న తల్లిదండ్రులు పనులకు వెళ్లొచ్చేసరికి కనిపించ లేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుబ్బచర్లలో అదృశ్యం.. అబ్దుల్లాపూర్‌మెట్‌లో ప్రత్యక్షం

మహేశ్వరం: చరవాణి మాట్లాడొద్దని మందలించినందుకు దుబ్బచర్ల ఇంట్లో నుంచి వెళ్లిపోయిన బాలుడు(14) అబ్దుల్లాపూర్‌మెట్‌లో బుధవారం ఉదయం ప్రత్యక్షమయ్యాడు. సీఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. బాలుడు దుబ్బచర్ల నుంచి కొళ్లపడకల్ రైస్ మిల్లు నడుచుకుంటూ వెళ్లి అక్కడి నుంచి ద్విచక్రవాహనం లిఫ్ట్ అడిగి మహేశ్వరం పల్లి వద్ద దిగాడు. అక్కడ నుంచి బీఎన్‌రెడ్డినగర్ వద్ద దిగాడు. అక్కడ ఓ మహిళ చేరదీసి ఎక్కడికి వెళ్లాలని అడిగితే అబ్దుల్లాపూర్‌మెట్ చర్చికి చెప్పడంతో రాత్రి తనవద్దే పడుకోబెట్టుకుని ఉదయం క్యాబ్ బుక్ చేయడంతో అబ్దుల్లాపూర్‌మెట్‌కు చేరుకుని చర్చిలోకి వెళ్లాడు. అక్కడ ఫాదర్ ఎవరు నీవు అని అడిగితే వారి చిన్నమ్మ, చిన్నాన్నల ఫోన్ నంబర్లు ఇచ్చాడు. ఫాదర్ వారితో పాటు మహేశ్వరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. మహేశ్వరం పోలీసులు వెళ్లి తీసుకువచ్చి బాలుడిని చిన్నమ్మ, చిన్నాన్నలకు అప్పగించారు.

మహేశ్వరం

•మహేశ్వరం • ఇబ్రహీంపట్నం • కల్వకుర్తి

వ్యాధులపై సరైన అవగాహన ముఖ్యం

మహేశ్వరం: హెచ్ఐవీ, ఎయిడ్స్, సుఖ వ్యాధులు, క్షయ వ్యాధిపై ఇంటర్ విద్యార్థులు, లింక్ వర్కర్స్‌కు తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ జి.రాంరెడ్డి అవగాహన కల్పించారు. ఎయిడ్స్ అనేది తెలియని వ్యక్తులతో లైంగిక సంబంధాల వల్ల ఎక్కువగా వస్తుందన్నారు. సిరంజులు, నీడిల్స్ ఒకరికి వాడినవి ఇంకొకరు వాడితే వచ్చే ఆస్కారం ఉందన్నారు. ప్రతి ప్రభుత్వ ఆసుపత్రుల్లో హెచ్ఐవీ పరీక్షలు ఉచితంగా చేస్తారని చెప్పారు. క్షయవ్యాధి అంటువ్యాధి అని, వరుసగా పదిహేనురోజులు పాటు దగ్గు వస్తున్నా, జ్వరం వస్తున్నా వెంటనే ప్రభుత్వాసుపత్రిలో పరీక్ష చేయించుకోవచ్చన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలలు మందులు ఉచితంగా ఇస్తారన్నారు. ప్రతి ఒక్కరూ వీటిపై అవగాహన పెంచుకుని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రిన్సిపల్ జంగయ్య, ఫీల్డ్ లింక్ వర్కర్ సబిత పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు

బాలాపూర్, న్యూస్‌టుడే: నిర్మానుష్య ప్రాంతాల్లో చెత్తను వేయొద్దని, అలా వేసిన వారికి జరిమానా విధిస్తామని బడంగ్‌పేట శానిటరీ ఇన్‌స్పెక్టర్ వి.యాదగిరి హెచ్చరించారు. మేయర్ పారిజాత, కమిషనర్ రాములు ఆదేశాల మేరకు బుధవారం సిబ్బందితో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించి బహిరంగ ప్రదేశాల్లో చెత్తవేసే వారిని గుర్తించి రూ.5 వేల వరకు జరిమానా విధించారు. స్వచ్ఛ ఆటోల్లోనే చెత్తను వేయాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు.

విధుల్లో చేరిన 58 మంది గురువులు

తలకొండపల్లి: తలకొండపల్లి మండలంలోని వివిధ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్లో 58 మంది బుధవారం విధుల్లో చేరినట్లు ఎంఈవో కె.చంద్రా తెలిపారు. 41 ఎస్జీటీ ఉపాధ్యాయులు ప్రాథమిక, 17 మంది ఉన్నత పాఠశాలల్లో చేరారు. విధుల్లో చేరిన వారిలో అందరూ కొత్తవారే ఉండటం విశేషం.

అంధ ఉపాధ్యాయుడికి సత్కారం

తలకొండపల్లి, న్యూస్‌టుడే: తలకొండపల్లి మండలం పడకల్ గ్రామానికి చెందిన కంటి చూపు లేని బబ్బు రాఘవేందర్ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించడంతో బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో సన్మానించారు. కంటి చూపు లేకపోయినా బ్రెయిన్ లిపితో చదివి పోటీ పరీక్షలో ఉద్యోగం సాధించి యువకులకు ఆదర్శంగా నిలిచాడని నాయకులు దుబ్బ చెన్నయ్య, జె. పెంటయ్య కొనియాడారు. రాఘవేందర్‌తో పాటు అతడి తల్లిదండ్రులు పర్వతాలు, యాదమ్మను నాయకులు సన్మానించారు.

చారిత్రక తటాకం.. దుర్గంధం భరించలేం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే

ఒకప్పుడు స్వచ్ఛమైన నీటితో పంటలకు సాగునీరు అందించిన ఇబ్రహీంపట్నం చిన్న చెరువు నేడు కలుషితం, మురుగునీటితో నిండిపోయింది. చెరువు పై భాగంలో కొత్తగా కాలనీలు ఏర్పడడంతో మురుగు నిరంతరం చెరువులోకి చేరుతుంది. దీనికి తోడు రోడ్డు వెంట వెళ్లే ప్రజలు, వాహనదారులు చెరువులో వ్యర్థాలు వేస్తుండడంతో భరించలేని దుర్గంధం వెలువడుతోంది. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ అధికారులు, పాలకవర్గం ఏ మాత్రం దీన్ని పట్టించుకోకపోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు, చిన్న చెరువులను 1550లో అప్పటి నిజాం చుట్టుపక్కల గ్రామాలకు తాగు, సాగునీరు అందించడానికి 1452 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. రెండు చెరువులకు కలిపి 15 వందల ఎకరాల ఆయకట్టు ఉంది. 300 కుటుంబాల వరకు గంగపుత్రులు, ముదిరాజ్ కులస్థులు ఈ చెరువుల్లో చేపలపై ఆధారపడేవారు. చిన్న చెరువు ఇబ్రహీంపట్నం టౌన్‌కు ఆనుకుని ఉండడంతో చూడటానికి సుందరంగా కనిపిస్తున్నా.. అక్కడికి వెళితే మాత్రం దుర్గంధం భరించలేని పరిస్థితి ఏర్పడింది.



కాలనీల నుంచి పెద్ద ఎత్తున చిన్న చెరువులోకి చేరుతున్న మురుగు

నాటి ఉద్యానం.. నేడు నిరుపయోగం

చిన్న చెరువులో పై భాగంలో టౌన్‌కు అనుసంధించి మూడేళ్ల కిందట ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ అధికారులు రూ.40 లక్షల వరకు ఖర్చుచేసి వాకింగ్ ట్రాక్, వాటర్ ఫౌంటెయిన్, పచ్చని గడ్డి, పూల మొక్కలను నాటి సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం మూడేళ్ల కిందట భారీ వర్షాలు రావడంతో 50 ఏళ్ల అనంతరం పెద్ద చెరువు, చిన్న చెరువు పూర్తిస్థాయిలో నిండటంతో చిన్న చెరువులో అభివృద్ధి చెసిన పార్కు, స్థలం 75 శాతం నీటిలో మునిగిపోయింది. ప్రస్తుతం ఏడాదికి పైగా చిన్న చెరువులో నీళ్లు పూర్తిగా తగ్గిపోయి అభివృద్ధి చెసిన పార్కు స్థలంలో నీళ్లు లేవు. ఈ ఏడాది వర్షాలు పెద్దగా కురవలేదు. మళ్లీ ఇప్పట్లో చెరువు నిండే పరిస్థితి లేదు. మున్సిపాలిటీ అధికారులు, పాలకవర్గం పట్టించుకుని ముందుగా చెరువులోకి మురుగునీరు వెళ్లకుండా కాలువల నిర్మించాల్సిన అవసరం ఉంది. చిన్న చెరువుపై పెన్సింగ్ ఏర్పాటు చేసి తిరిగి ఉద్యానంగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.



పార్కులో ఏర్పాటు చేసిన ఫౌంటెయిన్ నేడు ఇలా..



ఉద్యాన స్థలంలో పెరిగిన పిచ్చిమొక్కలు

మేమున్నాం.. మీకు తోడుగా..

మహేశ్వరం 80085 73290
ఇబ్రహీంపట్నం 80085 73295
ఆమన్‌గల్, కడ్తాల్ 98481 98888
ఉ.10 నుంచి మధ్యాహ్నం 1 గంట మధ్య మాత్రమే

ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల, పెద్దఅంబర్‌పేట్ పురపాలిక, న్యూస్‌టుడే:

? ఇబ్రహీంపట్నం మల్లికార్జున రైస్ మిల్లు సమీపంలోని సిరి బాలుర వసతి గృహం సమీపంలో వీధి దీపాలు వెలగటం లేదు. రాత్రివేళ కాలనీ ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.
– చంద్రకాంత్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం

✔ వీధి దీపాలు వేయిస్తాం.
– రవీంద్రసాగర్, కమిషనర్, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ

? శేరిగూడ నుంచి ఇబ్రహీంపట్నం చెరువు కట్ట కింది రోడ్డుకు ఇరువైపులా చెట్ల కొమ్మలు ప్రమాదకరంగా మారడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.
– చంద్రశేఖర్, సీతారాంపేట

✔ ప్రమాదకర చెట్ల కొమ్మలు తొలగించడానికి ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే అటవీశాఖ అధికారులు చెట్ల కొమ్మలు తొలగించడానికి వీలు లేదని అడ్డుకుంటున్నారు.
– రవీంద్రసాగర్, కమిషనర్, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ

? ఆదిభట్ల పురపాలిక పరిధిలోని మంగళపల్లి పటేల్‌గూడ నుంచి సాహెబ్‌గూడ వెళ్లేదారిలో రోడ్డు పక్కనే చెత్త పారవేస్తున్నారు. సమస్యను పరిష్కరించండి.
– నాని, పటేల్‌గూడ

✔ సమస్యను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.
– బాలకృష్ణ, కమిషనర్, ఆదిభట్ల పురపాలిక

? పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పసుమాముల గ్రామంలోని రామాలయం మందిరానికి వెళ్లేదారిలో సర్వేనంబర్లు 253, 260లో సుమారు రెండు వేల గజాల పార్కు స్థలాన్ని కొందరు వ్యక్తులు చదునుచేసి కబ్జా చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పార్కు స్థలాన్ని కాపాడాలి.
– పసుమాముల గ్రామస్థులు

✔ టౌన్ ప్లానింగ్ అధికారి, సిబ్బందిని పంపి పరిశీలిస్తాం. పార్కు స్థలంగా తేలితే వెంటనే చర్యలు తీసుకుంటాం.
– రవీందర్‌రెడ్డి, కమిషనర్, పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ

గీత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తా

ఇబ్రహీంపట్నం,న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని గీత కార్మికుల సంక్షేమానికి అన్ని విధాలుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నంలో వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని నాలుగు వందల మంది గీత కార్మికులకు ప్రభుత్వం నుంచి అందిస్తున్న కాటమయ్య రక్షణ కవచం కిట్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గీత కార్మికులను ప్రమాదాల నుంచి రక్షించడానికి రక్షణ కవచం కిట్లు అందజేయడం జరిగిందన్నారు. పలువురు గీత కార్మికులు, గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో తాటి, ఈత వనాలను పెంచడానికి అయిదు ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించాలని, స్థిరాస్తి వ్యాపారులు తాటి చెట్లను నరికి వేయకుండా చర్యలు తీసుకోవాలని, 50 ఏళ్లు నిండిన గీత కార్మికులకు పింఛన్లు ఇవ్వాలని కోరారు. మున్సిపాలిటీ ఛైర్మన్ స్రవంతి, మాజీ జడ్పీటీసీ సభ్యులు లక్ష్మీపతిగౌడ్, దాసుగౌడ్, కృష్ణగౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్, ధన్‌రాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కాటమయ్య రక్షణ కవచం కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఛైర్మన్ స్రవంతి, లక్ష్మీపతిగౌడ్ తదితరులు

రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ప్రమాణ స్వీకారం

బాలాపూర్, న్యూస్‌టుడే: రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. బడంగ్‌పేటలోని గ్రంథాలయ కార్యాలయంలో బుధవారం స్పీకర్ గడ్డం ప్రసాద్, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, బుయ్యని మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డిల సమక్షంలో ఆయన బాధ్యతలను స్వీకరించారు. కార్యక్రమంలో టఫ్ ఐడీసీ ఛైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, ముదిరాజ్ కార్పొరేషన్ ఛైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బడంగ్‌పేట కార్యాలయాన్ని సందర్శించగా మేయర్, కమిషనర్ ఆధ్వర్యంలో వారిని సత్కరించారు.



మధుసూదన్‌రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవంలో స్పీకర్ గడ్డం ప్రసాద్, ఎమ్మెల్యేలు యాదయ్య, మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి తదితరులు

సంఘటితం కావాలి

బాలాపూర్: సికింద్రాబాద్‌లో విగ్రహం ధ్వంసం ఘటన హిందూ సమాజాన్ని కలచివేసిందని, ఇలాంటివి జరుగుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయలేని స్థితిలో ఉందని మహేశ్వరం నియోజకవర్గం భాజపా ఇన్‌ఛార్జి అందెల శ్రీరాములు ఆరోపించారు. కార్పొరేషన్‌లోని 9వ డివిజన్ సాయిరాంనగర్ ఫేస్-1లో బుధవారం ముత్యాలమ్మ అమ్మవారి షావా ఊరేగింపులో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్పొరేటర్ నిమ్మల సునీత, కాలనీ అధ్యక్షుడు అనిల్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో వాహనాల వేలం

ఆర్కేపురం, న్యూస్‌టుడే: సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీజ్ చేసిన వాహనాలకు శుక్రవారం ఉదయం 10 గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నాలుగు కార్లు, వేలం వేస్తున్నట్లు పేర్కొన్నారు.

విగ్రహానికి అవమానం

యాచారం, న్యూస్‌టుడే: యాచారం మండలం మాల్ కూడలిలోని ఓ విగ్రహం ముఖానికి గుర్తు తెలియని దుండగులు మంగళవారం రాత్రి రంగు పూశారు. ఈ విషయాన్ని బుధవారం ఉదయం గమనించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆందోళనకు దిగారు. ఇక్కడి సాగర్ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఏసీపీ రాజు, సీఐ శంకర్ కుమార్ సంఘటన స్థలానికి వచ్చి విగ్రహాన్ని పరిశీలించి ఆందోళనకారులను శాంతింపజేశారు. ఏసీపీ, సీఐ స్వయంగా విగ్రహాన్ని పాలతో శుద్ధి చేశారు. బాధ్యులైన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పశువులకు గాలికుంటు టీకాలు

యాచారం: యాచారం మండలం మాల్, మొగుళ్లవంపు గ్రామాల్లో బుధవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారిణి రేఖ చెప్పారు. రెండు గ్రామాల్లో 414 పశువులకు టీకాలు వేశామన్నారు. అన్ని గ్రామాల్లోనూ టీకాలు వేసే కార్యక్రమం ఉంటుందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆస్పత్రి నిర్లక్ష్యమే కారణమంటూ ఆందోళన

ఆర్కేపురం, న్యూస్‌టుడే: ఆస్పత్రి యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ఒకరు మృతి చెందినట్లు ఆయన బంధువులు ఆరోపించారు. నల్గొండ జిల్లా కట్టంగూర్ మండలం ముత్యాలమ్మగూడెంకు చెందిన నరసింహా (45) కొత్తపేటలోని ఓ ఆస్పత్రిలో సోమవారం ఛాతీ నొప్పితో చేరారు. ఆరోగ్యశ్రీ సిఫారసు కోసం రెండు రోజుల వరకు వైద్యం చేయలేదని, బుధవారం ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్స చేసిన గంటల వ్యవధిలోనే మరణించినట్లు కుటుంబ సభ్యులు వాపోయారు. ఆస్పత్రి యాజమాన్య వైఖరిని నిరసిస్తూ బుధవారం ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేశారు.

పట్టు జారితే ప్రమాదమే

నగర శివారు ప్రాంతాల్లోని ఇంజినీరింగ్, ఎంబీఏ, ఫార్మసీ తదితర కళాశాలల్లో వేలాది మంది విద్యార్థులు చదువుతున్నారు. నగరం నుంచి శివారు ప్రాంతాలకు ఉదయం వచ్చే విద్యార్థులు, సాయంత్రం కళాశాలల నుంచి ఇళ్లకు వెళ్లే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆయా వేళల్లో సరిపడా ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో విద్యార్థులు కిక్కిరిసిన బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. నగరం నుంచి ఉదయం వేళ శివారు కొత్తగూడెం వైపు వెళుతున్న ఓ ఆర్టీసీ బస్సులో విద్యార్థులు ఫుట్‌బోర్డుపై వేలాడుతూ కనిపించారు. అటు కొత్తగూడెం వైపు నుంచి నగరానికి సాయంత్రం వేళల్లో ఫుట్‌బోర్డుపై ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. అధికారులు దృష్టి పెట్టి ఆయా వేళల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బస్సులను నడపాలని కోరుతున్నారు.



- న్యూస్‌టుడే, అబ్దుల్లాపూర్‌మెట్

అంగన్‌వాడీల్లో మౌలిక వసతుల పనులు

ఈనాడు కథనానికి స్పందన

తుర్కయంజాల్ పురపాలిక, న్యూస్‌టుడే: తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించే పనులను అధికారులు ప్రారంభించారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనా పనులు ప్రారంభించడంలో జాప్యం జరుగుతున్న వైనంపై ఈనెల 5న 'ఈనాడు'లో ప్రచురితమైన 'నిధులున్నా.. వసతులు ఒనగూరేనా?' అనే కథనానికి తుర్కయంజాల్ మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు స్పందించారు. ఈ నేపథ్యంలో నిధులు మంజూరైన అంగన్‌వాడీ కేంద్రాల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి, కుళాయి కనెక్షన్ తదితర పనులను చేపడుతున్నారు.

పాదచారులకు దారేది?



ఆర్కేపురంలోని గ్రీన్‌హిల్స్ కాలనీ రోడ్డు నం-4లో పాదబాటపై నరికేసిన చెట్టు కొమ్మలు గుట్టలుగా పడి ఉన్నాయి. వాన కురిసిన ప్రతిసారి దోమలతో, ఈగలతో సతమతం అవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. పాదచారులకు దారి లేక ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ఆర్కేపురం

ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నియామకం

కందుకూరు: భాజపా ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా కందుకూరు మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మంద పాండు నియమితులయ్యారు. బుధవారం ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు.

సైబర్ మోసానికి గురైతే 1930కి కాల్ చేయండి

మహేశ్వరం, న్యూస్‌టుడే: చరవాణి వాడకం తగ్గించాలని, అనవసరమైన యాప్స్ ఉపయోగించవద్దని, గుర్తు తెలియని వ్యక్తులు ఇచ్చే చాక్లెట్లు లాంటివి తీసుకుంటే మత్తుకు బానిసలుగా మారే ప్రమాదం ఉందని పహాడీషరీఫ్ ఎస్సై దయాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం తుక్కుగూడ సీబీఆర్ మెమోరియల్ స్కూల్లో సైబర్ క్రైమ్ గురించి విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే ప్రిన్సిపల్‌కు లేదా ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. రోడ్డుపై ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే 100కి కాల్ చేయాలని, అనుకోకుండా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కి కాల్ చేయాలని సూచించారు. ప్రిన్సిపల్ చింతల సింహారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు నిధుల మంజూరుపై హర్షం

కందుకూరు, న్యూస్‌టుడే: గ్రామీణ రోడ్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరుతో ఆ గ్రామాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కందుకూరు నుంచి దెబ్బడగూడ రోడ్డు విస్తరణ అభివృద్ధికి రూ.2.5 కోట్లు నిధులు మంజూరు చేయడంతో మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ జంగారెడ్డి, మాజీ సర్పంచి శ్రావణి మంత్రి సీతక్కను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నేదునూరు రోడ్డు నుంచి మద్దెల కుంట తండా వరకు ఏడు కిలో మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.8 కోట్లు మంజూరు చేయడంతో కాంగ్రెస్ నాయకులు అఫ్జల్‌బేగ్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కేఎల్ఆర్ కృషితో రూ.17 కోట్లు నిధులు చేయించారని గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ పాండురంగారెడ్డి తెలిపారు.

ప్రజలతో పోలీసులు మమేకమవ్వాలి: ఏసీపీ



రంగాపూర్‌లో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఏసీపీ రాజు

రంగాపూర్ (మంచాల): ప్రజలతో మమేకం అయినప్పుడే పోలీసులు విధుల్లో విజయవంతం అవుతారని ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు, మంచాల సీఐ మధు అన్నారు. పోలీస్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించే యత్నంలో భాగంగా ప్రజల వద్దకు పోలీసులు అనే కార్యక్రమానికి రంగాపూర్ గ్రామంలో ఏసీపీ రాజు ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. ఒకవైపు వర్షం, విద్యుత్తు కోత ఉన్నా కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా ఏసీపీ రాజు మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు పోలీస్ వ్యవస్థ అహర్నిశలు పాటుపడుతుందని చెప్పారు. సైబర్ నేరాలు, దోపిడీలు, మహిళలపై అత్యాచారాలు, వేధింపులు, సీసీ కెమెరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సీఐ మధు, ఎస్సై లాలయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మొగిలయ్య స్థల ప్రహరీ ధ్వంసం కేసులో..

నిందితుల గుర్తింపు.. ఒకరి అరెస్టు

హయత్‌నగర్, న్యూస్‌టుడే: పద్మశ్రీ పురస్కార గ్రహీత కిన్నెర మొగిలయ్యకు కేటాయించిన ప్రభుత్వ భూమిలో ఆయన నిర్మించుకున్న ప్రహరీని ధ్వంసం చేసిన నిందితులను హయత్‌నగర్ పోలీసులు గుర్తించారు. బాగ్ హయత్‌నగర్ పరిధిలో 159 సర్వే నంబర్‌లో మొగిలయ్యకు ప్రభుత్వం 600 గజాల స్థలాన్ని కేటాయించింది. ఆ స్థలం చుట్టూ ఆయన ప్రహరీ నిర్మించుకోగా, ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు కూల్చి వేశారు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ఇందుకు కారణమైన వ్యక్తులను గుర్తించారు. నిందితుల్లో ఒకరైన వనస్థలిపురం వనస్థలి హిల్స్ కాలనీకి చెందిన భవనం బ్రహ్మారెడ్డి (70)ని అరెస్టు చేశారు. లక్ష్మయ్య, గోవర్దన్, శ్రీను అనే ముగ్గురు పరారీలో ఉన్నట్లు సీఐ నాగరాజు గౌడ్ తెలిపారు. నిందితుడు బ్రహ్మారెడ్డికి చెందిన ఓ వాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

ఇంటి నుంచి బయటకు వెళ్లిన గృహిణి అదృశ్యం

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: ఒడిశా నుంచి ఉపాధి కోసం వచ్చిన ఓ కుటుంబానికి చెందిన గృహిణి అదృశ్యమైన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన ఓ కుటుంబ ఉపాధి కోసం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బండరావిరాలకు వచ్చి స్థానికంగా నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో గృహిణి (24) మంగళవారం మధ్యాహ్నం వేళ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, తెలిసిన ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నూతన సీఐలకు సత్కారాలు

మంచాల: మంచాల సీఐగా బాధ్యతలు స్వీకరించిన మధును బుధవారం ఆరుట్ల, బండలేమూర్ వివిధ యువజన సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. ఆరుట్ల, బండలేమూర్ తాజా మాజీ సర్పంచులు విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, ముచ్చర్ల వెంకటేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్కేపురం: రాష్ట్ర యువజన కాంగ్రెస్ నేత చిలుక ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో చైతన్యపురి నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్ రావును సత్కరించారు.

ప్రజాసమస్యలపై సీపీఎం నిరంతర పోరాటం

తుర్కయంజాల్ పురపాలిక, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై సీపీఎం నిరంతర పోరాటం చేస్తుందని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పగడాల యాదయ్య అన్నారు. బుధవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ మన్నెగూడ ఎన్ఎస్ఆర్ నగర్ కాలనీలో నిర్వహించిన సీపీఎం మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. అర్హులైన పేదలు అందరికీ సంక్షేమ ఫలాలు అందేలా నాయకులు పోరాటం చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న ఆరు గ్యారంటీలు పేదలకు చేరేలా కృషి చేయాలన్నారు. అనంతరం పార్టీ ఎన్ఎస్ఆర్ నగర్ కాలనీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఆశీర్వాదం, సభ్యులుగా శంకర్, లక్ష్మయ్య, యాదగిరి, చిన్నలను నియమించారు. పార్టీ పట్టణ బాధ్యుడు డి.కిషన్, నాయకులు సత్యనారాయణ, శారద, వెంకటకృష్ణ, శ్రీధర్‌కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మన్నెగూడ ఎన్ఎస్ఆర్ నగర్ కాలనీలో సీపీఎం జెండావిష్కరణలో నాయకులు

ఉపాధిహామీ పథకం సద్వినియోగం చేసుకోండి

నోముల (మంచాల): జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కూలీలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని మంచాల ఎంపీడీఓ బాలశంకర్ కోరారు. నోముల ప్రత్యేకాధికారి సుధారెడ్డి ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం పనులపై బుధవారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఏపీఓ వీరాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి సుభద్రదేవి, ఉపాధి హామీ పథకం సాంకేతిక సహాయకుడు మహేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: ఉపాధి హామీ పథకంలో ప్రజలకు, రైతులకు ఉపయోగపడే పనులు చేయాలని ఎంపీవో లక్పతి నాయక్, ముకునూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్ లింగంకు సూచించారు. బుధవారం ముకునూరు గ్రామంలో 2025-26 సంవత్సరానికి సంబంధించిన ఉపాధి హామీ పథకంలో చేయాల్సిన పనులపై ప్రణాళిక రూపొందించి గ్రామ సభలో తీర్మానం చేశారు.

మహిళా హక్కుల సాధనకు ఐద్వా పోరాటం

మీర్‌పేట న్యూస్‌టుడే: మహిళల రక్షణకు, హక్కుల సాధన కోసం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) పోరాటం చేస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. రంగారెడ్డి జిల్లా ఐద్వా మహాసభలు మీర్‌పేట కార్పొరేషన్‌లోని నందిహిల్స్‌లో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మల్లు లక్ష్మి మాట్లాడుతూ పురుషాధిక్యత కలిగిన సమాజంలో సంఘటిత పోరాటాల ద్వారానే మహిళల హక్కులకు రక్షణ ఉంటుందని అన్నారు. మహిళల శ్రమను చిన్నచూపు చూస్తూ వారి హక్కులకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమాన్ని కొనసాగిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అరాచకాలు, దాడులపై క్షుణ్ణంగా చర్చించి భవిష్యత్తు పోరాటాలకు శ్రీకారం చుడతామని చెప్పారు. ఐద్వా జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎం.విజయలక్ష్మి, అధ్యక్షులుగా కె.సుమలతతో పాటు 12 మంది సభ్యులను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. మహాసభల్లో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి, ప్రజాతంత్ర జిల్లా బాధ్యులు కె.భాస్కర్, జగదీశ్, ప్రకాశ్ కారట్, బాలాపూర్ మండల బాధ్యులు యాదయ్య, విజయ, యాదగిరిచారి తదితరులు పాల్గొన్నారు.



ఐద్వా మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, వేదికపై ముఖ్య నాయకురాళ్లు

ఖైరతాబాద్

• ఖైరతాబాద్ • జూబ్లీహిల్స్



నాలా పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: వెస్ట్ శ్రీనివాసనగర్‌లో రూ.45 లక్షలతో నిర్మించతలపెట్టిన వరదనీటి నాలా పునరుద్ధరణ పనులకు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఇది పూర్తి అయితే దశబ్దాలుగా నెలకొన్న వరదనీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందన్నారు.

నరేందర్‌రెడ్డిని కలిసిన రవిశేఖర్‌రెడ్డి



యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని కన్జ్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి డాక్టర్ పీవీ.రవిశేఖర్‌రెడ్డి బుధవారం కలిశారు. తెలంగాణలో వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను వేంనరేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

ఇంటింటి సర్వే జరిగేదెలా..
ఫ్యామిలీ కార్డులిచ్చేదెలా?



ఖైరతాబాద్‌లోని న్యూ సీఐబీ క్వార్టర్స్‌లో వివరాలు నమోదు చేసుకుంటున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ఒక ఫ్యామిలీ కార్డు ఇచ్చేందుకు నిర్ణయించిన నేపథ్యంలో పైలట్ ప్రాజెక్టు కింద ప్రతి నియోజకవర్గంలోనూ ఒక కాలనీని ఎంపిక చేసి సర్వే చేయించింది. ఖైరతాబాద్ నియోజకవర్గం లక్ష్మీనగర్ కాలనీలో బల్దియా అధికారులు సర్వే చేశారు. అయితే ఈ కాలనీలో నివాసితుల జాబితాను ఏ ప్రక్రియ కింద సిద్ధం చేశారో కానీ అందులో 20 శాతం కూడా కాలనీలో లేరు. ఒకే కాలనీ కదా రెండ్రోజుల్లో పూర్తిచేసుకోవచ్చని జాబితాలతో వచ్చిన 4 బృందాలకు నిరాశే ఎదురైంది. జాబితాలో కుటుంబ యజమాని పేరు, ఫోన్ నంబరు, ఖైరతాబాద్ డివిజన్ అని మాత్రం ఉంది. జాబితా ప్రకారం మొత్తం 576 కుటుంబాలుండాలి. కానీ వందలోపు కుటుంబాలైనా లేవు. ఫోన్లు చేసి యజమాని ఏ బస్తీలో ఉంటే ఆ బస్తీకి వెళ్లి వివరాలు సేకరించారు. ఇలా మొత్తం 576 కుటుంబాలు ఉంటే కేవలం 192 మంది మాత్రమే చిక్కారు. అంటే 33 శాతం మాత్రమే అందుబాటులోకి వచ్చారు.

పదేళ్ల నాటి జాబితా.. జాబితాలోని చాలామంది ఫోన్లు పనిచేయడంలేదు. కొందరు మా చిన్నప్పుడు అక్కడ ఉండేవాళ్లం అని చెప్పడం గమనార్హం. అంటే ఆ జాబితా 10 ఏళ్ల నాటిది కావొచ్చని అధికారులు అభిప్రాయపడుతున్నారు. దీంతో నగర వ్యాప్తంగా ఎంపిక చేసిన కాలనీల నుంచి వచ్చే సమాచారం ఆధారంగా మిగతా ప్రాంతాల్లో ఎలా ముందుకు వెళ్లాలనే ఆలోచనలో అధికారులున్నారు.

ఈ ఠాణాకు సిబ్బంది కావలెను



3 నెలలుగా ఇద్దరే ఎస్సైలు

నారాయణగూడ, న్యూస్‌టుడే: నారాయణగూడ ఠాణాకు సిబ్బంది కరవయ్యారు. దీంతో కేసుల దర్యాప్తులో జాప్యం నెలకొంటోంది. నగరంలోని బిజీ ఠాణాల్లో ఇది కూడా ఒకటి. ఇటీవల కొత్త ఠాణాల ఏర్పాటు, పరిధులు కుదించడంతో 'ఎ' గ్రేడ్ స్థాయి నుంచి 'బి' గ్రేడ్‌కు పడిపోయింది. ఇక్కడున్న నలుగురు ఎస్సైలు బదిలీలపై వేర్వేరు ఠాణాలకు వెళ్లిపోయారు. ఒక ఎస్సై ఉద్యోగ విరమణ చేశారు. ప్రస్తుతం స్టేషన్ హౌజ్ ఆఫీసర్ (ఇన్‌స్పెక్టర్), ఇద్దరు ఎస్సైలు మాత్రమే ఉన్నారు. వీరిలో ఒకరు డిటెక్టివ్ ఎస్సై. ఈయన నేరపరిశోధనల్లో బిజీగా ఉంటే శాంతిభద్రతలకు ఒక్క ఎస్సై మాత్రమే ఉన్నారు. ఈ ఠాణా పరిధిలో సీపీఐ రాష్ట్ర కార్యాలయం, రాష్ట్ర పంచాయతీరాజ్, రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ, కింగ్‌కోఠి జిల్లా ఆసుపత్రి, సీసీఎస్ (పాత పోలీసు కమిషనరేట్) భవనం వంటి ప్రభుత్వ, ప్రభుత్వేతర కార్యాలయాలతోపాటు ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ వంటి రాష్ట్ర స్థాయి సంఘాల కార్యాలయాలు, ముఖ్యంగా విద్యాలయాలు ఇక్కడున్నాయి. నిత్యం ఏదో ఒక ధర్నా, బందోబస్తు ఉండనే ఉంటుంది. ఇటీవల గణేశ్ వేడుకలు జరగగా మూడో రోజు నుంచి నిమజ్జనోత్సవాల్లో వివిధ జిల్లాల నుంచి వచ్చే అదనపు బలగాలను రప్పించారు. అలాగే దుర్గా నవరాత్రోత్సవాలు, నిమజ్జనోత్సవాలు కూడా ఆ ఇద్దరు ఎస్సైలతోనే ముగించారు. ఎస్‌హెచ్‌ఓ కూడా ఎస్సైలతో పాటు కష్టపడాల్సి వచ్చింది. ఇలాంటి ముఖ్యమైన ఠాణాపై ఉన్నతాధికారులు దృష్టిని సారించాల్సి ఉంది.

- గతంలో సెక్టార్లు 6, ప్రస్తుతం (ఠాణాల విభజన తరువాత) - 4
- ఇన్‌స్పెక్టర్లు - 2 (ఎస్‌హెచ్‌ఓ, డీఐ)
- గతంలో ఎస్సైలు 8 మంది. ఠాణా విభజన తరువాత ఐదుగురు అయితే ప్రస్తుతం ఇద్దరే. వీరిలో ఒకరు డీఎస్సై.
- కానిస్టేబుళ్లు 60 మందికి 41 మందే ఉన్నారు.

అసంపూర్తిగా రోడ్డు పనులు



మధురానగర్ డి-బ్లాకు ప్లాటు నంబరు 1 నుంచి 13 వరకు రోడ్డు వేయకుండా తవ్వి వదిలేశారిలా..



కొత్తగా వేసిన సీసీరోడ్డు ఎత్తుపల్లాలుగా మారటంతో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: వెంగళరావునగర్ డివిజన్ పరిధి మధురానగర్ డి-బ్లాకులో సీసీరోడ్డు పనులు అసంపూర్తిగా వదిలేటమే కాకుండా కొత్తగా వేసిన రోడ్డు ఎత్తుపల్లాలుగా మారటంతో వర్షం నీరు రోడ్డుపై నిల్వ ఉంటుండటంతో స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు. మధురానగర్ డి-బ్లాకులో ప్లాటు 101 నుంచి 110 వరకు, ప్లాటు 1 నుంచి 13 వరకు రూ.18 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్లాటు నంబరు.డి- 101 నుంచి 110 వరకు కొత్తగా రోడ్డు వేసినప్పటికీ లెవలింగ్ సరిగ్గా లేకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా వరదనీరు పల్లంగా ఉన్నచోట్ల నిలుస్తోంది. అంతేకాకుండా ప్లాటు 1 నుంచి 13 వరకు తవ్వకాలు చేపట్టి నెలరోజులు అవుతున్నా కొత్తగా సీసీరోడ్డు వేయలేదు. రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపారు.

క్షయను పూర్తిగా నయం చేయొచ్చు

టీబీ సీల్ క్యాంపెయిన్‌ను ప్రారంభించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



టీబీ సీల్ సేల్ క్యాంపెయిన్‌ను ప్రారంభిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: క్షయ (టీబీ) వ్యాధిని పూర్తిగా నయం చేయొచ్చని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. రాష్ట్రంలో ఈ వ్యాధి నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ టీబీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 75వ టీబీ సీల్ సేల్ క్యాంపెయిన్‌ను బుధవారం రాజ్‌భవన్‌లోని దర్బార్ హాల్‌లో గవర్నర్, తెలంగాణ టీబీ అసోసియేషన్ అధ్యక్షుడు జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించారు. గవర్నర్ మాట్లాడుతూ.. జాతీయ టీబీ నియంత్రణ కార్యక్రమం ద్వారా అందుబాటులో ఉన్న చికిత్సలతో పురోగతి పొందవచ్చారు. అయితే క్షయ రోగులు వారికి సూచించిన చికిత్స నియమావళిని కచ్చితంగా పాటించాలని కోరారు. టీబీ కేసుల సంఖ్యను తగ్గించే ప్రయత్నాలను ముమ్మరం చేయాలని అసోసియేషన్‌కు గవర్నర్ సూచించారు. 2025 నాటికి క్షయ రహిత భారతదేశం లక్ష్యాన్ని సాధించడానికి చురుకైన పాత్ర పోషించాలని, ఇందుకు కుటుంబాల సహకారం అవసరమన్నారు. క్షయవ్యాధి నిర్మూలనలో తెలంగాణ టీబీ అసోసియేషన్ విశేష కృషి చేస్తోందని కొనియాడారు. డాక్టర్ టీవీ వెంకటేశ్వరులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్‌కు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వైస్ ఛైర్మన్లుగా డాక్టర్ సుధీర్ ప్రసాద్, డా.సీఎన్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా డా.బాలచందర్‌తోపాటు కార్యవర్గ సభ్యులుగా మరో 15 మంది ఎన్నికయ్యారు.

కారులోనే ఫొటో స్టూడియో



రవీంద్రభారతిలో నిత్యం సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతుంటాయి. ముఖ్యంగా చిన్నపిల్లలు ప్రదర్శనలిస్తే తల్లిదండ్రులు వాటిని చరవాణిలో చిత్రీకరించుకుంటారు. మరికొందరు ఫొటో ప్రింట్‌లు తీసుకుంటారు. దీంతో ఓ ఛాయాచిత్రగ్రాహకుడు కారులో ల్యాప్‌టాప్, ప్రింటర్లతో వచ్చేశాడు. ఫొటోలు కావాలనుకునే వాళ్లకు అక్కడిక్కడే ప్రింట్‌లు తీసి ఇస్తుంటాడు. గతంలో రవీంద్రభారతి ప్రాంగణంలో తాత్కాలిక ఫొటో స్టూడియో పెట్టి వ్యాపారం చేస్తుంటే సాంస్కృతిక శాఖ సిబ్బంది అడ్డుకున్నారు. దాంతో ఇప్పుడు కారులో ఇలా మొబైల్ స్టూడియో పెట్టేశాడు. –న్యూస్‌టుడే, రవీంద్రభారతి

చెట్ల నరికివేత



షేక్‌పేటలో చెట్లపై వేటు పడుతోంది. అక్కడి సక్కుబాయి నగర్ కాలనీలో దాదాపు 10 చెట్లను నరికివేశారు. దశాబ్దం క్రితం ఆ కాలనీలో మొక్కలు నాటగా ఏపుగా పెరిగాయి. కాగా కొందరు తమ ప్లాట్లు, ఇళ్లకు అడ్డు వస్తున్నాయని ఇలా చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, షేక్‌పేట

సీపీఆర్, ప్రాథమిక చికిత్సలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు శివరంజని



శిక్షణ తీసుకుంటున్న విశ్రాంత ఐఏఎస్ అధికారిణి ఉషారాణి

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: చిన్నారుల్లో సీపీఆర్, ప్రథమ చికిత్స తదితర అంశాలపై చిన్నారుల వైద్యురాలు శివరంజని అవగాహన కల్పించారు. జూబ్లీహిల్స్‌లోని తాజ్‌మహల్ హోటల్‌లో

పలువురు వైద్యనిపుణులతోపాటు గృహిణులు, యువతీయువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. చిన్నారుల ఆహారం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. గొంతులో ఏదైనా చిక్కుకుంటే ఊపిరి ఆడకుండా తీవ్ర ఇబ్బంది పడతారన్నారు. వెంటనే ఎలాంటి చికిత్స అందించాలో వివరించారు. చిన్నవయసులోనే గుండెపోటు వస్తే సీపీఆర్ ఎలా చేయాలో చేసి చూపారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లపై లేబుల్ చూడకుండానే అసలు, నకిలీ గుర్తించకుండా కొనుగోలు చేస్తున్నామన్నారు. అవి ప్రమాదకరమన్నారు.

కొమ్మల నరికివేత

స్పందనకు వందనం

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: వెంకటగిరి స్రవంతినగర్‌లో చెట్టుకొమ్మలు విద్యుత్ తీగలకు తాకుతుండటంతో షార్ట్ సర్క్యూట్ అవుతోంది. సమస్యను స్థానిక నివాసి శ్రీనివాస్ 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. దీన్ని విద్యుత్‌శాఖ సీబీడీ ఏఈ వేణు మాధవ్ దృష్టికి తీసుకుని వెళ్లడంతో వెంటనే స్పందించి ఇబ్బందికరంగా మారిన చెట్లకొమ్మలను నరికేసేలా చర్యలు తీసుకున్నారు.

రెండు పడక గదుల ఇళ్లల్లో లబ్ధిదారులే ఉన్నారా?

ఖైరతాబాద్: రెండు పడక గదుల ఇళ్లల్లో లబ్ధిదారులే ఉన్నారా.. ఇతరులకు అమ్ముకున్నారా, అద్దెకు ఇచ్చారా అనే కోణంలో కేంద్ర సోషల్, ఎకనామిక్ ఆడిట్ బృందాలు ఆరా తీశాయి. బుధవారం ఖైరతాబాద్‌లోని ఇందిరానగర్ డిగ్నిటీ హౌసింగ్ కాలనీలో అధికారుల బృందం ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించింది. కమిటీ అధ్యక్షుడు అనిల్ పలు సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్లారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ. 1 గంట మధ్య

ఖైరతాబాద్	80085 73345
జూబ్లీహిల్స్	80085 73352
బంజారాహిల్స్	80085 73348

బంజారాహిల్స్ న్యూస్‌టుడే: ? బంజారాహిల్స్ రోడ్డు 5లోని ఓ వార్తా ఛానెల్ కార్యాలయం సమీపంలో పలు వీధిదీపాలు పగలు కూడా వెలుగుతున్నాయి. **- శ్రీకాంత్, ప్రైవేటు ఉద్యోగి, బంజారాహిల్స్**

✓ సాంకేతికలోపం కారణం కావచ్చు. సమస్య పరిష్కరిస్తాం. **- సుష్మ, మున్సిపల్ ఏఈ (వీధిదీపాల విభాగం), సర్కిల్-18**

మాలల మహాపాదయాత్ర కరపత్రిక ఆవిష్కరణ



హిమాయత్‌నగర్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దళితుల ఐక్యత కోసం జాతీయ మాల మహానాడు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన 'మాలల మహాపాదయాత్ర' కరపత్రిక ఆవిష్కరణ బుధవారం ట్యాంక్‌బండ్‌పై అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగింది. ఈనెల 25 నుంచి భద్రాచలం నుంచి ప్రారంభమై డిసెంబరు 1న హైదరాబాద్ వరకు యాత్ర సాగుతుందన్నారు.

ఏఐవైఎఫ్ నిరసన



హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.7700 కోట్ల ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ, బీఎడ్ కోర్సుల విద్యార్థుల బోధన, ఉపకారవేతన బకాయిలను సత్వరమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్ వైజంక్షన్ కూడలి వద్ద నిరసన చేపట్టారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి ఆర్.బాలకృష్ణ, నెర్లకంటి శ్రీకాంత్ మాట్లాడారు.

బోరబండ అభివృద్ధికి సహకరించండి



బోరబండ, న్యూస్‌టుడే: బోరబండ ప్రాంత అభివృద్ధికి సహకరించాలని డివిజన్ కార్పొరేటర్ ఎం.డి.బాబాఫసీయుద్దీన్ కోరారు. టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన గాంధీభవన్‌లో బుధవారం జరిగిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. బస్తీల్లో వసతుల కల్పనకు అధిక నిధులు మంజూరు చేయించాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్సీ హాస్టల్ కన్వీనర్‌గా మల్లేష్

హిమాయత్‌నగర్: భాజపా రాష్ట్ర ఎస్సీ హాస్టల్ కన్వీనర్‌గా మల్లేష్ నియమితులయ్యారు. పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీధర్ నుంచి నియామకపత్రాన్ని అందుకున్నారు.

ఎస్పీఆర్ హిల్స్ అభివృద్ధి సమాఖ్య సొసైటీ అధ్యక్షుడిగా జ్ఞానేశ్వర్

బోరబండ, న్యూస్‌టుడే: రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ ఉమ్మడి బస్తీల డెవలప్‌మెంట్ ఫెడరేషన్ సొసైటీ అధ్యక్షుడిగా మహాత్మానగర్ వ్యవస్థాపక అధ్యక్షుడు జె.పి.జ్ఞానేశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండుబొమ్మల కూడలి వద్దనున్న శివాలయ ప్రాంగణంలో స్థానిక 25బస్తీలకు చెందిన ప్రతినిధులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో 66 మందితో కార్యవర్గాన్ని అధ్యక్షుడు ప్రకటించారు.

అభివృద్ధి పనుల తనిఖీ



బంజారాహిల్స్, న్యూస్‌టుడే: వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి బుధవారం బంజారాహిల్స్ రోడ్డు 14, శ్రీవెంకటేశ్వరనగర్ ప్రాంతాల్లో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులు, సీవరేజీ పైపులైను అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. అనంతరం స్థానిక సమస్యలు తెలుసుకున్నారు.

విద్యుత్తు ఏడీఈగా రమేష్



బంజారాహిల్స్, న్యూస్‌టుడే: విద్యుత్తుశాఖ బంజారాహిల్స్ సబ్ డివిజన్‌కు నూతన ఏడీఈ (ఆపరేషన్స్)గా జి.రమేష్ మేడ్చల్ సర్కిల్ జీడిమెట్ల ఏడీఈ లైన్స్ విభాగం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడి ఏడీఈ రామిశెట్టి హైమానంద సరూర్‌నగర్ సర్కిల్ తుర్కయాంజాల్ ఏడీఈ లైన్స్ విభాగానికి బదిలీ అయ్యారు. బంజారాహిల్స్ సబ్‌డివిజన్ సీబీడీ విభాగానికి గుగులోత్ గోపి ఏడీఈగా రాజేంద్రనగర్ సర్కిల్ హెచ్‌టీ మీటర్స్ విభాగం నుంచి బదిలీపై వచ్చారు. అక్కడి శ్రీనివాసరావు సంగారెడ్డి స్టోర్స్ ఏడీఈగా వెళ్లారు.

విద్యార్థిని అదృశ్యం

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: ఆలయానికి వెళ్లిన విద్యార్థిని అదృశ్యమైంది. మధురానగర్ పోలీసుల వివరాల ప్రకారం.. రహ్మత్‌నగర్ ప్రాంతంలో ఉంటున్న 20 ఏళ్ల యువతి డిగ్రీ చదువుతోంది. ఈనెల 15న ఉదయం ఆలయానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటికి వెళ్లింది. సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఠాణాలో ఫిర్యాదు చేశారు.

వెంబడించి దొంగ పట్టివేత

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: ఇంట్లో చోరీకి వచ్చిన వ్యక్తి పారిపోతుండగా బాధితులు పట్టుకుని మధురానగర్ పోలీసులకు అప్పగించారు. వెంగళ్‌రావునగర్‌లోని ఓ ఇంట్లోకి ప్రవేశించిన అగంతకుడు టేబుల్‌పై ఉన్న సెల్‌ఫోన్‌ను తీసుకునే ప్రయత్నం చేశాడు. ఇంటి యజమానురాలు ఎవరు నువ్వు, ఎందుకు ఇంట్లోకి వచ్చావని అడగగా పరుగెత్తాడు. చోర్.. చోర్.. అని అరవడంతో కుటుంబ సభ్యులు అభిషేక్, సాయితేజ నిందితుడిని వెంబడించి పట్టుకుని మధురానగర్ పోలీసులకు అప్పగించారు. నిందితుడు ఫిలింనగర్ ప్రాంతానికి చెందిన బాబుగా గుర్తించారు. గతంలో సైతం అతడిపై కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బుధవారం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

వస్త్రాల షోరూమ్‌లో అగ్నిప్రమాదం

నారాయణగూడ, న్యూస్‌టుడే: నారాయణగూడ ఠాణా పరిధిలో హిమాయత్‌నగర్‌లోని ఓ రెడీమేడ్ వస్త్రాల దుకాణంలో విద్యుదాఘాతంతో అగ్నిప్రమాదం జరిగింది. తెలంగాణ ఫైర్ డిజాస్టర్ రెస్పాన్స్ ఎమర్జన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది అగ్నిమాపక యంత్రాలతో వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. వస్త్రాలన్నీ బూడిదయ్యాయి.

ఉద్యోగం పేరుతో మోసం

యూసుఫ్‌గూడ: ఉద్యోగం పేరుతో డబ్బులు దండుకుని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. ఏపీ ప్రకాశం జిల్లాకు చెందిన వైష్ణవి మధురానగర్‌లోని యోగిత లేడీస్ హాస్టల్‌లో ఉంటుంది. టెలీకాలర్‌గా విధులు నిర్వహిస్తున్న వైష్ణవి గతంలో ఓ రియల్ ఎస్టేట్ కంపెనీలో పనిచేస్తున్న సమయంలో సంగారెడ్డి జిల్లా ఝరాసంఘం ప్రాంతానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కమ్మరి వీరేందర్ పరిచయమయ్యాడు. టెక్ మహేంద్రలో ఉద్యోగం కల్పిస్తానని నమ్మించాడు. ఆగస్టు 8న క్విక్ సన్ సాఫ్ట్‌వేర్ కన్సల్టెన్సీ కంపెనీలో ఇంటర్వ్యూ నిర్వహించి వెబ్ డిజైనర్‌గా ఉద్యోగానికి ఎంపికైనట్లు చెప్పారు. ఉద్యోగానికి ల్యాప్‌టాప్ అవసరమని, రూ.50 వేలు చెల్లించాలని వీరేందర్ చెప్పడంతో ఆగస్టు 12న వైష్ణవి రూ.20 వేలు గూగుల్‌పే చేసింది. మిగిలిన డబ్బులు ఉద్యోగం వచ్చాక ఇస్తానంది. డబ్బులు కట్టనిదే ఉద్యోగం రాదని, పలువురికి ఇవ్వాల్సి ఉంటుందని వీరేందర్ అనడంతో ఆగస్టు 17 నుంచి ఈనెల 9 వరకు పలు దఫాలుగా వీరేందర్‌కు గూగుల్ పే, ఫోన్‌పే ద్వారా రూ.3.5 లక్షలను చెల్లించింది. ఉద్యోగం రాకపోవడంతో వీరేందర్‌పై మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బైకు అదుపు తప్పి ప్రమాదం.. యువకుడు మృతి

ఫిలింనగర్: ద్విచక్రవాహనం అదుపు తప్పి గోడకు కొట్టుకోవడంతో వాహనం నడుపుతున్న యువకుడు తీవ్రగాయాలకు గురై మృతిచెందాడు. ఫిలింనగర్ పోలీసుల కథనం ప్రకారం జూబ్లీహిల్స్‌లోని మస్తాన్‌నగర్‌లో ఉంటున్న నవీన్ (24) డిగ్రీ చదివి ఉద్యోగ వేటలో ఉన్నాడు. మంగళవారం రాత్రి 10:30 గంటల సమయంలో షేక్‌పేట, లక్ష్మీనగర్‌లో ఉంటున్న మిత్రుడి వద్దకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. బుధవారం వేకువజామున షేక్‌పేట నుంచి ఫిలింనగర్ దారిలోని డీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ వద్ద వాహనం అదుపు తప్పి గోడకు కొట్టుకోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

క్రైమ్ కార్నర్

మానసిక చికిత్సాలయం నుంచి రోగి అదృశ్యం

వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయం నుంచి ఓ రోగి అదృశ్యం అయ్యాడు. బోరబండ పోలీసుల వివరాలు ప్రకారం.. పెద్దపల్లి జిల్లాకు చెందిన మల్లేష్ (45).. రాత్రిళ్లు సరిగా నిద్రపోకపోవడం, కనిపించిన వారిని కొట్టడం వంటి పనులు చేస్తుండటంతో ఈనెల 14న మానసిక చికిత్సాలయానికి సోదరులు తీసుకొచ్చారు. వైద్య పరీక్షలు అనంతరం ఆసుపత్రిలో చేర్చారు. మంగళవారం మల్లేష్ అదృశ్యమయ్యాడు. సోదరుడు సాదయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఇంటి నిర్మాణం పేరుతో మోసం.. సంస్థపై కేసు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: ఇళ్లు కట్టిస్తామని అంగీకరించి కట్టకుండా ఏళ్లు గడిపిన ఓ సంస్థ నిర్వాహకులపై బంజారాహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. కూకట్‌పల్లి వాసి ఫజల్ అహ్మద్ తనకున్న 167 గజాల స్థలంలో ఇంటి నిర్మాణం కోసం ఆల్ ఎబౌట్ బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (డిజైన్ అండ్ కన్‌స్ట్రక్ట్) సంస్థకు అప్పగించారు. జీ+3 అంతస్తుల్లో నిర్మించి ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. ఇందుకోసం 2022లో పలు దఫాలుగా రూ.12.25 లక్షలు చెల్లించారు. పనులు ప్రారంభించకుండా సాగదీస్తూ వచ్చారు. 2023లో నిలదీయగా 60 రోజుల్లో రూ.7.50 లక్షలు ఇచ్చేందుకు నిర్మాణదారులు అంగీకరించారు. ఏడాదిన్నర గడుస్తున్నా డబ్బులు ఇవ్వకపోవడంతో సంస్థ హైదరాబాద్ ప్రాజెక్టు డైరెక్టర్ మలిశెట్టి కృష్ణ వరుణ్, బెంగళూరుకు చెందిన సీఈఓ, డైరెక్టర్ ప్రియదర్శి మిశ్రా, బెంగళూరు శాఖకు చెందిన వరుణ్‌రాజ్ గౌడ, గుణశేఖరన్‌పై ఫజల్ అహ్మద్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రెండుసార్లు నమ్మించి.. మూడోసారి మోసగించి..

జూబ్లీహిల్స్: ఆభరణాల వ్యాపారి వద్దకు రెండుసార్లు వచ్చి ఆభరణాలు కొనుగోలు చేసి నమ్మించాడు.. మూడోసారి ఆభరణాలు కొనుగోలుకు వచ్చి మోసానికి పాల్పడ్డాడు. బంజారాహిల్స్ పోలీసుల వివరాల ప్రకారం.. నాంపల్లికి చెందిన శ్రీనాథ్ వ్యాస్.. వ్యాపారినంటూ బంజారాహిల్స్ రోడ్ 8లోని ఉత్కర్ష జువెలర్స్‌కు వచ్చాడు. డబ్బులిచ్చి రెండుసార్లు ఆభరణాలు కొని యజమాని బాలాజీపాటిల్‌ను నమ్మించాడు. 2 నెలల క్రితం మరోసారి వచ్చి రూ.15 లక్షల ఆభరణాలు కొనుగోలు చేశాడు. డబ్బులు తీసుకురాలేదని, ఇంటికి వెళ్లి పంపిస్తానని యజమాని నమ్మించి అక్కడి నుంచి జారుకున్నాడు. అప్పటినుంచి డబ్బులు ఎప్పుడిస్తావంటూ యజమాని ఎన్నిసార్లు ఫోన్లు చేసినా ఏదో ఒక సాకు చెప్తుండటంతో మోసపోయినట్లు గ్రహించిన యజమాని బుధవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యువతిపై లైంగిక వేధింపులు

నారాయణగూడ, న్యూస్‌టుడే: యువతిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఇద్దరిని నారాయణగూడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. నారాయణగూడలో ఉండే ఓ యువతి డిగ్రీ చదువుతోంది. ఇంటర్ చదివే సమయంలో షాబాజుద్దీన్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. అది డిగ్రీ వరకు కొనసాగుతూనే ఉంది. పలుమార్లు ఆ యువతిని లైంగికంగా వేధించసాగాడు. దానికి షాబాజుద్దీన్ స్నేహితుడు షాబాజ్ సహకరించాడు. అంతేకాకుండా షాబాజుద్దీన్.. యువతితో తాను కలిసి ఉన్న చిత్రాలు, వీడియోలను చూపించి బ్లాక్‌మెయిల్ చేయడం మొదలుపెట్టాడు. దాంతో బాధితురాలు నారాయణగూడ పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసిన పోలీసులు ఇద్దరు నిందితుల్ని అదుపులోకి తీసుకున్నారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

కూకట్‌పల్లి

పోచమ్మ ఆలయంలో చండీహోమం



మూసాపేట, న్యూస్‌టుడే: మూసాపేట భవానీనగర్ పోచమ్మ ఆలయ రజతోత్సవాల సందర్భంగా చండీహోమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాల భక్తులు హోమంలో కూర్చున్నారు. సాయంత్రం రుద్రహోమం, లక్ష పుష్పార్చన, కుంకుమార్చన తదితర కార్యక్రమాలు జరిగాయి. అనంతరం హరినామ సంకీర్తన, ప్రవచనాలు నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ అంబటి శ్రీనివాస్‌తోపాటు పుర ప్రముఖులు హాజరయ్యారు.

కాంట్రాక్టు అధ్యాపకుల నిరసన



కూకట్‌పల్లి: జేఎన్‌టీయూహెచ్ ఒప్పంద అధ్యాపకుల రిలే నిరసన కార్యక్రమం కొనసాగుతుంది. బుధవారం కళాశాల స్పందన బ్లాక్ ముందు ఫ్లకార్డులతో బైఠాయించి నిరసన తెలిపారు. జీవో నం.11 అమలు చేయడంతో వర్సిటీ అధికారులు తాత్సారం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని వర్సిటీల్లో అమలవుతున్నా ఇక్కడ తమపై నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడం ఎంతవరకు సమంజసమన్నారు. తమ డిమాండ్లను నెరవేర్చాలన్నారు. కాంట్రాక్ట్ అధ్యాపకులు డాక్టర్ బి.రాజేష్‌ఖన్నా, పావని, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, బాలరాజ్, సంధ్య, మానస తదితరులు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీ డీఐ బాధ్యతల స్వీకరణ



రవికుమార్

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: కేపీహెచ్‌బీ డీఐగా కె.రవికుమార్ బాధ్యతలు చేపట్టారు. 2007 బ్యాచ్‌కు చెందిన రవి కుమార్ సైబర్‌క్రైమ్స్ నుంచి బదిలీపై కేపీహెచ్‌బీ నేర విభాగానికి వచ్చారు.

సీఐకి కాంగ్రెస్ నేతల అభినందన



నరసింహరాజుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న బండి రమేశ్

బాలానగర్, న్యూస్‌టుడే: బాలానగర్ కొత్త సీఐ నరసింహరాజును బుధవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ బాధ్యుడు బండి రమేశ్ పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. శోభన సెంటర్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నేతలు లక్ష్మయ్య, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విభాగంలో రెక్టార్ తనిఖీలు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూహెచ్ ఇంజినీరింగ్ విభాగంలో బుధవారం రెక్టార్ డాక్టర్ కె.విజయ్‌కుమార్‌రెడ్డి తనిఖీలు నిర్వహించారు. ఈ విభాగంలో పనిచేస్తున్న 52మంది సిబ్బంది పనితీరు, హాజరీ రిజిష్టర్లను పరిశీలించారు. పనితీరు సరిగాలేని ఓ పొరుగు సేవల ఉద్యోగిపై రెక్టార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యాంపస్‌లో ప్రమాదాలను నియంత్రించేందుకు ఏర్పాటుచేసిన వేగ నియంత్రికలపై సమీక్షించారు. స్పీడ్ బ్రేకర్ల నిర్మాణం సరిగా జరగకపోవడాన్ని ప్రశ్నించారు. సరిచేసి పక్కాగా పునరుద్ధరించాలని ఆదేశించారు. క్యాంపస్ నిర్వహణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. సిబ్బంది పనితీరులో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

వ్యర్థాల తొలగింపు..
సుందరీకరణకు కసరత్తు

నల్లచెరువు పరిరక్షణకు చర్యలు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: చెరువు స్థలంలో ఆక్రమణలు కూల్చివేసిన అధికారులు.. తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నారు. నేలమట్టం చేసిన తర్వాత వాటిని తొలగించడంతోపాటు చదును చేయడం ఒక ఎత్తైతే.. ఆ స్థలాన్ని పరిరక్షిస్తూ.. సుందరీకరించడం మరో ఎత్తు. వాస్తవంగా కూల్చివేతల తర్వాత కొంత ఆలస్యమైనప్పటికీ ఇప్పటికే టెండర్ల ప్రక్రియ సైతం పూర్తి చేశారు. కూల్చివేతలు జరిగిన స్థలంలో వ్యర్థాలతో చుట్టుపక్కల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. వ్యర్థాలను తీయాలని కోరుతూ వస్తుండగా.. తాజాగా కసరత్తు ప్రారంభమవడం విశేషం. కూకట్‌పల్లి నల్ల చెరువు ఎఫ్‌టీఎల్ స్థలంలో నిర్మాణ వ్యర్థాల తొలగింపు.. స్థలం పరిరక్షణకు హైడ్రా ఏర్పాట్ల గురించి తెలుసుకుందాం..

మళ్లీ ఆక్రమణలకు అవకాశం ఇవ్వకుండా..

నల్లచెరువు ఎఫ్‌టీఎల్‌లో వెలిసిన 16 షెడ్లు, నిర్మాణాలను గతనెలలో హైడ్రా అధికారులు కూల్చివేసిన విషయం తెలిసిందే. కాగా వ్యర్థాలన్నీ గుట్టలు.. గుట్టలుగా మిగిలిపోయాయి. ఇందులో పనికొచ్చే ఇనుము తదితరాలను బాధితులు తీసుకున్నారు. పనికిరాని వ్యర్థాల గుట్టలను తొలగించడంతోపాటు కూల్చివేసిన స్థలాన్ని పరిరక్షించడం ముఖ్యం. మళ్లీ ఆక్రమణలకు అవకాశం ఇవ్వకుండా సత్వరమే చర్యలు తీసుకోవాలన్న ఆలోచనతో అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈ దిశగా ఇప్పటికే వ్యర్థాలు తొలగించి.. స్థలాన్ని చదును చేసేందుకు టెండర్లు పిలిచారు. వర్క్ ఆర్డర్ కూడా ఇచ్చామని, తొందరలోనే వ్యర్థాల తొలగింపు మొదలవుతుందని వివరించారు.



గదుల కూల్చివేతతో వ్యర్థాలు



కూల్చిన చోట రేకులు

2 ఎకరాల్లో.. నిర్మాణాలు కూల్చివేయడం ద్వారా 2ఎకరాల చెరువు స్థలం అందుబాటులోకి వచ్చిందని హైడ్రా ప్రకటించింది. ఈ స్థలంలో వ్యర్థాలన్నీ తొలగించనున్నారు. తర్వాత ఆ స్థలాన్ని చెరువు స్థాయికి చదును చేసి హద్దులు ఏర్పాటుచేస్తారు. వాటి ప్రకారం.. తదుపరి ఎటువంటి అతిక్రమణలు జరగకుండా చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. తర్వాత మొత్తం స్థలాన్ని సుందరీకరించేందుకు ఏర్పాట్లు చేయనున్నారు. సీఎస్ఆర్ కింద ముందుకొచ్చే వారి కోసం చూస్తున్నట్లు పేర్కొన్నారు. వాస్తవంగా ఈ చెరువును సుందరీకరించేందుకు ఆరేళ్ల క్రితం కందకం తవ్వి.. కట్ట ఏర్పాటుచేశారు. కానీ, పట్టాదారులు అడ్డుకోవడం.. కోర్టుకెళ్లడంతో కట్టతో సహా.. కందకాన్ని పూడ్చాల్సి వచ్చింది. తర్వాత పట్టాదారులు తమ స్థలాల్లో షెడ్లు.. నిర్మాణాలు చేయగా.. ఇటీవల హైడ్రా వాటిని కూల్చివేసి చెరువు స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. సుందరీకరణ కూడా పూర్తయితే.. చిరకాల కల నెరవేరినట్లవుతుంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

వివరాలు తెలపాల్సింది.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకే

కూకట్‌పల్లి, బాలానగర్, ఓల్డ్‌బోయిన్‌పల్లి, బాలాజీనగర్: 8008573418
కేపీహెచ్‌బీకాలనీ:8008573195, మూసాపేట:8008573423, అల్లాపూర్:9491124918

మ్యాన్‌హోల్ మూత పునరుద్ధరణ



కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కూకట్‌పల్లి డివిజన్ పరిధి దయార్‌గూడలో మంజీరా స్లూయిజ్ వాల్వ్ మ్యాన్‌హోల్ మూత ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. దీంతో రాకపోకలకు అంతరాయం కలుగుతుండగా.. స్థానికులు ఇబ్బంది పడుతూ వస్తున్నారు. ఈ విషయాన్ని జలమండలి అధికారుల దృష్టికి 'ఈనాడు' తీసుకెళ్లగా వారు సత్వరమే స్పందించి సిబ్బందితో మరమ్మతులు చేయించి మూత పునరుద్ధరించి సమస్యను పరిష్కరించారు.

జాతీయ రహదారి విస్తరణ

స్పందనకు వందనం

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: కేపీహెచ్‌బీ పరిధిలో ఇరుకైన జాతీయ రహదారిని జీహెచ్ఎంసీ అధికారులు విస్తరించారు. జేఎన్‌టీయూ చౌరస్తాకు ముందు రహదారిపైనే ఏళ్ల క్రితం సులభ్ కాంప్లెక్స్ నిర్మించారు. పలుమార్లు జాతీయ రహదారి విస్తరణకు నోచుకున్నా ఇక్కడ మాత్రం ఆగిపోయింది. సులభ్ కాంప్లెక్స్ ప్రభావంతో రహదారి ఎలైన్‌మెంట్ మారిపోయింది. కాలిబాటలు సగంలోనే ఆగిపోయాయి. వాహనదారులకు అసౌకర్యం కలుగుతోంది. అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకుంటున్నాయి. సులభ్ కాంప్లెక్స్‌ను తొలగించాలని 'ఈనాడు' కథనం ప్రచురించడంతో ఇంజినీరింగ్ విభాగం అధికారులు తొలగించి రహదారిని పునరుద్ధరించారు. రహదారి విశాలంగా మారింది.

ఆవిష్కరణల దిశగా విద్యార్థులను ప్రోత్సహించాలి



సదస్సులో అతిథులు, అధ్యాపకులు, విద్యార్థులు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: ఆవిష్కరణల దిశగా విద్యార్థులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని జేఎన్‌టీయూహెచ్ విశ్రాంత రిజిస్ట్రార్ కె.లాల్‌కిశోర్ అన్నారు. 'వికసిత్ భారత్-2047 సాంకేతిక విద్యాలయాల పాత్ర' అంశంపై వర్సిటీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. విద్యార్థుల ఆలోచనలను స్టార్టప్‌ల దిశగా తీసుకెళ్లే బాధ్యత అధ్యాపకులదేనన్నారు. విద్యార్థుల్లో అత్యాధునిక నైపుణ్యాభివృద్ధి పెంపొందించాలని, పరిశ్రమలతో భాగస్వామ్యం పెంచాలన్నారు. గ్రామీణాభివృద్ధిలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం దిశగా కృషి జరగాల్సిన అవసరాన్ని స్పష్టం చేశారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, ఉస్మానియా మాజీ రిజిస్ట్రార్ శివరాజ్‌సింగ్, శివరాజ్, సదస్సు కన్వీనర్ కామాక్షిప్రసాద్, కో-కన్వీనర్ డాక్టర్ ఉమ తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక



ఎంపికైన జట్టు సభ్యులతో అధికారులు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: సౌత్‌జోన్ బాస్కెట్‌బాల్ పురుషుల జట్టు ఎంపిక బుధవారం జేఎన్‌టీయూహెచ్ ఇండోర్ స్టేడియంలో జరిగింది. వివిధ ప్రైవేటు కళాశాలల నుంచి 150 మంది విద్యార్థులు హాజరుకాగా వీరిలో ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేశారు. ఎంపికైన జట్టు వచ్చే నెల 1నుంచి 5వరకు బెంగళూరులో జరిగే సౌత్‌జోన్ టోర్నమెంట్‌లో పాల్గొంటుందని నిర్వాహకులు తెలిపారు. వర్సిటీ క్రీడా కార్యదర్శి ఎన్.ఎస్.దిలీప్, ఫిజికల్ డైరెక్టర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



అభిరాజ్

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయిలో నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీల్లో కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి పెండ్యాల అభిరాజ్ ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. బుధవారం కళాశాల ప్రిన్సిపల్ వెంకటయ్య, ఉపాధ్యాయులు బాలుడిని అభినందించారు.

కంటిపాపలకు కష్టం రాకుండా..



వర్షంలో తడుస్తూ అరుస్తున్న పక్షి పిల్లలు



రెక్కలతో కప్పిన తల్లి పక్షి

కూకట్‌పల్లిలో బుధవారం కురిసిన వర్షానికి ఓ చెట్టుపై గూడులో ఉన్న పక్షి పిల్లలు తడుస్తూ భయంతో కీచ్‌కీచ్ మంటూ అరుస్తూ కనిపించాయి. కంటిపాపలుగా కపాడుకునే తమ పిల్లల అరుపులు ఎక్కడో ఉన్న ఆ తల్లి పక్షికి వినిపించాయోమో గాని వేగంగా ఎగురుకుంటూ వచ్చి పిల్లలు తడవకుండా తన రెక్కలతో కప్పి కాపాడుకుంది. ఈ దృశ్యాలు కూకట్‌పల్లిలోని పాపారాయుడునగర్‌లో కనిపించాయి.

సతమతం.. ప్రమాదకరం



చేతులతో ఆపుతూ రోడ్డు దాటుతూ..



బారికేడ్లను తొలగించి వెళ్తున్న వాహనదారులు



యూటర్న్ వద్ద కారు తగిలి పడిపోయిన వాహనదారుడు

రోజూ వందలాది మంది కార్మికులు మూసాపేట నుంచి ప్రశాంత్‌నగర్‌లోని పరిశ్రమలకు పనుల కోసం ఉదయం, సాయంత్రం రాకపోకలు సాగిస్తుంటారు. ప్రశాంత్‌నగర్ డబుల్ రోడ్డులోని యూటర్న్ వద్ద ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్‌ను కొన్ని రోజులకే ఆపేసి, యూటర్న్‌ను మూసేసారు. దీంతో ప్రశాంత్‌నగర్ పారిశ్రామిక ప్రాంతానికి వెళ్లడానికి వై జంక్షన్ వద్ద యూటర్న్ చేసుకొని తిరిగి రావాల్సి వస్తుందని వాహనదారులు తెలిపారు. పలువురు వాహనదారులు ప్రశాంత్‌నగర్‌లోని యూటర్న్ వద్ద బారికేడ్‌ను తీసుకొని వస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కార్మికులు, వృద్ధులు చేతులతో వాహనాలను ఆపుతూ రోడ్డు దాటాల్సి పరిస్థితి. సిగ్నల్స్‌ను తిరిగి ఏర్పాటు చేయాలని వాహనదారులు, కార్మికులు కోరుతున్నారు.

మైహోం సంస్థకు అవార్డు



అవార్డు అందుకుంటున్న విజయ్ భాస్కర్‌రెడ్డి

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: సిమెంటు తయారీలో ఉన్నత నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నందుకు మైహోం ఇండస్ట్రీస్ అవార్డు అందుకుంది. ప్రపంచ ప్రమాణాల దినోత్సవం సందర్భంగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, భారత ప్రభుత్వ హైదరాబాద్ శాఖ తరఫున అందించిన ఈ అవార్డు, ప్రశంసా పత్రాన్ని సంస్థ ప్రతినిధులు అందుకున్నట్టు సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు యూనిట్ హెడ్ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. భారత ప్రభుత్వం నిర్దేశించిన మేరకు నాణ్యతా ప్రమాణాలను పాటించడంలో సంస్థ యాజమాన్యం రాజీ పడలేదన్నారు. ఉద్యోగుల సమష్టి కృషితోనే ఈ గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవ్వగా, ఇండస్ట్రీస్ కమిషనర్ మల్సూర్, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (హైదరాబాద్) డైరెక్టర్ పి.వి.శ్రీకాంత్ చేతుల మీదుగా సంస్థ సీనియర్ డీజీఎం విజయ భాస్కర్‌రెడ్డి ఈ అవార్డును అందుకున్నారు.

సీపీఆర్, ప్రాథమిక చికిత్సలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు శివరంజని

జూబ్లీహిల్స్: చిన్నారుల్లో సీపీఆర్, ప్రథమ చికిత్స తదితర అంశాలపై చిన్నారుల వైద్యురాలు శివరంజని అవగాహన కల్పించారు. జూబ్లీహిల్స్‌లోని తాజ్‌మహల్ హోటల్‌లో పలువురు వైద్య నిపుణులతోపాటు గృహిణులు, యువతీయువకులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. చిన్నారుల ఆహారం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. గొంతులో ఏదైనా చిక్కుకుంటే ఊపిరి ఆడకుండా తీవ్ర ఇబ్బంది పడతారన్నారు. వెంటనే ఎలాంటి చికిత్స అందించాలో వివరించారు. చిన్నవయసులోనే గుండెపోటు వస్తే సీపీఆర్ ఎలా చేయాలో చేసి చూపారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లపై లేబుల్ చూడకుండానే అసలు, నకిలీ గుర్తించకుండా కొనుగోలు చేస్తున్నామన్నారు. అవి ప్రమాదకరమన్నారు.

తపాలా శాఖ విశ్రాంత ఉద్యోగుల మౌన దీక్ష



అబిడ్స్ జీపీవో వద్ద మౌన దీక్షలో తపాలా శాఖ విశ్రాంత ఉద్యోగులు

అబిడ్స్, న్యూస్‌టుడే: తమ డిమాండ్లు నెరవేర్చాలని హైదరాబాద్ అబిడ్స్‌లోని డాక్ సదన్ జీపీవో ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి తపాలా శాఖ విశ్రాంత ఉద్యోగుల జేఏసీ బుధవారం మౌన దీక్షకు దిగింది. సుప్రీంకోర్టు నిర్ధారించిన క్యాట్ ఉత్తర్వులను యథాతథంగా అమలు చేయాలని జేఏసీ సభ్యులు డిమాండ్ చేశారు. 1980లో గంటకు రూ.2చొప్పున వేతనంతో తమ సేవలను వినియోగించుకున్నారన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 383 మందిలో 40మంది చనిపోయారన్నారు. న్యాయబద్ధమైన హక్కుల సాధనకు మూడు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్న తపాలా శాఖ పట్టించుకోవడం లేదని వాపోయారు. అత్యున్నత న్యాయస్థానం తీర్పు ప్రకారం అన్ని రకాల రాయితీలు ఇవ్వడంతోపాటు పోస్టల్ డైరెక్టరేట్ ఆదేశాలను అమలు చేయాలని కోరారు. తమ డిమాండ్లు పరిష్కరించేంత వరకు దశలవారీగా ఆందోళన చేస్తామన్నారు. జేఏసీ ఛైర్మన్ దుర్గాప్రసాద్, సభ్యులు మనోహర్, రవికృష్ణ, పి.యాదగిరి, కె.యాదగిరి, కారుణ్య, ఎలిజబెత్ క్రిస్టియన్‌తో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి దాదాపు 200 మంది పాల్గొన్నారు.

ఉచిత ఫొటోగ్రఫీ కోర్సుకు పేర్లు నమోదు చేసుకోండి



గోడపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మామిడి హరికృష్ణ తదితరులు

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: నిరుద్యోగులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, సిగ్మా అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీల సంయుక్తాధ్వర్యంలో ఉచిత ఫొటోగ్రఫీ డిప్లొమా కోర్సు నిర్వహిస్తున్నామని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, అకాడమీ ఛైర్మన్ ఎంసీ శేఖర్‌లు తెలిపారు. బుధవారం కోర్సుకు సంబంధించి గోడపత్రాలను ఆవిష్కరించారు. నవంబరు 14 నుంచి కోర్సు శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31లోపు చరవాణి 80080 21075, 70956 92175లో సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. నగరంలో ఆరు నెలల ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ శిక్షణ ఉంటుందన్నారు.

తేలిన గుంతలు.. రాకపోకలకు ఇబ్బందులు



వర్షాలకు తేలిన గుంతలు



ప్రకాశ్‌నగర్‌లో అధ్వానంగా రోడ్డు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలో పలుచోట్ల రోడ్లు వర్షాలకు కొట్టుకుపోయి గుంతలు తేలాయి. దీంతో రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. తాజాగా రెండు రోజులుగా ఉదయం సమయంలో పడుతున్న వర్షంతో గుంతల్లో నీరు నిలిచి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మరమ్మతులు నిర్వహించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

నెలలుగా.. సమస్యల నెలవుగా



రహదారిపై నిలిచిన నీరు



పక్కన డంప్ చేసిన వ్యర్థాలు

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: కేపీహెచ్‌బీ నాలుగో ఫేజ్‌లోని బస్తీ దవాఖానా రోడ్డులో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. నివాసితులకు నెలల తరబడిగా తిప్పలు తప్పడం లేదు. అడుగు తీసి అడుగేస్తే కాళ్లకు బురద, దుర్వాసన వెలువడుతోంది. పైపులైన్ కోసం తవ్విన రహదారిని జీహెచ్ఎంసీ పలుమార్లు పునరుద్ధరించినా వరద ప్రభావానికి అనతికాలంలోనే చెడిపోతోంది. వర్షమొస్తే రోజులుగా నీరు భారీగా నిలిచిపోతోంది. గుంతలు కనిపించక వాహనదారుల ప్రయాణానికి తీవ్ర విఘాతం కలుగుతోంది. రహదారి అభివృద్ధి చేసిన సమయంలో వ్యర్థాలు కుప్పగా పోసి వదిలేశారు. పక్కనే చెట్లకొమ్మల వ్యర్థాలు డంప్ చేసి తరలించలేదు. చెత్తాచెదారం ప్రభావానికి నీరు మురుగుగా మారుతోంది. వాహనాలు నిలుపుతున్నారు. ఫిర్యాదు చేస్తే పట్టించుకునేవారు లేరని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

ఇష్టారాజ్యంగా చెట్టు నరికేశారు



రంపాల కోతకు గురైన పచ్చని చెట్టు

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: కేపీహెచ్‌బీ పరిధి బ్రాండ్ ఫ్యాక్టరీ-రాజీవ్ రోటరీ మార్గంలోని చెట్టుని ఇష్టారాజ్యంగా నరికేశారు. రంపాలతో కొమ్మలను, చెట్టు కాండం కోసేశారు. కొమ్మల వ్యర్థాలను వరద పారే బాక్స్ డ్రెయిన్‌లో పడేశారు. ఆ ప్రదేశం అంతా చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా మారింది. ఇప్పటికే వరసగా ఉన్న పలుచెట్లు రంపాల కోతకు గురయ్యాయి. వరసగా ఉండే పచ్చని చెట్లు మాయమవడంపై చుట్టుపక్కల వారు, పర్యావరణ ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారాల కోసం ఏళ్లనాటి చెట్లను నరికేస్తుంటే అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ పద్మనాభంను వివరణ కోరగా చెట్టు నరికేసిన విషయమై అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు.



బాక్స్ డ్రెయిన్‌లో పడేసిన చెట్లకొమ్మల వ్యర్థాలు

మానసిక చికిత్సాలయం నుంచి రోగి అదృశ్యం

వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయం నుంచి రోగి అదృశ్యమయ్యాడు. బోరబండ పోలీసుల వివరాలు ప్రకారం.. పెద్దపల్లి జిల్లాకు చెందిన మల్లేష్(45) రాత్రిళ్లు సరిగా నిద్రపోకపోవడం, కనిపించిన వారిని కొట్టడం వంటి పనులు చేస్తుండటంతో ఈనెల 14న మానసిక చికిత్సాలయానికి సోదరులు తీసుకొచ్చారు. మంగళవారం మల్లేష్ అదృశ్యమయ్యాడు. సోదరుడు సాదయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రెండుసార్లు నమ్మించి.. మూడోసారి మోసగించి..

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: ఆభరణాల వ్యాపారి వద్దకు రెండుసార్లు వచ్చి ఆభరణాలు కొనుగోలు చేసి నమ్మించాడు.. మూడోసారి కొనుగోలుకు వచ్చి మోసానికి పాల్పడ్డాడు. బంజారాహిల్స్ పోలీసుల వివరాల ప్రకారం..నాంపల్లికి చెందిన శ్రీనాథ్‌వ్యాస్.. వ్యాపారినంటూ బంజారాహిల్స్ రోడ్ 8లోని ఉత్కర్ష జువెలర్స్‌కు వచ్చాడు. రెండుసార్లు ఆభరణాలు కొని యజమాని బాలాజీపాటిల్‌ను నమ్మించాడు. 2నెలల క్రితం మరోసారి వచ్చి రూ.15 లక్షల ఆభరణాలు కొనుగోలు చేశాడు. డబ్బులు తీసుకురాలేదని, ఇంటికి వెళ్లి పంపిస్తానని నమ్మించి అక్కడి నుంచి జారుకున్నాడు. అప్పటినుంచి డబ్బులు ఎప్పుడిస్తావంటూ యజమాని ఎన్నిసార్లు ఫోన్లు చేసినా సాకులు చెప్తుండటంతో మోసపోయినట్లు గ్రహించి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యువతిపై లైంగిక వేధింపులు

● ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

నారాయణగూడ, న్యూస్‌టుడే: యువతిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఇద్దరిని నారాయణగూడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. నారాయణగూడలో ఉండే ఓ యువతి డిగ్రీ చదువుతోంది. ఇంటర్ చదివే సమయంలో షాబాజుద్దీన్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. అది డిగ్రీ వరకు కొనసాగుతూనే ఉంది. పలుమార్లు ఆ యువతిని లైంగికంగా వేధించసాగాడు. దానికి షాబాజుద్దీన్ స్నేహితుడు షాబాజ్ సహకరించాడు. అంతేకాకుండా షాబాజుద్దీన్.. యువతితో తాను కలిసి ఉన్న చిత్రాలు, వీడియోలను చూపించి బ్లాక్‌మెయిల్ చేయడం మొదలుపెట్టాడు. దాంతో బాధితురాలు నారాయణగూడ పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసిన పోలీసులు ఇద్దరు నిందితుల్ని అదుపులోకి తీసుకున్నారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి నిర్మాణం పేరుతో మోసం.. సంస్థ నిర్వాహకులపై కేసు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: ఇళ్లు కట్టిస్తామని అంగీకరించి కట్టకుండా ఏళ్లు గడిపిన ఓ సంస్థ నిర్వాహకులపై బంజారాహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. కూకట్‌పల్లి ప్రాంతంలో నివసించే ఫజల్ అహ్మద్ తనకున్న 167 గజాల స్థలంలో ఇంటి నిర్మాణం కోసం ఆల్ ఎబౌట్ బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (డిజైన్ అండ్ కన్‌స్ట్రక్ట్) సంస్థకు అప్పగించారు. జీ+3 అంతస్తుల్లో నిర్మించి ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. ఇందుకోసం 2022లో పలు దఫాలుగా రూ.12.25 లక్షలు చెల్లించారు. పనులు ప్రారంభించకుండా సాగదీస్తూ వచ్చారు. 2023లో నిలదీయగా 60 రోజుల్లో రూ.7.50 లక్షలు ఇచ్చేందుకు నిర్మాణదారులు అంగీకరించారు. ఏడాదిన్నర గడుస్తున్నా డబ్బులు ఇవ్వకపోవడంతో సంస్థ హైదరాబాద్ ప్రాజెక్టు డైరెక్టర్ మలిశెట్టి కృష్ణ వరుణ్, బెంగళూరుకు చెందిన సీఈఓ, డైరెక్టర్ ప్రియదర్శి మిశ్రా, బెంగళూరు శాఖకు చెందిన వరుణ్‌రాజ్ గౌడ, గుణశేఖరన్‌పై ఫజల్ అహ్మద్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సంస్థ ప్రతినిధులైన నలుగురిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శేరిలింగంపల్లి

• శేరిలింగంపల్లి • పటాన్‌చెరు

గ్రామీణ రహదారులకు రూ.20.8 కోట్లు: ఎమ్మెల్యే

పటాన్‌చెరు: గ్రామీణ రహదారుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం పటాన్‌చెరు క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు ఇంఛార్జి మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క, జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహల సహకారంతో పటాన్‌చెరు, జిన్నారం, గుమ్మడిదల మండలాల్లో 12 గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి రూ.20.8కోట్ల నిధులు మంజూరుచేశారని చెప్పారు. ఇందుకోసం గతంలో వినతిపత్రాలు సమర్పించామన్నారు. ఆన్ లైన్ విధానంలో టెండర్లు పిలుస్తామని తెలిపారు. లక్డారం, చిన్నకంజర్ల, భానూరు, పాశమైలారం, రామేశ్వరంబండ, జిన్నారం మండలంలోని వావిలాల, జంగంపేట, రాళ్లకత్వ, శివానగర్, కొడకంచి, గుమ్మడిదల మండలంలోని కొత్తపల్లి, నాగిరెడ్డిగూడెం, గుమ్మడిదల, అన్నారం గ్రామాల్లో రహదారుల నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు.

తపాలా శాఖ విశ్రాంత ఉద్యోగుల మౌన దీక్ష

అబిడ్స్: తమ డిమాండ్లు నెరవేర్చాలని అబిడ్స్‌లోని డాక్ సదన్ జీపీవో ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి తపాలా శాఖ విశ్రాంత ఉద్యోగుల జేఏసీ బుధవారం మౌన దీక్షకు దిగింది. సుప్రీంకోర్టు నిర్ధారించిన క్యాట్ ఉత్తర్వులను అమలుచేయాలని జేఏసీ సభ్యులు డిమాండ్ చేశారు. 1980లో గంటకు రూ.2చొప్పున వేతనంతో తమ సేవలు వినియోగించుకున్నారన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి 383 మందిలో 40మంది చనిపోయారన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అన్ని రాయితీలతోపాటు పోస్టల్ డైరెక్టరేట్ ఆదేశాలు అమలుచేయాలని కోరారు. క్యాట్ ఆర్డర్ల ప్రకారం సర్వీస్ క్రమబద్ధీకరణ చేసి... నియామకం ప్రారంభతేదీ నుంచి పేఫిక్సేషన్‌లో ఉన్న అవకతవకలు సరిదిద్దాలి. ఐదో సీపీసీ ప్రకారం ఇంక్రిమెంట్లు, పెన్షనరీ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. జేఏసీ ఛైర్మన్ దుర్గాప్రసాద్, సభ్యులు మనోహర్, రవికృష్ణ, పి.యాదగిరి, కె.యాదగిరి, కారుణ్య, ఎలిజబెత్ క్రిస్టియన్ పాల్గొన్నారు.

ఉచిత ఫొటోగ్రఫీ కోర్సుకు పేర్లు నమోదు చేసుకోండి

బషీర్‌బాగ్: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, సిగ్మా అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీల ఆధ్వర్యంలో ఉచిత ఫొటోగ్రఫీ డిప్లొమా కోర్సు నిర్వహిస్తున్నామని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు హరికృష్ణ, అకాడమీ ఛైర్మన్ ఎంసీ శేఖర్ తెలిపారు. నవంబరు 14 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. ఈనెల 31లోపు 80080 21075, 70956 92175లో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

పాత ఎంఐజీలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం

శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే: పాత ఎంఐజీ కాలనీలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. వ్యర్థాలను తొలగించారు. శేరిలింగంపల్లి సహాయ వైద్యాధికారి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి కార్పొరేటర్ సింధు హాజరై పరిశీలించారు.

ఆస్తి పన్ను వసూలు చేయాలి

శేరిలింగంపల్లి: పూర్తిస్థాయిలో ఆస్తి పన్ను వసూలు చేయాలని జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి పేర్కొన్నారు. జోన్ పరిధిలోని ఉప కమిషనర్లు, ఏఎంసీలు, టాక్స్‌ఇన్‌స్పెక్టర్లతో జోనల్ కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఆయా డాకెట్లవారీగా పన్ను వసూళ్లపై చర్చించారు.

జలమండలి డివిజన్ విభజన

● వేర్వేరుగా తాగునీటి సరఫరా, సీవరేజీ వ్యవస్థ


హఫీజ్‌పేటలోని జలమండలి కార్యాలయం

చందానగర్, న్యూస్‌టుడే: జలమండలి బోర్డు డివిజన్ 15 తాగునీటి సరఫరా, సీవరేజీ వ్యవస్థను రెండు డివిజన్లుగా విడగొట్టారు. గతంలో డివిజన్ 15 3 సబ్ డివిజన్లు, 11 సెక్షన్లతో ఉండేది. 83,543 తాగునీటి నల్లా కనెక్షన్లు ఉన్నాయి. నల్లాల సంఖ్య బాగా పెరిగిపోవడంతో వినియోగదారుల సౌలభ్యం దృష్ట్యా ఇప్పుడు వాటర్ బోర్డు ఉన్నతాధికారులు పలు మార్పులతో సబ్‌డివిజన్లను 4కు పెంచుతూ సెక్షన్ల సంఖ్యను 14కి పెంచారు. కొత్తగా డివిజన్ 17 ఏర్పాటుచేశారు.

ప్రజావాణి హఫీజ్‌పేట్‌లోనే..

తాగునీటి సరఫరా సమస్యలు, మురుగునీటి వ్యవస్థ సరఫరాలో సమస్యల పరిష్కారానికి ప్రతీ సోమవారం జలమండలి ప్రజావాణి కార్యక్రమం జరుగుతుంది. రెండు డివిజన్లకు సంబంధించిన ప్రజల సౌలభ్యం దృష్ట్యా హఫీజ్‌పేట్‌లోని జలమండలి కార్యాలయంలోనే డివిజన్ 15, 17 జనరల్ మేనేజర్లు అందుబాటులో ఉంటారు.

డివిజన్ల పరిధిలోకి వచ్చే సబ్ డివిజన్లు, సెక్షన్లు..

డివిజన్ 15: మాదాపూర్, నల్లగండ్ల రెండు సబ్‌డివిజన్లుగా ఏర్పాటుచేశారు.

సబ్‌డివిజన్ 1 మాదాపూర్‌లో.. మాదాపూర్ 1, మాదాపూర్ 2, కొండాపూర్, డోయెన్స్ టౌన్‌షిప్.

సబ్‌డివిజన్ 2 నల్లగండ్లలో.. నల్లగండ్ల, గచ్చిబౌలి, ఎలక్ట్రికల్ విభాగం సెక్షన్. మొత్తం 7 సెక్షన్లను కలిపి డివిజన్ 15గా ఏర్పాటుచేశారు.

● డివిజన్ మొత్తం 41530 తాగునీటి కనెక్షన్లు ఉన్నాయి. డివిజన్ 15కు బ్రిజేష్‌కుమార్ జీఎంగా కొనసాగుతున్నారు. హఫీజ్‌పేట్‌లోని జలమండలి కార్యాలయం నుంచే సేవలు అందిస్తారు. తాగునీరు, సీవరేజీ వ్యవస్థ సరఫరా సేవల కోసం జీఎం ఫోన్ నం: 9989989679

డివిజన్ 17: ఆర్సీపురం, మియాపూర్ సబ్ డివిజన్లను యథాతథంగా కొనసాగించారు.

సబ్‌డివిజన్ 1 ఆర్సీపురంలో ఆర్సీపురం, పటాన్‌చెరు, ఎలక్ట్రికల్ విభాగం సెక్షన్.

సబ్‌డివిజన్ 2 మియాపూర్‌లో మియాపూర్, హఫీజ్‌పేట్, చందానగర్, దీప్తిశ్రీనగర్ 7 సెక్షన్లతో డివిజన్ 17ను కొత్తగా ఏర్పాటు చేశారు.

● డివిజన్‌లో మొత్తం 42013 నల్లా కనెక్షన్లు ఉన్నాయి. డివిజన్ 17కు జీఎంగా నారాయణ పదవీ బాధ్యతలు చేపట్టారు.

● బోర్డు చేపట్టిన సంస్కరణల్లో డివిజన్ 22 ఎస్‌ఆర్‌నగర్ రద్దు అయ్యింది. ఆ డివిజన్ జీఎంగా ఉన్న నారాయణ తాత్కాలికంగా ఎస్‌ఆర్‌నగర్ జలమండలి కార్యాలయం నుంచే ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. కొత్తగా మాదాపూర్ అయ్యప్ప సొసైటీలో జీఎం కార్యాలయం ఏర్పాటు అయ్యే అవకాశం ఉంది. తాగునీరు, సీవరేజీ వ్యవస్థ సరఫరా సేవల కోసం జీఎం ఫోన్ నం: 99899 88615.

మేమున్నాం.. మీకు తోడుగా

శేరిలింగంపల్లి: 8008573411 మాదాపూర్: 8008573414
మియాపూర్- 7569067467 ఆల్విన్‌కాలనీ -9154945201
రాయదుర్గం - 9848990352,
పటాన్‌చెరు(రూ) - 8008573228
చందానగర్ - 8008555322

చందానగర్, న్యూస్‌టుడే: ? చందానగర్ పీజేఆర్ స్టేడియంలో వాకింగ్ ట్రాక్ పూర్తిస్థాయిలో లేక ఉదయం నడకకు ఇబ్బంది పడుతున్నాం. **- ఆర్.లత, హుడాకాలనీ**

✓ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం. **-వీరానంద్, గేమ్స్ ఇన్‌స్పెక్టర్ స్పోర్ట్స్ విభాగం, శేరిలింగంపల్లి జోన్**

? చందానగర్ రైల్వేస్టేషన్ ముందున్న హుడాకాలనీ ప్రాంతంలో దోమల బెడద ఎక్కువైంది. **-వేణు, హుడాకాలనీ**

* ఫాగింగ్ చేయిస్తాం. **-మోహన్‌రెడ్డి, ఉపకమిషనర్, చందానగర్ సర్కిల్**

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: ? పటాన్‌చెరు మండలం క్యాసారం గ్రామంలో జరుగుతున్న వంతెన నిర్మాణానికి రెండు వైపులా రోడ్డు గుంతలుగా మారింది. రాత్రి సమయంలో ప్రయాణానికి ఇబ్బందిపడుతున్నాం.- సుభాష్, క్యాసారం

✓ ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పాడైంది. గుంతలు పూడ్చేలా చర్యలు తీసుకుంటాం.-నరసింహారెడ్డి, క్యాసారం, పంచాయతీ కార్యదర్శి

? పటాన్‌చెరు మండలం చిన్నకంజర్ల గ్రామానికి చెందిన అనుబంధ గ్రామం మునుగోలికి వెళ్లాలంటే చెరువు గట్టును దాటాల్సి ఉంది. ఎటువంటి రోడ్డు నిర్మించలేదు. ఒక్క కరెంటు స్తంభం లేదు. **-యాదయ్య, చిన్నకంజర్ల**

✓ చెరువు గట్టును సమాంతరం చేసి రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇందుకు పెద్దఎత్తున నిధులు అవసరం ఉంది. దీనిపై అధ్యయనం చేసి నివేదిక అధికారులకు ఇచ్చాం. **- రామకృష్ణ పంచాయతీ కార్యదర్శి, చిన్న కంజర్ల**

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: ? పటాన్‌చెరు అంబేడ్కర్ కూడలిలో రహదారి గుంతలుగా మారింది. **- రమేష్, పటాన్‌చెరు**

✓ రహదారికి నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే రహదారి నిర్మాణం చేపడతాం. **- సురేష్‌కుమార్, ఉపకమిషనర్**

మియాపూర్, న్యూస్‌టుడే: ? దీప్తి శ్రీనగర్ కాలనీ పీజేఆర్ మార్గంలో డ్రైనేజీ రోడ్డు మీదకే పొంగిపొర్లుతుంది. -టీ.కవిరాజు, దీప్తిశ్రీనగర్

✓ ఇక్కడ డ్రైనేజీలైన్ల మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. **- వెంకటేశ్వర్లు, డీజీఎం జలమండలి**

భక్తిశ్రద్ధలతో నాభిశిల ప్రతిష్ఠాపన మహోత్సవం


బోనాలు సమర్పిస్తున్న మహిళలు

గచ్చిబౌలి, న్యూస్‌టుడే: కొత్తగూడ గ్రామంలో బుధవారం నాభిశిల(బొడ్రాయి) ప్రతిష్ఠాపన మహోత్సవం కనులపండువగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేపట్టారు. దేవతామూర్తులకు ఉష్ణోదక స్నానం, అభిషేకం, తైలలేపనం, మంత్ర, యంత్ర స్థాపన, మూర్తి స్థాపన పంచామృత అభిషేకం వంటి పూజలతోపాటు బోనాల సమర్పణ, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తగూడ గ్రామస్థులు తమ కుటుంబసభ్యులతో కలిసి మహోత్సవంలో పాల్గొన్నారు.

త్రోబాల్ విజేతకు ఎమ్మెల్యే అభినందన


బాలికను అభినందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

వివేకానందనగర్‌కాలనీ, న్యూస్‌టుడే: ఇండో థాయ్ ఇంటర్నేషనల్ త్రోబాల్ టెస్ట్ సిరీస్‌లో విజయం సాధించిన మాదాపూర్‌కు చెందిన క్రీడాకారిణి స్వాతియాదవ్‌ను ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అభినందించారు. బుధవారం వివేకానందనగర్‌కాలనీలో ఆయన బాలికను శాలువాతో సత్కరించారు. ఈనెల 10-12వరకు థాయ్‌లాండ్‌లో జరిగిన ఈ పోటీల్లో ఆమె పాల్గొంది. కార్యక్రమంలో మధు, రాజు, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




● గచ్చిబౌలి నానక్‌రాంగూడకు చెందిన భగవాన్‌దాస్‌కు ఎమ్మెల్యే గాంధీ రూ.70వేల సీఎం సహాయనిధి చెక్కు అందజేశారు.

ఓంకార్ వర్ధంతి సభ గోడపత్రిక ఆవిష్కరణ


గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ఎంసీపీఐ(యూ) గ్రేటర్ నేతలు

మియాపూర్, న్యూస్‌టుడే: ఎంసీపీఐ(యూ) వ్యవస్థాపక నేత మద్దికాయల ఓంకార్ వర్ధంతి సభ గోడపత్రికను బుధవారం మియాపూర్‌లో ఆ పార్టీ గ్రేటర్ నాయకులు ఆవిష్కరించారు. గురువారం వరంగల్ జిల్లా గీసుకొండ మండలం మచ్చాపూర్ గ్రామంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర నాయకులు వనం సుధాకర్ తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతోపాటు పేద బడుగు బలహీన వర్గాల ప్రజల హక్కుల కోసం ఆయన ఎన్నో పోరాటాలు చేశారని నేతలు గుర్తు చేసుకున్నారు. పార్టీ రాష్ట్ర గ్రేటర్ నాయకులు అనిల్‌కుమార్, పల్లె మురళి, తాండ్ర కళావతి, భాగ్యమ్మ, అంగడి పుష్ప, వెంకటేశ్వరావు, నర్సింగ్, భూషణం తదితరులున్నారు.

చిత్తం.. చెదిరే చిత్రం

మాదాపూర్, న్యూస్‌టుడే: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం చిత్ర, శిల్పకళా విభాగానికి చెందిన పలువురు విద్యార్థులు గీసిన అందమైన చిత్రాలు బుధవారం మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో కొలువుదీరాయి. విద్యార్థులు తమ ఆలోచనలకు అద్దంపడుతూ మలిచిన రంగురంగుల చిత్రాలు చూడముచ్చటగా ఉన్నాయి. విభిన్న అంశాలను ప్రతిబింబిస్తూ తమదైన శైలీలో యువ చిత్రకారులు ఆవిష్కరించిన బొమ్మలు కనువిందు చేస్తున్నాయి. మొత్తం 16 మంది విద్యార్థులు గీసిన 64 చిత్రాలతో ప్రారంభమైన ప్రదర్శన ఈనెల 20వ తేదీ వరకు కొనసాగనుందని నిర్వాహకులు తెలిపారు.

40 ఏళ్లనాటి లేఅవుట్‌లో కొలతలు


సీఐ నాగరాజుతో ప్లాట్ ఓనర్స్ వాదన

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధి శ్రీవాణి నగర్, చక్రపురి, వెంకటరమణ, బాలాజీ, ఆర్టీసీ కాలనీలకు సంబంధించిన పది పైబడి సర్వే నంబర్లతో ముడిపడి ఉన్న లేఅవుట్లలో బుధవారం సర్వే అధికారులు కొలతలు వేశారు. ఈ భూములు 40 ఏళ్లుగా వివాదాస్పదంగా ఉన్నాయి. ఇటీవల సందర్శించిన హైడ్రా అధికారులకు ఆయా కాలనీవాసులు ఫిర్యాదుచేశారు. ఇతరులు భూ ఆక్రమణ చేసి 40 ఏళ్ల క్రితం ప్లాట్లు కొనుగోలు చేసిన మమ్మల్ని ఇబ్బందిపాలు చేస్తున్నారని ప్లాట్ కొనుగోలుదారులు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. ఇందుకు అనుగుణంగా రంగంలోకి దిగిన జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ఆదేశాల మేరకు పోలీసులు, రెవెన్యూ, సర్వే అధికారుల బృందం భూమి కొలతలు వేశారు. ప్లాట్ ఓనర్స్ ఒక్కసారిగా రావడంతో సీఐ నాగరాజు సర్వే చేస్తున్న ప్రాంతానికి రానివ్వకుండా అడ్డుకున్నారు. భూముల గురించి తెలిసిన వారిని మాత్రమే లోపలికి అనుమతించారు. ఎటువంటి గొడవలు జరగకుండా పోలీసులు ముందస్తు భద్రతా చర్యలు తీసుకున్నారు.

సత్ప్రవర్తనతో ఉంటే రౌడీషీట్ ఎత్తివేసే అవకాశం

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో ఉంటే రౌడీషీట్ ఎత్తివేసే అవకాశం ఉంటుందని డీఎస్పీ రవీందర్‌రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు డీఎస్పీ కార్యాలయంలో బుధవారం రౌడీషీటర్లకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనకుండా ఉండాలన్నారు. నేరాలకు దూరంగా ఉండాలని సూచించారు. అలా ఉండకపోతే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బయట జరిగే వివాదాల్లో తలదూర్చితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. నేరప్రవృత్తి మార్చుకుని కుటుంబాలతో సుఖసంతోషాలతో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీఐ రాజు తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్‌కు మూత

స్పందనకు వందనం

మాదాపూర్, న్యూస్‌టుడే: కొండాపూర్ మసీద్‌బండ రోడ్డులోని హనుమాన్ ఆలయం ఎదుట ప్రధాన రోడ్డుపై మ్యాన్‌హోల్ మూత శిథిలమై ప్రమాదకరంగా మారింది. స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా'కు సమాచారం ఇచ్చారు. శేరిలింగంపల్లి సర్కిల్ ఇంజినీరింగ్ విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందించి కొత్త మూత ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించారు.

ఆల్విన్ కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ రాఘవేంద్ర కాలనీలో మూడేళ్లుగా రోడ్డు గుంతలమయంగా ఉండటంతో ప్రజలు పడుతున్న ఇక్కట్లపై 'ఈనాడు' వరుస కథనాలు రాస్తూ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన అధికారులు రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు.

కలుషిత సమస్యకు పరిష్కారం

చందానగర్: హుడాకాలనీలో తాగునీటి కలుషిత సమస్యకు మరమ్మతులు చేపట్టారు. గతంలో కలుషిత సమస్య పరిష్కారానికి వచ్చిన జలమండలి సిబ్బంది తవ్వకాలు చేసి పనులు ఆపేసిన విషయంపై బుధవారం ఈనాడులో 'తవ్వేసి.. సగంలో వదిలేసి' అనే శీర్షికన చిత్ర వార్త ప్రచురితమైంది. జలమండలి విభాగం డివిజన్ 17 జీఎం నారాయణ, డీజీఎం వెంకటేశ్వర్లు, మేనేజర్ సుబ్రమణ్యరాజు సమస్య ఉన్న ప్రాంతాన్ని సందర్శించారు. మరమ్మతు పనులు మొదలుపెట్టి బారికేడ్లు వేయించారు. డీజీఎం వెంకటేశ్వర్లు స్పందిస్తూ.. తవ్వినచోట సిమెంట్ పైపులైన్ ఉండటంతో జాప్యం జరిగిందని, 2 రోజుల్లో పనులు పూర్తిచేస్తామన్నారు.

విద్యార్థి సంఘం రద్దు అప్రజాస్వామికం:ఎస్‌ఎఫ్‌ఐ

గచ్చిబౌలి: హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం పదవీ కాలం పూర్తికాకముందే యూనియన్‌ను రద్దు చేస్తూ వర్సిటీ అధికారులు ఉత్తర్వులు జారీచేయడాన్ని ఖండిస్తున్నట్లుగా ఎస్‌ఎఫ్ఐ విద్యార్థి సంఘం ఒక ప్రకటనలో వెల్లడించింది. గతేడాది నవంబర్ 11న ఎన్నుకున్న సంఘం అధికారిక పదవీ కాలం పూర్తి కాలేదని పేర్కొన్నారు. దీన్ని విస్మరించి ఈనెల 11న రద్దు చేస్తున్నట్లుగా డీఎస్‌డబ్ల్యూ ఉత్తర్వులు జారీ చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. ఇది రాజ్యాంగంపై నిరంకుశ దాడిగా భావిస్తున్నామని అభిప్రాయపడ్డారు. నిబంధనలను తుంగలోకి తొక్కి జారీ చేసిన రద్దు ఉత్తర్వులను స్టూడెంట్స్ యూనియన్ ప్రతినిధులు తిరస్కరించారని పేర్కొన్నారు. లింగ్డో కమిషన్ మార్గదర్శకాలను అధికారులు పాటించాలని డిమాండ్ చేశారు.

బీఐఎస్ రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో ప్రతిభ


ప్రశంసా పత్రంతో తెహితి

రాయదుర్గం: బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) నిర్వహించిన రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో రాయదుర్గం నాగార్జున పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని మారోజు తెహితి ప్రతిభ చాటింది. కళాశాలల విద్యార్థులతో పోటీ పడి రెండో స్థానంలో నిలిచి బహుమతి అందుకుంది. బీఐఎస్ ఆధ్వర్యంలో జూన్‌లో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఆ బాలిక ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలల విద్యార్థులతో పోటీ పడి వేగంగా సమాధానాలిచ్చి ఆకట్టుకుంది. ఓ ఇంజినీరింగ్ విద్యార్థి ప్రథమస్థానంలో నిలవగా తెహితి ద్వితీయ స్థానం, రాయదుర్గం ఎఫ్‌డీడీఐ విద్యార్థిని తృతీయ స్థానం సాధించారు. మంగళవారం బహుమతి ప్రదానోత్సవంలో ఆమె రూ.3వేల నగదు బహుమతితోపాటు ప్రశంసా పత్రాన్ని అందుకుంది. బుధవారం పాఠశాలలో కరెస్పాండెంట్ ఎ.భరత్‌కుమార్, ప్రిన్సిపల్ సుందరి, ఉపాధ్యాయులు సత్కరించి అభినందించారు.

ఓవైపు అలంకారం.. మరోవైపు ప్రమాదం


హైటెన్షన్ విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగలు.. మరోవైపు పాదబాట సుందరీకరణ..

ఖాజాగూడ చౌరస్తా వద్ద హైటెన్షన్ విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. ఆ స్తంభానికి ఓ తీగ దాన్ని పెనవేసుకుంది. స్తంభం మొత్తం చుట్టేసింది. ఆ తీగలు మరింత పైకి ఎగబాకి హైటెన్షన్ విద్యుత్ తీగలనూ కబళించేలా ఉన్నాయి. పచ్చిగా ఉండే ఆ తీగల నుంచి విద్యుత్ సరఫరా జరిగి ప్రమాదాలకు ఆస్కారముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అక్కడ జీహెచ్ఎంసీ అధికారులు పాదబాట సుందరీకరణ చేపడుతున్నారు. అలంకార మొక్కలు నాటారు. అలంకార మొక్కలూ, పక్కన ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని అటుగా వచ్చేవారు వింతగా చూస్తున్నారు. స్తంభానికి ఉన్న తీగ తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, రాయదుర్గం

భెల్‌లో ఉత్సాహంగా క్రీడా పోటీలు

భెల్ (శేరిలింగంపల్లి) న్యూస్‌టుడే: బీహెచ్‌ఈఎల్‌లో ఇంటర్ యూనిట్ జాతీయస్థాయి క్రీడా పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. భెల్ పీ అండ్ ఎస్డీ ఈడీ శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి హాకీ, లాన్ టెన్నిస్ పోటీలు ఆరంభించారు. స్థానిక జట్లతోపాటు భోపాల్, హరిద్వార్, తిరుచి, రాణిపేట్ ప్రాంతాల నుంచి జట్లు వచ్చాయి. జీఎం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

యంత్రంలో పడి కార్మికుడి దుర్మరణం

రామచంద్రాపురం రూరల్, న్యూస్‌టుడే: నిర్మాణ సంస్థలో పనిచేస్తున్న ఓ కార్మికుడు యంత్రంలో పడి దుర్మరణం చెందాడు. కొల్లూరు సీఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన ఎండీ సగాన్(35) తెల్లాపూర్ మై హోమ్ విపిన్ నిర్మాణ సంస్థలో పనిచేస్తున్నారు. బుధవారం సిమెంట్ కలిపే యంత్రం వద్ద పని చేస్తున్నాడు. అయితే ఆగిపోవడంతో ఏదో తట్టిందనుకొని లోపల చేయి పెట్టి యంత్రాన్ని కదిలిస్తుండగా ప్రమాదవశాత్తు అందులో పడ్డాడు. ఇతర కార్మికులు చూసి కరెంటు ఆపారు. తీవ్ర గాయాలపాలై అక్కడే దుర్మరణం పాలయ్యాడు. అన్న జహంగీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రూ.14 లక్షలు కొట్టేసిన సైబర్ నేరస్థులు

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: రెండు వేర్వేరు కేసుల్లో సైబర్ నేరగాళ్లు రూ.14.06 లక్షలు కొట్టేశారు. పటాన్‌చెరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇనుప సామగ్రి కొనుగోలు చేసేందుకు చిట్కుల్‌కు చెందిన వ్యాపారి ఆన్‌లైన్‌లో అన్వేషించాడు. సగం ధరకే ఇస్తానని ఓ అపరిచిత వ్యక్తి ఆన్‌లైన్‌లో పరిచయమయ్యాడు. సామగ్రి కొనుగోలు చేసే మొత్తంలో సగం ముందు చెల్లించాలనడంతో రూ.9.78లక్షలు ఆన్‌లైన్‌లో పంపాడు. ఎంతకీ సామగ్రి రాకపోవడంతో మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు.

● పటాన్‌చెరు శివారు కాలనీకి చెందిన ఐటీ ఉద్యోగికి గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి లఖ్‌నవూ పోలీసులమని పరిచయం చేసుకున్నారు. మీ ఆధార్‌కార్డుపై సిమ్ తీసుకున్నారని, చట్టవిరుద్ధమైన కార్యక్రమాలు వినియోగిస్తున్నారని, మనీలాండరింగ్ లావాదేవీల్లోనూ ఉందని బెదిరింపులకు దిగారు. ఇది ఎవరికీ తెలియకుండా కేసుల్లో నుంచి తొలగించాలంటే ఖర్చుల కింద కొంత మొత్తం వేయాలని చెప్పారు. బాధితుడు భయపడి రూ.4.28 లక్షలు వారు సూచించిన విధంగా ఆన్‌లైన్ జమచేశాడు. అనంతరం కేసు వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించగా స్పందించకపోవడంతో మోసపోయానని గ్రహించాడు. సైబర్ క్రైమ్, పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్నారు.

స్వేచ్ఛ పార్కు.. ఏదీ స్వచ్ఛత?


పిచ్చిమొక్కలతో విఠల్‌రావునగర్ ఫ్రీడం పార్కు


లోపలికి వెళ్లే వీల్లేకుండా గేట్ల వద్ద వ్యర్థాలు


పార్కుల లోపల వ్యర్థాల డంపింగ్


లోపల వాకింగ్ ట్రాక్ పరిస్థితి

మాదాపూర్ విఠల్‌రావునగర్‌లోని ఫ్రీడం (స్వేచ్ఛా) పార్కు దుస్థితి ఇది. స్వతంత్ర భారత వజ్రోత్సవాలను పురస్కరించుకొని హైటెక్‌సిటీలోని పలు పార్కులను అభివృద్ధి చేసేందుకు జీహెచ్ఎంసీ అధికారులు నిర్ణయించారు. విఠల్‌రావునగర్ పార్కును ఎంపిక చేసిన అధికారులు కేవలం గేట్లకు రంగులు వేశారు. తర్వాత వాకింగ్ ట్రాక్ పనులు అసంపూర్తిగా వదిలేశారు. మూడేళ్లు దాటినా పార్కు అభివృద్ధిపై అధికారులు శ్రద్ధ చూపడం లేదు. ఫలితంగా అడుగుపెట్టే వీల్లేకుండా పార్కు అధ్వానంగా తయారైంది. మొత్తం పిచ్చిమొక్కలతో నిండి, చెత్తాచెదారం పేరుకుపోయింది. అధికారులు స్పందించి పార్కును శుభ్రం చేసి అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మాదాపూర్

హైవేపై ఆగిన కంటైనర్.. నిలిచిన వాహనాలు



పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ ఎస్బీఐ మలుపు వద్ద కంటైనర్ కారు ఢీకొనడంతో కంటైనర్ బ్రేక్ ఫెయిల్ అయ్యి జాతీయ రహదారిపై నిలిచిపోయింది. దీంతో జాతీయ రహదారిపై పటాన్‌చెరు వైపు వచ్చే రహదారిపై పూర్తిగా ట్రాఫిక్ చాలా దూరం నిలిచిపోయింది. కంటైనర్ పక్కకు జరిపేందుకు కొంత సమయం పట్టడంతో వాహనదారులు ఇబ్బందిపడ్డారు. కంటైనర్‌ను ట్రాఫిక్ సిబ్బంది పక్కకు జరపడంతో ట్రాఫిక్‌ను యథావిధిగా పునరుద్ధరించారు. –న్యూస్‌టుడే, పటాన్‌చెరు అర్బన్

కుత్బుల్లాపూర్

కనులపండువగా పవిత్రోత్సవాలు



పూజలు చేస్తున్న వేద పండితులు

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: జీడిమెట్ల డివిజన్ పరిధి ఎస్సీఎల్ కాలనీ సొత్‌లోని కళ్యాణ వేంకటేశ్వరస్వామి సహిత అభయాంజనేయస్వామి ఆలయ చతుర్థ పవిత్రోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. దేవాలయ కమిటీ నేతృత్వంలో శాంతిపాఠం, అగ్నిఆరాధన, మూలమంత్రహోమం, విష్ణు సహస్రనామ పారాయణం, ద్వారాతోరణ పూజ, మూర్తి కుంభారాధన, పూర్ణాహుతి నిర్వహించారు. దేవాలయ కమిటీ ఛైర్మన్ సాంబశివరాజు, కమిటీ నేతలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ఉచిత ఫొటోగ్రఫీ కోర్సుకు పేర్లు నమోదు చేసుకోండి

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: నిరుద్యోగులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, సిగ్మా అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీల సంయుక్తాధ్వర్యంలో ఉచిత ఫొటోగ్రఫీ డిప్లొమా కోర్సు నిర్వహిస్తున్నామని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, అకాడమీ ఛైర్మన్ ఎంసీ శేఖర్‌లు తెలిపారు. బుధవారం కోర్సుకు సంబంధించి గోడపత్రాలను ఆవిష్కరించారు. నవంబరు 14 నుంచి కోర్సు శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31లోపు చరవాణి 80080 21075, 70956 92175లో సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. నగరంలో ఆరు నెలల ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ శిక్షణ ఉంటుందన్నారు.

శివ శివాని కళాశాలలో ఫుడ్ ఫెస్టివల్

కొంపల్లి(పేట్‌బషీరాబాద్), న్యూస్‌టుడే: కొంపల్లి పరిధిలోని శివ శివాని డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు ఆహార పదార్థాలను తయారు చేసి ప్రదర్శించారు. విద్యా సంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ శైలేష్ సంపత్, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ దీపా సంపత్, ప్రిన్సిపల్ మమత తదితరులు ఫుడ్ ఫెస్టివల్‌ను పరిశీలించారు.

సీపీఆర్, ప్రాథమిక చికిత్సలపై అవగాహన

జూబ్లీహిల్స్: సీపీఆర్, ప్రథమ చికిత్స తదితర అంశాలపై చిన్నారుల వైద్యురాలు శివరంజని అవగాహన కల్పించారు. జూబ్లీహిల్స్‌లోని తాజ్ మహల్ హోటల్‌లో వైద్యనిపుణులతోపాటు గృహిణులు, యువతీయువకులు హాజరయ్యారు. చిన్నారుల ఆహార విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. గొంతులో ఏదైనా చిక్కుకుంటే ఊపిరి ఆడకుండా తీవ్ర ఇబ్బంది పడతారన్నారు. వెంటనే ఎలాంటి చికిత్స అందించాలో వివరించారు. చిన్నవయసులోనే గుండెపోటు వస్తే సీపీఆర్ ఎలా చేయాలో చేసి చూపారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లపై లేబుల్ చూడకుండానే అసలు, నకిలీ గుర్తించకుండా కొనుగోలు చేస్తున్నామన్నారు. అవి ప్రమాదకరమన్నారు.

ఖాళీ కుర్చీతో కాలం వెళ్లదీత

● కమిషనర్ లేక గాడి తప్పుతున్న నిజాంపేట నగర పాలక సంస్థ

నిజాంపేట, న్యూస్‌టుడే: మున్సిపల్ కార్పొరేషన్లలో నిజాంపేట అత్యంత కీలకమైనది. ఇక్కడ ఐఏఎస్ క్యాడర్ అధికారిని కమిషనర్‌గా నియమించాల్సిన అవసరం ఉంది. కానీ ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన కమిషనర్లలో ఒక్కరు తప్ప మిగతా వారంతా గ్రూపు-2 అధికారులే. వారిలోనూ ఎవరూ పూర్తిస్థాయిలో సేవలు అందించడం లేదు. రకరకాల కారణాలతో అర్ధాంతరంగా వెళ్లిపోతున్నారు. దీంతో పాలన గాడితప్పుతుందనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతుంది. ఇటీవల వరకు ఇక్కడ పనిచేసిన కమిషనర్ వచ్చిన నెల రోజులకే దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. దీంతో ప్రస్తుతం ఆ కుర్చీ ఖాళీగానే ఉంది.

అధికారులు వచ్చారు...వెళ్లారు

నిజాంపేట, బాచుపల్లి, ప్రగతి నగర్ పంచాయతీల విలీనంతో జులై 2018 నుంచి నిజాంపేట పురపాలక సంఘంగా ఆవిర్భవించింది. ఆ తర్వాత 2019 నుంచి దాని హోదాను మరింత పెంచుతూ నిజాంపేట ప్రత్యేక నగర పాలక సంస్థగా రూపుదిద్దారు. దాదాపు 2.50 లక్షల జనాభా ఉండగా.. సమస్యలూ అంతే స్థాయిలో ఉన్నాయి. ఇతర ప్రాంతం నుంచి బదిలీపై వచ్చే అధికారులు ప్రాంతీయ సమస్యలు, పరిపాలన తీరుపై అవగాహన పెంచుకోవడానికి కనీసం ఆరు నెలలైనా పడుతుంది. కానీ ఇక్కడికి వచ్చే అధికారులు పాలనపై పట్టు సాధించేలోపే వివిధ కారణాలతో బదిలీ అయి వెళ్లిపోతున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన అధికారుల్లో డా.బి.గోపి మినహా మిగతా అధికారులంతా (గ్రూపు-2 స్థాయి అధికారులే. దాదాపు ఏడాదిన్నర పాటు ఆయన నగర పాలక సంస్థ పరిపాలనను గాడిన పెట్టారు. అనంతరం ఆయన వరంగల్ కలెక్టర్‌గా పదోన్నతిపై వెళ్లాక ఇక్కడ పరిపాలన గాడి తప్పిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.



నిజాంపేట నగర పాలక సంస్థ కార్యాలయం

నాయకుల ఒత్తిడులే కారణమా..?

నిజాంపేట నగర పాలక సంస్థ కమిషనర్ రామకృష్ణారావు ఇటీవల ఆకస్మికంగా బదిలీ కాగా ఆయన స్థానంలో దేవులపల్లి సౌజన్య ఆగస్టు 30న బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ప్రజాప్రతినిధులు, నాయకుల ఒత్తిడులకు తట్టుకోలేక వచ్చిన నెల రోజులకే ఆమె దీర్ఘకాలిక సెలవుపై వెళ్లినట్టు తెలుస్తోంది. దీంతో పక్షం రోజులుగా పాలనాధికారి లేకుండా ఇక్కడ అధికారిక కార్యకలాపాలు సాగుతున్నాయి. ప్రస్తుత ఇక్కడ ప్రజాప్రతినిధుల పాలన మరో రెండు నెల్లలో పూర్తవుతుంది. ఈ తరుణంలో కొత్త అధికారిని పంపుతారా.. లేదా? అనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. తాను ఎట్టిపరిస్థితుల్లోనూ నిజాంపేటకు వెళ్లేది లేదంటూ సౌజన్య ఉన్నతాధికారుల వద్ద మొర పెట్టుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ తరుణంలో ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందనేది సర్వత్రా ఆసక్తిగా మారింది.

మేమున్నాం.. మీకు తోడుగా..

కుత్బుల్లాపూర్ - 80085 73403, దుండిగల్ - 80085 73410
షాపూర్‌నగర్: 8008573404, పేట్‌బషీరాబాద్: 8008573405
నిజాంపేట: 8008573423, జీడిమెట్ల: 8008574405

కుత్బుల్లాపూర్, న్యూస్ టుడే: ? చింతల్ అంబేద్కర్ నగర్ ప్రధాన రహదారిలో మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు రోడ్డుపై పొంగి పొర్లుతోంది. దుర్గంధం వ్యాపిస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.
- ఉపేంద్ర చారి, అంబేద్కర్ నగర్

✓ వెంటనే సిబ్బందిని పంపించి మ్యాన్‌హోళ్లలో పేరుకుపోయిన పూడిక తీయించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.
- అశోక్, జీఎం జలమండలి కుత్బుల్లాపూర్ డివిజన్

? సూరారం ప్రధాన రహదారి సాయిబాబా గుడి ఎదురుగా విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. **- సూర్యనారాయణ, వెంకట్రామ్ నగర్**

✓ క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వెలగని దీపాలను పునరుద్ధరిస్తాం.
- రఘుపతిరెడ్డి, డీఈ ఎలక్ట్రికల్ విభాగం

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: ? వసుధ అపార్టుమెంట్ నుంచి వసంత్‌విహార్ కాలనీకి వెళ్లే దారిలో మ్యాన్‌హోల్ పాడైపోయింది. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. **- చింతల మానస్, వసంత్‌విహార్ కాలని**

✓ మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేసి ప్రమాదాలు నివారిస్తాం.
- శివప్రసాద్, జలమండలి మేనేజరు

మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు

స్పందనకు వందనం

దుండిగల్, న్యూస్‌టుడే: మల్లంపేట ఆటోస్టాండ్ సమీపంలో మ్యాన్‌హోల్ నుంచి మురుగు రోడ్డుపై పొంగి పొర్లుతున్న విషయాన్ని స్థానికుడు హన్మంతరావు మంగళవారం మేమున్నాం మీకు తోడుగా దృష్టికి తీసుకొచ్చారు. దీంతో సమస్యను న్యూస్‌టుడే దుండిగల్ పురపాలిక కమిషనర్ సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి బుధవారం పారిశుద్ధ్య సిబ్బందితో మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించారు.

రాజ్యాంగాన్ని పాఠ్యాంశంలో చేర్చాలని పూజలు



అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాల వేస్తున్న హనుమంత్‌రెడ్డి

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: భారత రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని సూరారంలోని బీఆర్ అంబేడ్కర్ భవనంలో దళిత నాయకుడు అంజన్న నిర్వహిస్తున్న నిత్యపూజల కార్యక్రమం బుధవారం 62వ రోజుకు చేరుకుంది. దీనికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి కొలను హనుమంత్ రెడ్డి హాజరయ్యారు. దళిత సంఘాల నాయకులతో కలిసి ఆయన అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హనుమంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని పాఠ్యాంశంలో చేర్చాలని చేపడుతున్న ఉద్యమానికి తమ మద్దతు ఉంటుందన్నారు. న్యాయమైన కోరికను ప్రభుత్వం పరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా దళిత సేన అధ్యక్షుడు అవిజె జేమ్స్, కోశాధికారి భాస్కర్, ఛైర్మన్ గట్టు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో పారిశుద్ధ్యం నిర్వహించాలి



సమీక్షలో మాట్లాడుతున్న జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ సీఎన్ రఘుప్రసాద్

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే: పక్కా ప్రణాళికతో సంపూర్ణ పారిశుద్ధ్య నిర్వహణకు కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగాలని జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ సీఎన్ రఘుప్రసాద్ అన్నారు. పత్యేక పారిశుద్ధ్య నిర్వహణపై ఆయన జంట సర్కిళ్ల క్షేత్రస్థాయి పారిశుద్ధ్య సహాయ పర్యవేక్షకుల(ఎస్ఎఫ్ఏ)తో బుధవారం సమీక్ష నిర్వహించి మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని సూచించారు. రహదారుల పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారంతో పాటు నిర్మాణ వ్యర్థాల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల ఉప కమిషనర్లు నర్సింహ, మల్లారెడ్డిలు, సహాయ వైద్యాధికారులు కవిత, మమత తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా ఉండాలి



పోలీసుల విధులు, బాధ్యతలు తెలియజేస్తున్న పేట్‌బషీరాబాద్ సీఐ విజయవర్ధన్

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: పోలీసులు విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని పేట్‌బషీరాబాద్ సీఐ కె.విజయవర్ధన్ సూచించారు. మేడ్చల్ పోలీస్ శిక్షణా కేంద్రంలో శిక్షణ పొందిన 54 మహిళలు, 17 మంది పురుషులకు ఠాణాలో విధులు, విధి విధానాలు, కోర్టు విధులపై తర్ఫీదు ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పోలీసు కొలువుతో ప్రజలకు, బాధితులకు న్యాయం చేసే అవకాశం ఉంటుందన్నారు. నైతిక విలువలు పాటించి ఉద్యోగంలో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు ప్రవీణ్‌కుమార్, ధర్మేశ్, సురేందర్‌రెడ్డి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముందు నిలిపిన కారు దహనం

● వరుస ఘటనలతో భీతిల్లిన కుటుంబ సభ్యులు



కాలిపోయిన కారు

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే: ఇంటి ముందు నిలిపిన కారును గుర్తుతెలియని వ్యక్తులు తగులబెట్టిన సంఘటన సూరారం ఠాణా పరిధిలో జరిగింది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. సూరారం కాలనీలో నివాసముంటున్న సాయి చిరంజీవి ఓ ప్రైవేటు సంస్థలో పని చేసి ఇటీవల రిటైర్ అయ్యారు. మంగళవారం రాత్రి ఆయన తన కారును ఇంటి ముందు నిలిపి ఉంచారు. బుధవారం తెల్లవారు జామున కారులో భారీ ఎత్తున మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పేలోపు పూర్తిగా కాలిపోయింది. సీసీ ఫుటేజీల్లో నిక్షిప్తమైన దృశ్యాలను పోలీసులు పరిశీలించి ఓ యువకుడు ఈ ఘటనకు పాల్పడ్డాడని గుర్తించారు. ఈ నెల 7వ తేదీ అర్ధరాత్రి సైతం ఆయన ఇంట్లో అగ్ని ప్రమాదం జరిగింది. కుమార్తె పెళ్లి కోసం సమకూర్చుకున్న సామగ్రి, ఫర్నిచర్ పూర్తిగా కాలిపోవడంతో సుమారు రూ.5 లక్షల మేర ఆస్తినష్టం కలిగింది. వరుస ఘటనలతో ఆయన కుటుంబ సభ్యులు భీతిల్లుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తపాలా శాఖ విశ్రాంత ఉద్యోగుల మౌన దీక్ష



జీపీవో వద్ద తపాలా శాఖ విశ్రాంత ఉద్యోగులు

అబిడ్స్, న్యూస్‌టుడే: తమ డిమాండ్లు నెరవేర్చాలని హైదరాబాద్ అబిడ్స్‌లోని డాక్ సదన్ జీపీవో ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి తపాలా శాఖ విశ్రాంత ఉద్యోగుల జేఏసీ బుధవారం మౌన దీక్షకు దిగింది. సుప్రీంకోర్టు నిర్ధారించిన క్యాట్ ఉత్తర్వులను యథాతథంగా అమలు చేయాలని జేఏసీ సభ్యులు డిమాండ్ చేశారు. 1980లో గంటకు రూ.2 చొప్పున వేతనంతో తమ సేవలను వినియోగించుకున్నారన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 383 మందిలో 40మంది చనిపోయారన్నారు. న్యాయబద్ధమైన హక్కుల సాధనకు మూడు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్న తపాలా శాఖ పట్టించుకోవడం లేదని వాపోయారు. అత్యున్నత న్యాయస్థానం తీర్పు ప్రకారం అన్ని రకాల రాయితీలు ఇవ్వడంతో పాటు పోస్టల్ డైరెక్టరేట్ ఆదేశాలను అమలు చేయాలని కోరారు. క్యాట్ ఆర్డర్ల ప్రకారం సర్వీస్ క్రమబద్ధీకరణ చేసి... నియామకం ప్రారంభ తేదీ నుంచి పే ఫిక్సేషన్‌లో ఉన్న అవకతవకలను వెంటనే సరిదిద్దాలి. ఐదో సీపీసీ(సెంట్రల్ పే రివిజన్ కమిషన్) ప్రకారం ఇంక్రిమెంట్లు, పెన్షనరీ బెనిఫిట్స్ వెంటనే ఇవ్వాలని కోరారు. తమ డిమాండ్లు పరిష్కరించేంత వరకు దశలవారీగా ఆందోళన చేస్తామన్నారు. జేఏసీ ఛైర్మన్ దుర్గాప్రసాద్, సభ్యులు మనోహర్, రవికృష్ణ, పి.యాదగిరి, కె.యాదగిరి, కారుణ్య, ఎలిజబెత్ క్రిస్టియన్‌తో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి దాదాపు 200 మంది పాల్గొన్నారు.

కుంగిన మ్యాన్‌హోల్.. తప్పని తిప్పలు



శ్రీదుర్గాఎస్టేట్స్ కాలనీ మూల మలుపు వద్ద..

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: సుచిత్ర కూడలి నుంచి కుత్బుల్లాపూర్ గ్రామానికి వెళ్లే దారిలో శ్రీదుర్గాఎస్టేట్స్ వద్ద మ్యాన్‌హోల్ కుంగింది. ఫలితంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులు నిత్యం ఈ దారిలోనే రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకోక పోవడం గమనార్హం. రాత్రి వేళలో కుంగిన మ్యాన్‌హోల్ కనిపించకపోవడంతో ఇప్పటికే పలువురు ద్విచక్రవాహనదారులు, పాదచారులు ప్రమాదాలబారిన పడ్డారు. దీనికి తోడు మ్యాన్‌హోల్ సైజు కిందికి ఉండటంతో తరచూ మురుగంతా రోడ్డుపై పారుతోంది. అధికారులు చొరవ తీసుకుని మ్యాన్‌హోల్ ఎత్తు పెంచాలని స్థానికులు కోరారు. ఈ విషయమై 'న్యూస్‌టుడే' జలమండలి మేనేజరు శివప్రసాద్‌ను సంప్రదించగా.. పరిశీలించి ప్రమాదాలు జరగకుండా మ్యాన్‌హోల్ ఎత్తు పెంచుతామన్నారు.

నాలుగేళ్ల చిన్నారిపై కుక్క దాడి



గాయంతో అక్షిత

నిజాంపేట, న్యూస్‌టుడే: పాఠశాల నుంచి ఇంటికి వెళ్తున్న చిన్నారిపై వీధికుక్క దాడి చేసిన సంఘటన దుండిగల్‌లో జరిగింది. దుండిగల్ అయిదవ వార్డులో మంత్రి మధు, కృష్ణవేణి దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బుధవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో పాఠశాల నుంచి కృష్ణవేణి కుమార్తెలను ఇంటికి తీసుకొస్తుండగా.. దారి మధ్యలో వీధికుక్క వెంబడించింది. భయంతో ఎల్‌కేజీ చదువుతున్న చిన్న కుమార్తె అక్షిత(4) పరుగు తీస్తూ కింది పడింది. దీంతో చిన్నారిపై కుక్క దాడి చేయడంతో తలకు గాయమైంది. దీన్ని గమనించిన స్థానికులు శునకాన్ని తరిమికొట్టారు. గాయపడిన చిన్నారి ఆరోగ్యం మెరుగ్గానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

ప్రభుత్వం పట్టించుకోకపోతే రంగంలోకి కేంద్ర ఏజెన్సీలు: ఈటల



బస్తీవాసులతో మాట్లాడుతున్న ఎంపీ రాజేందర్

రెజిమెంటల్ బజార్, న్యూస్‌టుడే: కొన్నాళ్లుగా నగరంలో దేవాలయాలపై దాడులు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, కేంద్ర ఏజెన్సీలను రంగం లోకి దింపుతామని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం రాత్రి ఆయన కుమ్మరిగుడలోని ప్రార్థన మందిరాన్ని సందర్శించారు. ఘటనపై ప్రభుత్వం స్పందించి చర్య తీసుకోవాలని హెచ్చరించారు. రాష్ట్రంలో పోలీసు యంత్రాంగం, ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కార్పొరేటర్ కొంతం దీపిక, నాయకులు పాల్గొన్నారు.

మైహోం సంస్థకు పురస్కారం



అవార్డు అందుకుంటున్న విజయ్ భాస్కర్‌రెడ్డి

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: సిమెంటు తయారీలో ఉన్నత నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నందుకు మైహోం ఇండస్ట్రీస్ అవార్డు అందుకుంది. ప్రపంచ ప్రమాణాల దినోత్సవం సందర్భంగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ భారత ప్రభుత్వ హైదరాబాద్ శాఖ తరఫున అందించిన ఈ అవార్డు, ప్రశంసా పత్రాన్ని సంస్థ ప్రతినిధులు అందుకున్నట్లు సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు యూనిట్ హెడ్ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. భారత ప్రభుత్వం నిర్దేశించిన మేరకు నాణ్యతా ప్రమాణాలను పాటించడంలో సంస్థ యాజమాన్యం రాజీ పడలేదన్నారు. ఉద్యోగుల సమష్టి కృషితోనే ఈ గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవ్వగా, ఇండస్ట్రీస్ కమిషనర్ మల్సూర్, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (హైదరాబాద్) డైరెక్టర్ పి.వి.శ్రీకాంత్ చేతుల మీదుగా సంస్థ సీనియర్ డీజీఎం విజయ భాస్కర్‌రెడ్డి ఈ అవార్డును అందుకున్నారు.

పార్కు అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థ సహకారం



శిలాఫలకం వద్ద కార్పొరేటర్ విజయలక్ష్మి, యూఎస్‌టీ ప్రతినిధులు


నిజాంపేట, న్యూస్‌టుడే: హరితవనం కాలనీలోని ఎకరా విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన బొంగుల కుంటకు సీఎస్ఆర్ పథకం కింద యూఎస్‌టీ అనే సంస్థ గతంలో రూ.5 లక్షలు విరాళం ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఆ సంస్థ ప్రతినిధులను బుధవారం కార్పొరేటర్ మన్నెం విజయలక్ష్మి సన్మానించారు. యూఎస్‌టీ సెంటర్ హెడ్ వెంకట పేరం, కాలనీ ప్రతినిధులు సుబ్బారావు, కొండమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

యువతిపై లైంగిక వేధింపులు

● ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

నారాయణగూడ, న్యూస్‌టుడే: యువతిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఇద్దరిని నారాయణగూడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. నారాయణగూడలో ఉండే ఓ యువతి డిగ్రీ చదువుతోంది. ఇంటర్ చదివే సమయంలో షాబాజుద్దీన్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. అది డిగ్రీ వరకు కొనసాగుతూనే ఉంది. పలుమార్లు ఆ యువతిని లైంగికంగా వేధించసాగాడు. దానికి షాబాజుద్దీన్ స్నేహితుడు షాబాజ్ సహకరించాడు. అంతేకాకుండా షాబాజుద్దీన్.. యువతితో తాను కలిసి ఉన్న చిత్రాలు, వీడియోలను చూపించి బ్లాక్‌మెయిల్ చేయడం మొదలుపెట్టాడు. దాంతో బాధితురాలు నారాయణగూడ పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసిన పోలీసులు ఇద్దరు నిందితుల్ని అదుపులోకి తీసుకున్నారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఈఎన్‌టీలో అధునాతన పురోగతులపై కాన్ఫరెన్స్ 18 నుంచి



మారేడుపల్లి షెనాయ్ నర్సింగ్ హోం ఆసుపత్రిలో పోస్టర్ విడుదల చేస్తున్న వైద్యులు

మారేడుపల్లి, న్యూస్‌టుడే: ఈఎన్‌టీలో అధునాతన పురోగతులపై సౌత్ జోన్ ఈఎన్‌టీ సర్జన్స్ కాన్ఫరెన్స్ షామీర్‌పేట ఆలంకృత రిసార్ట్‌లో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఆఫ్ ఓటోలరింగాలజిస్ట్ ఆఫ్ ఇండియా టీజీ సౌత్ కాన్ఫరెన్స్ ఆర్గనైజింగ్ ఛైర్మన్ డాక్టర్ డీఎస్ దీనదయాల్ తెలిపారు. ఈస్ట్ మారేడుపల్లిలోని షెనాయ్ నర్సింగ్ హోమ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కాన్ఫరెన్స్‌ను తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రారంభించనున్నారని తెలిపారు. వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వైస్ ఛాన్సలర్ కరుణాకర్ రెడ్డి హాజరు కానున్నట్లు చెప్పారు. ప్రకృతి, సంస్కృతి, సైన్స్ అండ్ టెక్నాలజీ కలిసే 'బేసిక్స్ అండ్ బియాండ్' అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక తదితర దక్షిణాది రాష్ట్రాల నుంచి వెయ్యి మందికి పైగా ప్రతినిధులు హాజరు కానున్నారని చెప్పారు. ఓటోలరింగాలజిస్ట్ ఆఫ్ ఇండియా టీజీ సౌత్ కాన్ఫరెన్స్ సమన్వయకర్త డాక్టర్ డీ ద్వారకానాథ్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ఈఎన్‌టీ వేగంగా అభివృద్ధి చెందుతుందని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి సాంకేతికతలతో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని వెల్లడించారు.

ఉద్యోగం పేరుతో మోసం

యూసుఫ్‌గూడ: ఉద్యోగం పేరుతో మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని ప్రకాశం జిల్లాకు చెందిన వైష్ణవి మధురానగర్‌లోని యోగిత లేడీస్ హాస్టల్‌లో ఉంటుంది. గతంలో ఓ రియల్ ఎస్టేట్ కంపెనీలో పనిచేస్తున్న సమయంలో సంగారెడ్డి జిల్లా ఝరాసంఘం ప్రాంతానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కమ్మరి వీరేందర్ పరిచయమయ్యాడు. టెక్ మహేంద్రలో ఉద్యోగం కల్పిస్తానని నమ్మించాడు. ఆగస్టు 8న క్విక్ సన్ సాఫ్ట్‌వేర్ కన్సల్టెన్సీ కంపెనీలో ఇంటర్వ్యూ నిర్వహించి వెబ్ డిజైనర్‌గా ఉద్యోగానికి ఎంపికైనట్లు చెప్పారు. ఉద్యోగానికి ల్యాప్‌టాప్ అవసరమని, అందుకు రూ.50 వేలు చెల్లించాలని వీరేందర్ చెప్పడంతో ఆగస్టు 12న వైష్ణవి రూ.20 వేలు గూగుల్ పే చేసింది. అనంతరం ఆగస్టు 17 నుంచి ఈనెల 9 వరకు పలు దఫాలుగా వీరేందర్‌కు రూ.3.5 లక్షలను చెల్లించింది. మోసపోయానని గ్రహించి వీరేందర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రెండుసార్లు నమ్మించి.. మూడోసారి మోసగించి..

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: ఆభరణాల వ్యాపారి వద్దకు రెండుసార్లు వచ్చి ఆభరణాలు కొనుగోలు చేసి నమ్మించాడు.. మూడోసారి ఆభరణాలు కొనుగోలుకు వచ్చి మోసానికి పాల్పడ్డాడు. బంజారాహిల్స్ పోలీసుల వివరాల ప్రకారం.. నాంపల్లికి చెందిన శ్రీనాథ్ వ్యాస్.. వ్యాపారినంటూ బంజారాహిల్స్ రోడ్ 8లోని ఉత్కర్ష జువెలర్స్‌కు వచ్చాడు. డబ్బులిచ్చి రెండుసార్లు ఆభరణాలు కొని యజమాని బాలాజీపాటిల్‌ను నమ్మించాడు. 2 నెలల క్రితం మరోసారి వచ్చి రూ.15 లక్షల ఆభరణాలు కొనుగోలు చేశాడు. డబ్బులు తీసుకురాలేదని, ఇంటికి వెళ్లి పంపిస్తానని యజమాని నమ్మించి అక్కడి నుంచి జారుకున్నాడు. అప్పటినుంచి డబ్బులు ఎప్పుడిస్తావంటూ యజమాని ఎన్నిసార్లు ఫోన్లు చేసినా ఏదో ఒక సాకు చెప్తుండటంతో మోసపోయినట్లు గ్రహించిన యజమాని బుధవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్లు అధ్వానం.. ప్రయాణికులకు అసౌకర్యం

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన వర్షాలకు జీడిమెట్ల డివిజన్ పరిధిలోని అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. వాహనదారులు, పాదచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కుత్బుల్లాపూర్ నుంచి జీడిమెట్ల, పేట్‌బషీరాబాద్ ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు గోదావరిహోమ్స్ కాలనీ, గాయత్రినగర్ కాలనీల మీదుగా రాకపోకలు సాగిస్తారు. దారి గుంతలమయమైంది. 44వ జాతీయ రహదారి నుంచి స్ప్రింగ్‌ఫీల్డ్ కాలనీకి వెళ్లే రహదారిలో జలమండలి అధికారులు లీకేజీకి మరమ్మతులు చేసేందుకు గుంత తవ్వారు. నీటి సరఫరా జరుగుతున్నప్పుడు వాల్వ్ ఊడిపోయి మార్గంలో తాగునీరు నిలిచింది. నాలుగైదు రోజులపాటు చిత్తడిగా ఉంటోంది. రాత్రి వేళల్లో పాదచారులు అదుపు తప్పి పడిపోతున్నారు.

భూగర్భ డ్రైనేజీ పైపులైన్

అయోధ్యనగర్ నుంచి వినాయకనగర్‌కు వెళ్లే దారిలో ఇటీవల జలమండలి అధికారులు భూగర్భ డ్రైనేజీ పైపులైన్ నిర్మించారు. పైపులైను కోసం తవ్విన గుంతలను పూడ్చలేదు. రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి జీడిమెట్ల డివిజన్‌లో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



జాతీయ రహదారి నుంచి స్ప్రింగ్‌ఫీల్డ్ కాలనీకి వెళ్లే దారి దుస్థితి



అయోధ్యనగర్ నుంచి వినాయకనగర్ వెళ్లే మార్గం..

ప్రతిపాదనలు పంపాం

- మహదేవ్ అనురాగ్, ఏఈ, జీడిమెట్ల డివిజన్

దెబ్బతిన్న మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేయిస్తాం.